


- నేడు పొదిలికి చంద్రబాబు, గిద్దలూరుకు పవన్ కల్యాణ్
- రేపు దర్శిలో టీడీపీ అధినేత రోడ్‌షో
- 9న ఇద్దరూ ఒంగోలు రాక
- మూడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా మందకృష్ణ ప్రచారం
- ఇప్పటికే పర్యటించిన లోకేష్, బాలకృష్ణ
- శ్రేణుల్లో మరింత ఉత్సాహం


ప్రచారంలో సైకిల్ స్పీడు


కనిగిరిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కృష్ణమాదిగ, పక్కన టీడీపీ అభ్యర్థి ఉగ్ర

ఒంగోలు, మే 2 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో టీడీపీ దూకుడు పెంచింది. ఇప్పటికే కూటమి తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అలాగే వారి విజయాన్ని కాంక్షిస్తూ రెండు రోజుల క్రితం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, సినీహీరో నందమూరి బాలకృష్ణలు జిల్లా తూర్పు ప్రాంతంలోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో పర్యటించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. పోలింగ్‌కు పదిరోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో టీడీపీ, జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ జిల్లాపై దృష్టి సారించారు. ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో వారు ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. చంద్రబాబు శుక్ర, శనివారాల్లో రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. పవన్ కల్యాణ్ శుక్రవారం గిద్దలూరుకు వస్తున్నారు. టీడీపీ వర్గాల సమాచారం మేరకు.. పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని పొదిలి పట్టణంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. అలాగే దర్శిలో శనివారం ఉదయం 10 గంటలకు రోడ్‌షో నిర్వహించి సభలో ప్రసంగిస్తారు. ఆమేరకు స్పష్టత రావడంతో పొదిలి సభపై మార్కాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ముఖ్యనేతలతో గురువారం సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై దృష్టి సారించారు. పొదిలి చిన్నబస్టాండ్‌లో సభా ఏర్పాట్లను టీడీపీ నేతలు, పోలీస్ అధికారులు పరిశీలించారు. దర్శిలో కార్యక్రమంపై అక్కడి నేతలు దృష్టి సారించారు. ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

నేడు గిద్దలూరులో పవన్ రోడ్‌షో, సభ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం గిద్దలూరు వస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు టీడీపీ అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థులకు మద్దతుగా రోడ్‌షో నిర్వహించి సభలో పాల్గొంటారు. అందుకోసం టీడీపీ అభ్యర్థి ఎం.అశోక్‌రెడ్డి, స్థానిక జనసేన నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు కీలకమైన ఒంగోలు నగరానికి ఇరుపార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఈనెల 9న వస్తున్నట్లు సమాచారం. ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ల గెలుపు కోరుతూ ఆరోజున నగరంలో వారిద్దరూ కలిసి రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంపై ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్పష్టత రానుంది.



ముమ్మరంగా టీడీపీ అభ్యర్థుల ప్రచారం

టీడీపీ నుంచి ఎన్నికల బరిలో ఉన్న అసెంబ్లీ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు గురువారం కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి టంగుటూరు మండలంలో, సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లో ప్రచారం చేశారు. ఒంగోలులో జనార్దన్‌కు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు ప్రచారం చేపట్టారు. ఎర్రగొండపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు త్రిపురాంతకం మండలంలో, దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి దొనకొండ మండలంలో, కనిగిరి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరిలో, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలో, గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి గిద్దలూరులో నిర్వహించారు. కూటమికి మద్దతు ప్రకటించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ గురువారం ఎర్రగొండపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లో అక్కడి టీడీపీ అభ్యర్థులతో కలిసి వారికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.


ఒంగోలులోని ఓ బ్యాంకు నుంచి అవస్థపడుతూ వస్తున్న వృద్ధులు

పింఛన్ పాట్లు

- వైసీపీకి శాపనార్థాలు
- ప్రభుత్వం తీరుతో మండుటెండలో బ్యాంకుల వద్దకు పరుగు
- గంటల తరబడి పడిగాపులు
- రోజంతా వేచిచూసినా అందరికీ అందని నగదు
- కొందరికి జమైనా ఖాతాలు పనిచేయక అవ్వాతాతల్లో ఆందోళన
- పలువురికి అప్‌డేట్ కాని ఆధార్
- సొమ్ము తీసుకోవాలంటే మరో నాలుగు రోజులు ఆగాల్సిందే
- సర్కారు అనాలోచిత విధానాలతో లబ్ధిదారులకు తీరని కష్టాలు
- ఆ నెపాన్ని టీడీపీపై వేసే ప్రయత్నం

వివరాలు లోపలి పేజీల్లో..

అశ్వవాహనంపై చెన్నకేశవుడు



మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గురువారం స్వామివారు శ్రీరంగనాయకుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అశ్వవాహనంపై నాలుగు మాడవీధుల్లో విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై చెన్నయ్యను దర్శించుకొని తరించారు.

\- మార్కాపురం, వన్‌టౌన్

పండుటాకులను ఏడి'పింఛన్'!

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో వృద్ధులకు ఎండలో తప్పని కష్టాలు • టీడీపీపై నిందలు వేసే ఎత్తుగడ • ఇళ్ల వద్ద ఇవ్వకుండా బ్యాంకు ఖాతాల్లో జమ

పింఛనుదారులకు బాసటగా మజ్జిగ పంపిణీ చేసిన తెలుగుదేశం శ్రేణులు



ఒంగోలులో పింఛను కోసం బ్యాంకు వద్దకు వెళుతున్న వృద్ధులు

ఒంగోలు(కార్పొరేషన్), మే 2: వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో గత రెండు నెలలుగా పండుటాకులు అల్లాడిపోతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయం తప్పదని భావించిన ప్రభుత్వం పింఛను పంపిణీని అస్త్రంగా వాడుకుంటుంది. ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సెక్రటరీలతో ఇళ్ల వద్దే పంపిణీ చేయాల్సి ఉండగా, అలా కాకుండా బ్యాంకు ఖాతాల్లోకి వేసి, వారినే వెళ్ళి తెచ్చుకోవాలని సూచించింది. అయితే ప్రభుత్వం చేసే కుట్రలను ప్రతిపక్ష టీడీపీపై బురద చల్లే ప్రయత్నాలు మొదలు పెట్టింది. గత నెలలో పింఛను పంపిణీలో ఉద్దేశ్యపూర్వకంగా జాప్యం చేసి, ఆ నిందలు టీడీపీపై నెట్టే ప్రయత్నాన్ని ప్రజలు గుర్తించడంతో కొత్త ఎత్తుగడలు వేసింది. సచివాలయాల వద్ద పంపిణీ కాకుండా ఈ నెల పింఛను నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో వేయడంతో ఆధార్ కార్డు లింక్ అయిన వారి ఖాతాల్లో పడినా, వాటిని డ్రా చేసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు అన్నీ ప్రభుత్వ గుర్తింపు బ్యాంకుల వద్ద బారులు తీరారు. ఒకవైపు ఉదయం 8గంటల నుంచే ఎండలు మండిపోవడంతో యువకులు సైతం బయటకు రావడానికి జడుసుకుంటున్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం కనీసం వృద్ధులు, నడవలేనివారు అని కూడా చూడకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో వేయడంతో బ్యాంకులన్నీ రద్దీగా మారాయి. ఒకవైపు బ్యాంకుల్లో సర్వర్ సరిగా లేక గంటల తరబడి నిలబడలేక, అందరూ కూర్చునే వీలు లేక అల్లాడిపోయారు. కొందరైతే సాయంత్రం వరకు బ్యాంకుల్లోనే ఉండాల్సిన పరిస్థితి ఎదురైంది. కనీసం మంచినీళ్ళు కూడా తెచ్చుకునే పరిస్థితి లేకపోవడంతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు మానవత్వం చాటారు. బ్యాంకుల వద్ద పింఛను కోసం వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు మజ్జిగ, మంచినీరు అందించి సేవలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో అయితే స్థానిక టీడీపీ నాయకులు లబ్ధిదారులను ఆటోల్లో వారి ఇళ్ళ వద్దకు చేర్చడంతో వైసీపీ ఓట్ల కోసం చేస్తున్న కుట్రపూరిత వ్యవహారంపై మండిపడుతున్నారు. ప్రజల్లో సానుభూతి కోసం వైసీపీ ఇంతలా దిగజారుడు పనులు చేస్తూ వృద్ధులను ఇబ్బందులు పట్టడం జరికాదని, టీడీపీపై నిందలు వేయడంపై పులువురు విమర్శిస్తున్నారు.

నగరంలో 21వేల మంది లబ్ధిదారులు

ఒంగోలు నగర పరిధిలో 50 డివిజన్లు ఉండగా సుమారు 1,370మంది వలంటీర్లుగా పని చేస్తుండగా ఇటీవల కాలంలో వైసీపీ నేతల ఒత్తిడితో 642 మంది రాజీనామా చేశారు. మిగిలిన వారు ఎన్నికల కమిషన్ ఆదేశాలతో విధులకు దూరంగా ఉన్నారు. అయితే నగరంలో మొత్తం 70 సచివాలయాలు ఉండగా, ఒక్కో సచివాలయంలో పది మంది సెక్రటరీలు విధులు నిర్వహిస్తున్నారు. నగర పరిధిలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో వారు మొత్తం కలిపి 21 వేల వరకు లబ్ధిదారులు ఉండగా, వారికి నెలనెలా రూ. 6.5 కోట్లు అందజేస్తున్నారు. సచివాలయ సెక్రటరీలతో ఇంటి వద్దనే పింఛను పంపిణీ చేసే అవకాశం ఉన్నప్పటికీ, ఇలా ఇవ్వకుండా ఉద్దేశ్యపూర్వకంగా వృద్ధులను ఇబ్బందులకు గురి చేసి, ఆ నిందలు టీడీపీపై వేసి, సానుభూతి పొందాలని వైసీపీ ఎత్తుగడలను లబ్ధిదారులు అసహ్యించుకుంటున్నారు.



బ్యాంకు వద్ద పింఛనుదారులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు



పింఛనుదారుల పడిగాపులు



బ్యాంకులో క్యూలో నిల్చున లబ్ధిదారులు

దామచర్ల సూచనతో అండగా..

పింఛను కోసం బ్యాంకుల వద్ద బారులు తీరన లబ్ధిదారుల ఇబ్బందులను గుర్తించిన తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో భోజనం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ఒంగోలు టీడీపీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ సూచనలతో ఆయా బ్యాంకుల వద్ద పార్టీ శ్రేణులు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వయసు మళ్ళి నిలబడలేని వారికి అండగా నిలుస్తూ, అవసరమైన సహకారం అందించారు. వందల్లో విచ్చేసిన వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పింఛనుదారుల యోగక్షేమాలు పర్యవేక్షించారు. కుటుంబ సభ్యులుగా వారికి తోడుగా నిలవడంతోపాటు, పలువురు దూర ప్రాంత వాసులను ఇళ్ళవద్దకు చేర్చడంపై టీడీపీ శ్రేణుల సేవలపై సంతృప్తి వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు.

కారును ఢీకొన్న లారీ

• చీమకుర్తివాసి మృతి.. ముగ్గురికి గాయాలు

ఎ.కొండూరు, మే 2: కారును అతివేగంగా వచ్చిన లారీ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్ సమీపంలోని మలుపు వద్ద గురువారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమకుర్తి గ్రామానికి చెందిన నలుగురు కారులో భద్రాచలం బయలుదేరారు. దీప్లానగర్ సమీపంలో మలుపు వద్దకు రాగానే కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆవుల రామకృష్ణారెడ్డి(38) అక్కడక్కడే మృతిచెందారు. బాలకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో తిరువూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చే స్తున్నట్టు ఎస్సై సీహెచ్.కృష్ణ తెలిపారు.

ఘనంగా శ్రీవారి కల్యాణం

నాగులుప్పలపాడు, మే 2 : మండల పరిధిలోని ఉప్పుగుండూరు నీలాయపాలెం పొలిమేరలో వేంచేసిన శ్రీవేంకటేశ్వర స్వామి కళ్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన శిష్టా పాండురంగయ్య, సంజనాలక్ష్మి దంపతులు కళ్యాణ క్రతువులో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు.

బెల్టుషాపుపై దాడి

నాగులుప్పలపాడు, మే 2 : అమ్మనబ్రోలులోని ముస్లింకాలనీకి చెందిన పఠాన్‌సుభాన్‌ఖాన్ బెల్టు షాపు నిర్వహిస్తు మద్యం విక్రయిస్తుండగా గురువారం ఎన్నికల స్క్వాడ్ అధికారి ఎస్. శ్రీనివాసరావు దాడి చేశారు. 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు ఆయన తెలిపారు.

తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యం

• ఎన్నికల ప్రచారంలో అనిల్



ప్రచారం నిర్వహిస్తున్న అనిల్, వీరయ్యచౌదరి

నాగులుప్పలపాడు, మే 2 : తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సోదరుడు బొమ్మాజీ అనిల్ పేర్కొన్నారు. వినోదరాయునిపాలెంలో గురువారం స్థానిక నాయకులతో కలిసి బీఎన్‌ను గెలిపించాలని కోరుతూ అనిల్, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరితో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ సంతనూతలపాడు ఎమ్మెల్యే అభ్యరిగా పోటీలో ఉన్న బీఎస్.విజయ్‌కుమార్ అందరివారని, నియోజకవర్గతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, అలాంటి మంచి మనిషిని గెలిపిచుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేల పింఛన్ ఇంటివద్దకు వచ్చి అందిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి విజయ్‌కుమార్ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. వీరయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, నాయకులు ఇంటూరి శ్రీనివాసరావు, స్వర్ణ కిషోర్‌బాబు, చెన్నారెడ్డి నాగరాజు, జనసేన మండల అధ్యక్షులు భూపతి మురళి, తోట గోవిందు, తోట అంజి, చలపల్లి శివ, ఉప సర్పంచ్ ఘటమనేని వేణుగోపాల్, నడిపినేని శేషగిరిరావు, పురం సంపత్, నాగరాజు, దండ గోవిందు, చెన్నారెడ్డి పాపయ్య పాల్గొన్నారు.

ప్రచార ఖర్చుల విషయంలో

నిబంధనలు పాటించాలి : కలెక్టర్

ఒంగోలు(కలెక్టరేట్), మే 2 : ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచార ఖర్చుల నిర్వహణలో నిబంధనలు పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్ కుమార్ చౌరాసియా, మయూర్ కే మెహతతో కలిసి గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో ఒంగోలు ఎంపీ అభ్యర్థుల సమావేశంలో మాట్లాడారు. అభ్యర్థులు తమ ఖర్చులకు సంబంధించి ప్రత్యేకంగా కొత్త బ్యాంకు ఖాతాను ప్రారంభించాలని, నామినేషన్ దాఖలు చేసినప్పటి నుంచి ఈ ఖాతా ద్వారానే ఎన్నికల ఖర్చుల వివరాలను చూపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ఖర్చులను మూడు దఫాలుగా పరిశీలిస్తారన్నారు. ఈ ఖర్చులకు సంబంధించిన రిజిస్టర్లు, బ్యాంకు ఖాతా పుస్తకాలతో ఈనెల 4,7,10 తేదీల్లో కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమపై ఏమైనా క్రిమినల్ కేసులు ఉంటే ఆ వివరాలను ప్రధాన పత్రికల్లో ప్రకటించాలన్నారు.

ఓటు అమూల్యం : ఓటు విలువ అమూల్యమైందని జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో స్థానిక చర్చిసెంటర్‌లో గురువారం సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు విలువైందని, అర్హులైన మహిళలందరూ ఓటు హక్కును వినియోగించాలని పిలుపునిచ్చారు. పోలింగ్ రోజైన 13న సెలవుదినంగా ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారులు రవి, జ్యోతి, ఒంగోలు ఆర్డీవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనార్దన్ కోసం..జనంలోకి..!

డివిజన్లలో తెలుగు తమ్ముళ్ల విస్తృత ప్రచారం • ప్రజల నుంచి విశేష ఆదరణ



పొగాకు కార్మికులతో మాట్లాడుతున్న ఐటీ ప్రొఫెషనల్స్



గద్దలగుంటలో..



30వ డివిజన్‌లో పార్టీ శ్రేణుల ప్రచారం

ఒంగోలు(కార్పొరేషన్), మే 2: తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి దామచర్ల జనార్దన్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు అహర్నిశలు కృషి చేస్తున్నాయి. పోలింగ్ మరో పదిరోజుల్లో జరగనుండటంతో ఒంగోలు నగరంలోని డివిజన్‌ల వారీగా తెలుగు తమ్ముళ్లు స్పీడు పెంచారు. ప్రతి ఇంటికి వెళుతూ ప్రజలను పలకరిస్తూ, వైసీపీ వైఫల్యాలను వివరిస్తున్నారు. గడిచిన ఐదేళ్ళలో ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను తెలియజేస్తూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అమలు చేసే పథకాలను వివరిస్తున్నారు. ఎవరికి వారే దామచర్ల గెలుపు కోసం ముందుకెళుతున్నారు. డివిజన్‌ల వారీగా రోజంతా ప్రజలతో మమేకం అవుతున్నారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. వైసీపీ చేసిన అరాచకాలు, వైఫల్యాలను వివరిస్తున్నారు. ఇదిలా ఉంచితే ప్రజలు సైతం దామచర్లకు మద్దతు తెలియజేస్తున్నారు. గడిచిన ఐదేళ్ళలో తాము ఎదుర్కొన్న ఇబ్బందులేను బహిరంగంగానే వెల్లడి చేస్తూ వైసీపీ పాలన వైఫల్యాలపై విమర్శలు చేస్తున్నారు. ప్రత్యేకించి ఒంగోలు వైసీపీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న బాలినేని పనితీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు మంత్రిగా ఒంగోలుకు చేసింది ఏమీ లేదని ప్రజలే వెల్లడిస్తున్నారు. 2014లో ఎమ్మెల్యేగా ఎన్నికైన దామచర్ల చేసిన అభివృద్ధి నేటికి గుర్తుండిపోయిందని ప్రజల నుంచి వినిపిస్తున్న మాట. ప్రతి రోజు తాగునీరు ఇస్తామని చెబుతున్న బాలినేని నేటికి ఆ హామీని నెరవేర్చలేకపోయారనేది ప్రజల అభిప్రాయంగా తెలుస్తున్నది. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిందే నని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంచితే టీడీపీ శ్రేణులు నిరంతరం డివిజన్‌లోని ప్రతి గడపను సందర్శిస్తూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్నారు. జగన్‌రెడ్డి ఒక్క చాన్స్‌తో అధికారంలోకి వచ్చి అన్ని వర్గాల ప్రజలపై మోపిన ఆర్థికభారాలపై ప్రజలు మండిపడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో అటు రాష్ట్రంలోను, ఇటు ఒంగోలు నియోజకవర్గంలోనూ టీడీపీ కూటమి గెలుపు ఖాయమనే సంకేతాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అందుకోసం టీడీపీ శ్రేణులు ప్రచారం ముమ్మరం చేశాయి.

30వ డివిజన్‌లో

టీడీపీ శ్రేణులు 30వ డివిజన్ 183వ బూత్‌లో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాల



7వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్

కరపత్రాలను ఇంటింటికి పంచారు. అలాగే సైకిల్ గుర్తుపై ఓటు వేసి దామచర్ల జనార్దన్‌ను గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాలంపాటి కృష్ణారావు, దాయినేని ధర్మ, నత్తల కనకారావు, గలగల వెంకీరమేష్, ప్రసాద్, రాజేష్, శివ, సురేష్, ప్రదీప్, అనిత్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

తెలుగుదేశం కూటమి ఎస్ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ • శ్రేణులతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం



కేశినేనివారిపాలెంలో ప్రచారం చేస్తున్న విజయ్‌కుమార్



బీఎన్ సమక్షంలో టీడీపీలో చేరిన కూనంనేనివారిపాలెం నాయకులు

నాగులుప్పలపాడు, మే 2: టీడీపీని అధికారంలోకి తీసుకువస్తేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని తెలుగుదేశం పార్టీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం చదలవాడ పంచాయతీ కేశినేనివారిపాలెంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో బీఎన్ మాట్లాడారు. ప్రజల మంచి భవిష్యత్తుకు గ్యారంటీ కల్పించేలా పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలను రూపకల్పన చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు, ప్రతి ఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ. 1500, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, స్కూలుకు వెళ్ళే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15వేలు, నిరుద్యోగభృతి రూ.3 వేలు అందిస్తామని వివరించారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, కృష్ణప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, ఇంటూరి శ్రీనివాసరావు, చేకూరపాడు సర్పంచ్ కొమ్మినేని రమేష్, కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, నెప్పల శివ, నాయకులు షేక్ ఖాజావలి, దివి పున్నారావు, మాజీ ఎంపీపీ అప్పల కుమారస్వామి, దాసరి సురేష్, గంగిశెట్టి నాగేశ్వరరావు, కొల్లా ఆంజనేయులు, జనసేన ఎంపీటీసీ పమిడిముక్కల శివకృష్ణ, కొంజేటి ధనుష్ పాల్గొన్నారు.

కూనంనేనివారిపాలెంలో చేరికలు

చీమకుర్తి : మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో వైసీపీని వీడి పలువురు గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా స్వాగతం పలికారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని బీఎన్ కోరారు.

ఎన్నికల నిర్వహణపై

సంపూర్ణ అవగాహన ఉండాలి

• జిల్లా ఎన్నికల అధికారి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చీమకుర్తి, మే2 : ఎన్నికల నిర్వహణ పట్ల పోలింగ్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ కోరారు. చీమకుర్తి ప్రభుత్వ ఉన్నతపాఠశాల ఆవరణలో గురువారం పీవో, ఏపీవోలకు మూడోవిడత శిక్షణ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ అధికారులనుద్దేశించి మాట్లాడారు. ఈవీఎంల ఆపరేషన్, ఎన్నికల నిర్వహణ, నివేదికల రూపకల్పనపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎన్నికలను పక్కాగా నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ సామగ్రి తీసుకునేటపుడు, రిసెప్షన్ సెంటర్‌లో అప్పగించే సమయంలో పాటించాల్సిన నిబంధనలను క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. శుక్రవారం నుంచి ఈవీఎంల కమిషనింగ్‌ని చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అనంతరం పోలింగ్‌సిబ్బందితో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లదే కీలకపాత్ర

• జనరల్ పరిశీలకులు

ఒంగోలు(కలెక్టరేట్), మే 2 : క్షేత్ర స్థాయిలో పనిచేసే మైక్రో అబ్జర్వర్లదే ఎన్నికల నిర్వహణలో కీలక పాత్రని జిల్లాకు వచ్చిన ఎన్నికల జనరల్ అబ్జర్వర్లు అరవింద్ కుమార్ చౌరాసియా, వమూర్ కె మెహత పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాలులో గురువారం మైక్రో అబ్జర్వర్ల రెండో విడత శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చౌరాసియా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిబంధనల ప్రకారం పోలింగ్ జరుగుతుందో లేదో మొత్తం ప్రక్రియను పరిశీలించాల్సిన బాధ్యత మైక్రో అబ్జర్వర్లపై ఉందన్నారు ఈ విషయంలో మైక్రో అబ్జర్వర్లు ఇచ్చే నివేదిక ఎంతో కీలకమని చెప్పారు. మాక్‌పోలింగ్ నిర్వహించే తీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మరో జనరల్ అబ్జర్వర్ మోహతా మాట్లాడుతూ నిర్దిష్ట సమయంలోపే మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. అలాగే విధులపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మైక్రో అబ్జర్వర్ల విధులు, పోలింగ్ కేంద్రంలో నిర్వహించే పలు కార్యకలాపాలపై వారికి దిశానిర్దేశం కల్పించారు.

వైద్యారోగ్యశాఖాధికారి బాధ్యతల స్వీకరణ



సురేష్‌కుమార్

ఒంగోలు(కలెక్టరేట్), మే 2: జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా డాక్టర్ డి.సురేష్‌కుమాన్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న రాజ్యలక్ష్మి గతనెల 30వ తేదీన ఉద్యోగ విరమణ చేశారు. ఈక్రమంలో జిల్లా లెప్రసి/టీబీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సురేష్‌కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వైద్యశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సురేష్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్‌ను వైద్యశాఖ కార్యాలయ ఏవోపాటు సూపరింటెండెంట్లు, ఇతర సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు గిద్దలూరులో రాఘవరెడ్డి పర్యటన

ఒంగోలు(కలెక్టరేట్), మే 2: ఒంగోలు లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు రాఘవరెడ్డి శుక్రవారం గిద్దలూరులో పర్యటించనున్నారు. మధ్యాహ్నం జరిగే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తారు. అనంతరం 3.30 గంటలకు గిద్దలూరులో జరిగే జనసేన అధినేత పవన్ కళ్యాణ్, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డిలతో కలిసి జరిగే ఎన్నికల ప్రచారం, బహిరంగ సభలో రాఘవరెడ్డి పాల్గొంటారు.

టెన్త్ మార్కుల జాబితాలు సిద్ధం

ఒంగోలు(విద్య), మే 2 : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల పొట్టి మార్కుల జాబితాలు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ వెబ్ సైట్‌లో సిద్ధంగా ఉన్నాయి. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వెబ్‌సైట్ నుంచి మార్కుల జాబితాలు డౌన్‌లోడ్ చేసి ప్రధానోపాధ్యాయులు అటెస్టేషన్ చేసి విద్యార్థులకు అందజేయాలని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి గురువారం తెలిపారు ఈ పొట్టి మార్కులు జాబితాలతో విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ సిబ్బందికి బస్సు సౌకర్యం కల్పించాలి

ఒంగోలు(విద్య), మే 2 : ఈనెల 12న సాధారణ ఎన్నికల విధులకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి బస్సు సౌకర్యం కల్పించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట్రావు, సీహెచ్.ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 13న జరగనున్న పోలింగ్‌కు ముందు రోజు 12న ఆయా నియోజకవర్గాలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు పోలింగ్ సిబ్బంది చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఎన్నికల విధులకు కేటాయించినందున ఆ రోజు ఒంగోలు నుంచి వైపాలెం, గిద్దలూరు మార్కాపురం, కనిగిరి వంటి దూరప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. అందువల్ల పోలింగ్ సిబ్బందికి ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు.

నిస్సహాయులకు ఆర్థికసాయం



నగదును అందజేస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కల్చరల్), మే 2: సమాజంలో నిస్సహాయులకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. యువపారిశ్రామికవేత్త శిద్దా సురేష్ జన్మదినం సందర్భంగా స్థానిక సంతపేటలోని శివం శరణాలయంలోని నిస్సహాయులకు రూ.80 వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పుట్టిన రోజున సేవా కార్యక్రమం చేస్తున్న సురేష్, ఆయన మిత్రులు లగడపాటి శ్రీను, అనిల్, ఈశ్వర్, రాములను అభినందించారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరి, రెడ్‌క్రాస్ సభ్యురాలు కోసూరి శ్రీదేవి, సుజాత, నూకతోటి శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలి వివాహానికి ఆర్థికసాయం

ఒంగోలు(కల్చరల్), మే 2: పుట్టుకతోనే మూగ, చెవుడు కలిగిన దివ్యాంగురాలు దుర్గాంజలి వివాహానికి స్థానిక సూర్యశ్రీ దివ్యాంగుల ఛారిటబుల్ ట్రస్ట్ కార్యదర్శి షక్ సర్దార్ బాషా గురువారం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాలకు చెందిన దుర్గాంజలి గత రెండు సంవత్సరాలుగా తమ ట్రస్ట్‌లో ఆశ్రయం పొందుతున్నదని, ఆమె వివాహ ఖర్చులకు ఆర్థిక సహాయాన్ని ప్రవాస భారతీయులు చంద్ర కొలపునేని సహకారంతో దుర్గాంజలి సోదరుడు రాజశేఖర్‌కు అందజేసినట్లు చెప్పారు.

నేడు, రేపు ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు(కలెక్టరేట్), మే 2: ఒంగోలు లోక్‌సభ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్ర, శనివారాల్లో పలు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు గిద్దలూరులో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమవుతారు. సాయంత్రం నాలుగు గంటలకు అక్కడ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్‌తో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. రాత్రి 8గంటలకు ఒంగోలులో పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. శనివారం ఉదయం 8గంటలకు ఒంగోలులోని మాగుంట కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. పది గంటలకు దర్శి పట్టణంలో జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతో కలిసి బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు మాగుంట హాజరవుతారు.

ఉపాస్ ఆధ్వర్యంలో ఆర్టీసీకి మెడికల్ కిట్లు



డీఎంకు కిట్‌ను అందజేస్తున్న డాక్టర్ అనీల్‌కుమార్

ఒంగోలు (కార్పొరేషన్), మే 2 : ఒంగోలులోని ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులకు మెడికల్ కిట్లు అందజేశారు. గురువారం స్థానిక డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ అనీల్‌కుమార్ చేతుల మీదుగా ఆర్టీసీ ఉద్యోగులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఉపాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 150 మంది కార్మికులకు డిపో మేనేజరు ధర్మవరపు శ్రీనివాసరావు చేతులు మీదుగా కిట్లు అందజేసినట్లు చెప్పారు. జరిగిందన్నారు. ఉపాస్ హాస్పిటల్‌లో నూతనంగా హార్ట్‌కేర్ సెంటర్‌ను ప్రారంభించామని, వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజ సేవలో భాగంగా దీనిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులకు అవసరమైన ప్రథమ చికిత్స కిట్లను, డ్రైవర్లకు టోపీలను అందజేయడం అభినందనీయమన్నారు. ఉపాస్ యాజమాన్యం సామాజిక బాధ్యతతో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ద్వారా ఆర్టీసీ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాస్ డైరెక్టర్లు డాక్టర్లు ఉమాపతిచౌదరి, ప్రకాష్ చావల, అనపర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పోలీసు బలగాల కవాతు



కవాతు నిర్వహిస్తున్న బలగాలు

నాగులుప్పలపాడు, మే 2: సార్వత్రిక ఎన్నికల నేపంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పలు గ్రామాలలో గురువారం ప్రత్యేక పోలీసు బలగాలు కవాతు నిర్వహించాయి. ఒంగోలు రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్సై బ్రహ్మనాయుడు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ కిషోర్ కుమార్ ఈదుమూడి, ముప్పాళ్ళ, మద్దిరాల గ్రామాలలో సెంట్రల్ ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో కలిసి కవాతు చేపట్టారు.



సింగరాయకొండలో పార్టీ కార్యాలయం నుంచి వస్తున్న ఎస్జీటీ భువనగిరి సుబ్బయ్యశాస్త్రి (ఫైల్) కొండపిలో పార్టీ కార్యాలయం ప్రారంభంలో సుబ్బయ్య (ఫైల్)

వైసీపీ అభ్యర్థి సేవలో ఉపాధ్యాయుడు

● అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

కొండపి,మే 2: కొండపి వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ సేవలో ఓ ఉపాధ్యాయుడు తరిస్తున్నా.. ఆమేరకు ఆధారాలతో రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారికి, కొండపి ఈఆర్వోకి ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. కొండపి మండలం పోలిరెడ్డిపాలెం ఎంపీ స్కూల్‌లో ఎస్‌జీటీగా పనిచేస్తున్న భువనగిరి సుబ్బయ్యశాస్త్రి ఎన్నికల నిబంధనలకు భిన్నంగా సింగరాయకొండ పార్టీ కార్యాలయంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాడు. అదేవిధంగా కొండపిలోని వైసీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నాడు. పెదకండ్లగుంట గ్రామానికి చెందిన సుబ్బయ్యశాస్త్రి సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొనడంపై పెదకండ్లగుంట గ్రామ మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు సంబంధిత ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా చర్యలు తీసుకోకపోవడంపై మాజీ సర్పంచ్ ఆక్షేపించారు. సంబంధిత అధికారులు కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించిన ఉపాధ్యాయుడు భువనగిరి వెంకటసుబ్బయ్యపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

కొండపి, మే2: మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామానికి చెందిన మొద్దు జయమ్మ (85) గురువారం మధ్యాహ్నం తన ఇంటిలోనే వడదెబ్బకు గురై మరణించింది. ఈనెల 1వ తేదీన పింఛన్ ఇంటివద్దనే ఇవ్వాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ఆమె కోరింది. అయినా పెడచెవిన పెట్టిన ప్రభుత్వం వృద్ధులకు ఆలస్యంగా ఇంటి వద్దకు వచ్చి పింఛన్‌లు ఇస్తున్నారు. వృద్ధురాలు జయమ్మకు పింఛన్ ఇచ్చేందుకు గోగినేనివారిపాలెం గ్రామ సచివాలయ సిబ్బంది ఆమె ఇంటి వద్దకు వచ్చారు. వారు పింఛన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేస్తుండగానే జయమ్మ మృతిచెందిందని ఆమె చిన్న కొడుకు రామయ్య తెలిపారు.

విధులకు ఆటంకం కలిగించాడని ఫిర్యాదు

జరుగుమల్లి (కొండపి), మే2: విద్యుత్ బిల్లులు చెల్లించని గృహాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండగా ఓ వ్యక్తి తనను, సిబ్బందిని దూషించి, విధులకు ఆటంకం కలిగించాడని విద్యుత్‌శాఖ ఏఈ హర్షిష్ గురువారం జరుగుమల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మండలంలోని పీరాపురం గ్రామానికి చెందిన మారంరెడ్డి కొండలరావు అనే వ్యకి తన విద్యుత్ బిల్లును 9నెలలుగా చెల్లించలేదని, విద్యుత్ సరఫరా నిలిపివేయడానికి వెళ్లిన తనపై, సిబ్బందిపై అసభ్యంగా మాట్లాడి, విధులకు ఆటంక పరిచి నీ అంతు చూస్తానని అన్నాడని పోలీసులకు ఏఈ ఫిర్యాదు చేశారు. అతనిపై చర్యలు తీసుకోవాలని ఏఈ కోరారు. గతంలో కూడా తమ సిబ్బందిపై నిరాధార ఆరోపణలు చేస్తూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశాడని, ఆపోస్ట్‌ను కూడా ఈసందర్భంగా ఏఈ ఫిర్యాదులో ఉటంకించారు.

నేడు వడ్డెరులతో టీడీపీ ఆత్మీయ సమావేశం

సింగరాయకొండ, మే 2 : సింగరాయకొండలో జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీవెంకటేశ్వర ఫంక్షన్‌హాలులో శుక్రవారం టీడీపీ కొండపి నియోజకవర్గ వడ్డెరుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆపార్టీ నాయకుడు వల్లెపు రాఘవులు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య హాజరవుతారని వివరించారు. నియోజకవర్గంలోని వడ్డెర సోదరులు భారీగా సమావేశానికి హాజరుకావాలని రాఘవులు కోరారు.

భూరక్షణ చట్టం కాదది, భూ భక్షణ చట్టం

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి స్వామి

టంగుటూరు, మే 2 : వైసీపీ ప్రభుత్వ తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్టు చట్టం భూరక్షణ చట్టం కాదని, భూభక్షణ చట్టమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే వాసేపల్లిపాడు, వల్లూరు, సూరారెడ్డిపాలెం, శివపురం, కొణిజేడు పంచాయతీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టడమే కాకుండా ఆయన అనుచరులు కళ్లు ప్రజల ఆస్తులపై పడ్డాయని, అందుకే రాష్ట్రంలో ల్యాండ్ టైటిల్ యాక్టు పేరుతో ప్రత్యేక చట్టాన్ని తెచ్చారని ఆరోపించారు. ఆచట్టం ద్వారా భూ యజమానికి తన భూమిపై హక్కు లేకుండా పోతుందని, ప్రభుత్వం నియమించిన ఓ అధికారి చేతిలో ఉంటుందన్నారు. మీ భూములను రక్షించుకోవడానికి కోర్టులకు వెళ్లే అవకాశం మీకు ఉండదని, ఆవిధంగా చట్టం రూపొందించారని దుయ్యబట్టారు.

రెండో సంతకం ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దుపైనే..

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా రెండవ సంతకం ల్యాండ్ టైటిల్ యాక్టు రద్దుపైనేనని ఎమ్మెల్యే చెప్పారు. చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్ కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తని ప్రజలంతా గుర్తించుకోవాలని సూచించారు. జిల్లాలో స్థానికంగా ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి సూచన మేరకే వైసీపీ నుంచి ఇక్కడ పోటీకి అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న మంత్రి సురేష్‌ని, చెవిరెడ్డి భాస్కరరెడ్డిని తెచ్చారని తెలిపారు. తనపై పోటీకి దమ్మున్న నేత లేకనే అవినీతి పరులను తెచ్చి పెట్టారని విమర్శించారు. ఓటు అనే ఆయుధంతో ఈవలస పక్షులను నియోజకవర్గం నుంచి దూరంగా తరిమి కొట్టాలని ప్రజలకు స్వామి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, బీజేపీ కొండపి నియోజకవర్గ ఇన్చార్జ్ మిడసల బాలకోటయ్య, జనసేన మండల అధ్యక్షుడు రాంబాబు, గ్రామీణ కూటమి నాయకులు దూడల తిరుపతిస్వామి, బొజ్జా శ్రీనివాసరావు, మొలకలపల్లి శ్రీనివాసరావు, శివపురం వెంకట్రావు, రామాగోపి పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు.



సూరారెడ్డిపాలెం ప్రచారంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి స్వామి, నాయకులు



టంగుటూరులో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే స్వామి

టీడీపీ కార్యాలయం ప్రారంభం

టంగుటూరు విష్ణాలయం వీధిలో గురువారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీకి పూర్వ వైభవం తేవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు మాట్లాడుతూ కార్యాలయ పరంగా చేయదగిన పనులన్నీ ఇక్కడ జరుగుతాయని ప్రజలకు భరోసా ఇచ్చారు. మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నందున అన్ని సౌకర్యాలున్న భవనాన్ని కార్యాలయానికి తీసుకున్నామని చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు కామని విజయకుమార్ మాట్లాడుతూ స్వామిని తిరిగి ఎమ్మెల్యేగాను, మాగుంటను ఎంపీగా గెలిపించుకోవడమే మనందరి లక్ష్యం కావాలని ప్రజలకు సూచించారు. ఒంగోలు పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి తోకల భారతి మాట్లాడుతూ మహిళలూ పార్టీ కార్యాలయానికి వచ్చి ఎమ్మెల్యే స్వామి, ఎంపీ మాగుంట విజయాలలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిరాల మమత, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, యజమాని, పెద్దోడు, కుందేటి వెంకట్రావు, ఉమామహేశ్వరరావు, మొలకలపల్లి శ్రీనివాసరావు, జక్కుల శ్రీనివాసరావు, భాను చందర్, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు గురై డ్రైవర్ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై టి.శ్రీరామ్

సింగరాయకొండ, మే 2 : మద్యం సేవించి డీ హైడ్రేషన్‌కు గురై డ్రైవర్ మృతి చెందాడు. ఈసంఘటన మండల కాంప్లెక్స్ వెనుకవైపు ఉన్న రాములమ్మ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై టి. శ్రీరామ్ తెలిపిన వివరాల మేరకు.. పంచాయతీ పరిధిలోని బైరాగిమన్యంకు చెందిన కుంచాల శ్రీకాంత్ (35) లారీ డ్రైవర్‌గా పనిచేస్తుంటారు. కొన్ని నెలల కిందట జరిగిన ప్రమాదంలో రెండు కాళ్లకు దెబ్బలు తగిలాయి. అప్పటి నుంచి ఇంటి వద్దనే ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. భార్యకు దూరంగా రాములమ్మ కాలనీలో ఒక రూమ్‌ను అద్దెకు తీసుకొని ఒంటరిగా నివసిస్తున్నాడు. రెండు నెలల క్రితం ఫైనాన్స్‌లో ఆటోను తీసుకొని నడుపుకుంటున్నాడు. ఆటోకి కిస్తీలు చెల్లించనందున ఫైనాన్స్ కంపెనీవారు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. దీంతో వారం రోజుల నుంచి రూమ్‌లో నుంచి బయటకు రావడం లేదు. గదిలో నుంచి దుర్వాసనలు వెదజల్లుతూ ఉండటంతో స్థానికులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఎస్సై టి. శ్రీరామ్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మద్యం సేవించి డీహైడ్రేషన్‌కు గురై మృతిచెంది ఉండవచ్చునని బావిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సింగరాయకొండలో వైసీపీకి గట్టిషాక్

ఆపార్టీని వీడిన 40 కుటుంబాలు

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీలో చేరిక

సింగరాయకొండ, మే 2 : సార్వత్రిక ఎన్నికలకు రోజులు దగ్గర పడుతున్న తరుణంలో సింగరాయకొండ మండలంలో వైసీపీకి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. వైసీపీకి చెందిన పలు వర్గాల ఓటర్లు ఆపార్టీకి గుడ్‌బై చెబుతున్నారు. పంచాయతీ పరిధిలోని బాలయోగినగర్‌కు చెందిన వైసీపీ 14 వవార్డు సభ్యుడు, ఆపార్టీకి చెందిన 40 కుటుంబాల వారు గురువారం వైసీపీని వీడారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆయన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే సింగరాయకొండ అభివృద్ధి జరిగిందని చెప్పారు. మండలానికి రామతీర్థం నీటిని తీసుకొచ్చి ప్రజల దాహార్తిని తీర్చామని గుర్తుచేశారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక వసతులను కల్పించామని తెలిపారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ఒక్క అభివృద్ధి పనికూడా చేయలేదని విమర్శించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యుడు గంజి సుబ్బారావు, సంకు వసంతయ్య, పసుపులేటి పెదసుబ్బయ్య, రమేష్, కృష్ణ, కోటేశ్వరరావు, భువనేశ్వరం ప్రసాద్, నారాయణ, శ్రీధర్, చీదళ్ల జనార్దన్, కనాల రామాంజనేయులు, రమేష్‌కుమార్, లక్కంరాజు కిషోర్, మద్దెల మల్లికార్జున, అంగులూరి ఆంజనేయులు, పలు కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, నేతలు షేక్ సంధానీబాషా, కూనపరెడ్డి సుబ్బారావు, సుదర్శి చంటి, మించల బ్రహ్మయ్య, కళ్లగుంట నరసింహ, పసుపులేటి శేషారావు, యస్థాని తదితరులు పాల్గొన్నారు.



కండువావేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీని వీడి టీడీపీలోకి..

సింగరాయకొండ వైసీపీకి చెందిన 20 కుటుంబాల వారు ఆపార్టీని వీడారు. గురువారం రాత్రి టంగుటూరు మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ గూటికి చేరారు. అయన కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో భాను, అఖిల్, హర్షవర్ధన్, వెంకట్, సాదిక్, నవీన్, మదన్, వంశీ, స్టీఫెన్, మహేష్, తరుణ్, హర్ష, వేణు, మధు, శ్రీనాథ్ పలువురు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గాలి హరిబాబు, కందుకూరి నాగేశ్వరరావు, పాకల సుబ్బారావు, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే స్వామి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ అభిమానులు

వార్డుమెంబర్ టీడీపీలో చేరిక

పొన్నలూరు (కొండపి), మే2: పొన్నలూరు గ్రామ పంచాయతీలోని 4వ వార్డు మెంబర్ చుండి రమేష్ గురువారం పొన్నలూరులోని టీడీపీ కార్యాలయంలో మండల మాజీ అధ్యక్షుడు మండవ ప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. రమేష్‌కు పార్టీ మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రమేష్‌కు అండగా పార్టీ ఉంటుందని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గుమ్మళ్ల వెంకటరావు, సన్నమూరి నరసింహారావు, మోరబోయిన మాల్యాద్రి, పార్టీ మండల కార్యదర్శి ఎండ్లూరి ఆదాము, ఎస్సీసెల్ మండల ఉపాధ్యక్షుడు చుండి సింగయ్య, చుండి జేమ్స్, గంధం నరసయ్య పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

కొండపి, మే2: ఓటు ఉన్న ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి విక్టోరియారాణి అన్నారు. గురువారం కొండపిలోని కామేపల్లి రోడ్డులోని శివాలయం వీధిలో స్థానికులకు ముగ్గుల ద్వారా ఓటు ప్రాధాన్యాన్ని వివరించారు.



టంగుటూరు కేంద్రంలో జరుగుతున్న పొగాకు వేలం

పొగాకు అత్యధిక ధర కేజీ రూ. 296

కొండపి, మే2: కొండపి పొగాకు వేలం కేంద్రంలో నాణ్యమైన ఎఫ్-1 రకం పొగాకు కేజీకి అత్యధిక ధర 296 రూపాయలు పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చౌటపాలెం, దాదానాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, దాసరెడ్డిపాలెం, కొండపి, రామాయపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1053 బేళ్లు వేలానికి తీసుకురాగా 937 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారని వివరించారు.

టంగుటూరు వేలం కేంద్రంలో..

టంగుటూరు : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన పొగాకు కొనుగోళ్లలో కిలోకు గరిష్ఠ ధర రూ. 295 రైతులకు దక్కింది. వేలం కేంద్రానికి జమ్ములపాలెం, తూమాడు గ్రామాల నుంచి 977 పొగాకు బేళ్లకు అనుమతించారు. ఇందులో 835 బేళ్లు కొనుగోలు జరుగగా మిగిలిన బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర రూ. 295 కాగా కనిష్ఠ ధర రూ. 210, సరాసరి ధర రూ. 252.51 రైతులకు లభించింది.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

● కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్

బల్లికురవ, మే 2 : సంక్షేమం, అభివృద్ధి టీడీపీ కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని బాపట్ల పార్లమెంట్ టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కొమ్మినేనివారిపాలెం, వైదనలో జరిగిన ఇంటింటి ప్రచారంలో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి మరిచి విధ్వంసమే లక్ష్యంగా పాలన సాగించిందన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నిర్లక్షానికి గురయ్యారన్నారు. మరలా రాష్ట్రాభివృద్ధి గాడిలో పడాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. టీ డీపీ, జనసేన ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.



వైదనలో ప్రచారం నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్, బాబీ

హోరాహోరీగా పోలు రాధా ఎడ్ల బలప్రదర్శన

కారంచేడు(పర్చూరు), మే 2 : కారంచేడు గ్రామంలోని శ్రీ గంగా భవానీ అమ్మవారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలురాధా ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం ప్రారంభమైన ఎడ్ల బల ప్రదర్శన పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున పశు పోషకులు, గ్రామస్థులు తరలి రావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారి తిరునాళ్ళ సందర్భంగా రెండు రోజులు పోటీలను ఏర్పాటు చేయటం జరిగిందని కమిటీ నిర్వాహకులు నల్లగొర్ల శ్రీరాములు, సాంబమూర్తి, కాలేషా, సుబ్బారావులు తెలిపారు.

వైసీపీకి పింఛన్‌దారుల శాపనార్థాలు

ఊరూరా సచివాలయాలు.. అందులో 12 మంది ఉద్యోగులు.. ఏ చిన్న సమాచారం కావాలన్నా ఉద్యోగులు పదేపదే ప్రతి ఇంటి చుట్టూ తిరిగారు. అలా ఈ ఐదేళ్లలో వారు లెక్కకుమిక్కిలి అందరి ఇళ్ల చుట్టూ తిరిగారు. ఎన్నికల కోడ్ వచ్చే సరికి వలంటీర్లను పింఛన్ల పంపిణీకి ఎన్నికల సంఘం అనుమతివ్వలేదు. దీంతో ప్రభుత్వం చీప్ ట్రిక్స్‌కు ప్లాన్ చేసింది. సచివాలయ ఉద్యోగులను పింఛన్ల పంపిణీకి కేటాయించకుండా చేసింది. గత నెలలో పింఛన్‌దారులను సచివాలయాల చుట్టూ తిప్పగా.. ఈ నెల బ్యాంకుల చుట్టూ తిప్పుతోంది. ఈ వ్యవహారమంతా టీడీపీ కుట్రపన్ని చేసిందని వైసీపీ నేతలు దుష్ప్రచారం చేసినా పింఛన్‌దారులు నమ్మకపోగా.. రాష్ట్ర ప్రభుత్వం తీరుపై శాపనార్థాలు పెడుతుండడం గమనార్హం.

మండుటెండలో బ్యాంకుల వద్దకు పరుగెత్తించిన ప్రభుత్వం

గంటల తరబడి పడిగాపులు కాచేలా వ్యూహం



ఎండలో వృద్ధురాలు

- రోజంతా వేచిచూసినా అందరికీ అందని నగదు
- కొందరికి జమైనా ఖాతాలు పనిచేయక పండుటాకుల్లో ఆందోళన
- అప్‌డేట్ కాని ఆధార్
- ఆ సొమ్ము తీసుకోవాలంటే మరో నాలుగు రోజులు ఆగాల్సిందే
- ఉన్నతాధికారుల అనాలోచిత విధానాలతో లబ్ధిదారులకు తీరని కష్టాలు
- ఆ నెపాన్ని టీడీపీపై వేసేందుకు అధికార పార్టీ నేతల యత్నం

ఒంగోలు నగరం, మే 2 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ విధానం కారణంగా పింఛన్ సొమ్ము అందక వృద్ధులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. గత నెలలో సచివాలయాల్లో పింఛన్ సొమ్ము ఇచ్చిన ప్రభుత్వం ఈ నెలలో బ్యాంకుల ఖాతాలకు జమ చేస్తామంటూ కొత్త విధానానికి తెరలేపింది. దీంతో ఈనెల మొదటి తేదీనే అందాల్సిన పింఛన్ సొమ్ము చాలా మందికి మరో వారం రోజులకు కూడా అందే పరిస్థితి లేదు. ప్రభుత్వం దురుద్దేశంతోనే ఇలా చేస్తోందని లబ్ధిదారులు శాపనార్థాలు పెడుతున్నారు. కొండంత ఆశతో గురువారం ఉదయం నుంచే వందల సంఖ్యలో పింఛన్‌దారులు జిల్లాలోని అన్ని బ్యాంకుల వద్దకు క్యూ కట్టారు. పింఛన్ సొమ్ము మీ ఖాతాలో గురువారం జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఎక్కువ మంది ఖాతాలకు జమ చేయనేలేదు. ఒక వేళ ఖాతాకు జమ చేసినా వాటిని తీసుకునే వీలులేకుండా పోయింది. పింఛన్‌దారులకు చెందిన ఖాతాలు 50 శాతం ప్రస్తుతం పనిచేయటం లేదు. వీటిని బ్యాంకు అధికారులు ఎప్పుడో నిరర్థక ఖాతాలుగా చూపించి బ్లాక్ చేసి ఉంచారు. ఇలాంటి ఖాతాల్లో డబ్బు జమ అయితే వాటిని తీసుకునేందుకు ఆధార్ కార్డు, పాస్ ఫొటో బ్యాంకు అధికారులకు ఇవ్వాలి. వాటిని అప్‌డేట్ చేయాలంటే కనీసం నాలుగు రోజులు పడుతుందని బ్యాంక్ అధికారులు చెబుతున్నారు. ఇలా అయితే లబ్ధిదారులు చేతికి పింఛన్ సొమ్ము అందే సరికి వారం పైనే పడుతుందంటున్నారు.

ఖాతాలకు జమ కాని పింఛన్ సొమ్ము

జిల్లాలో మొత్తం 2,92,522 పింఛన్లు ఉండగా ఇందులో దివ్యాంగులు, మంచంలో ఉన్న వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నేరుగా ఇంటికే పింఛన్ అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. మిగిలిన 2,22,604 మందికి వారి బ్యాంకు ఖాతాలకు పింఛన్ సొమ్మును జమ చేస్తామని చెప్పింది. జిల్లాలోని దాదాపు లక్ష మంది ఖాతాలకు పింఛన్ సొమ్ము గురువారం జమ కానట్లు సమాచారం. ఒక వేళ జమ అయినా ఆ ఖాతాలను తిరిగి యాక్టివేట్ చేయించిన తర్వాతే డబ్బులు డ్రా చేసుకోవాలని బ్యాంకు అధికారులు కరాఖండీగా తేల్చిచెప్పారు. ఈ విషయం తెలియని వృద్ధులు సాయంత్రం వరకు బ్యాంకుల వద్దే పడిగాపులు కాచి తిరుగుముఖం పట్టారు.



ఒంగోలులోని బ్యాంక్‌లో పడిగాపులు కాస్తున్న పింఛన్‌దారులు



వృద్ధురాలిని బ్యాంక్‌కు తీసుకెళ్తున్న యువతి

వృద్ధులకు నరకయాతన

ఒకేసారి వందల సంఖ్యలో వృద్ధులు, వితంతువులు, ఇతర పింఛన్‌దారులు బ్యాంకులకు పోటెత్తటంతో సిబ్బంది కూడా దిక్కుతోచని స్థితిలో పడ్డారు. వారికి డబ్బులు పడ్డాయో, లేదో కూడా సిబ్బంది చెప్పలేకపోయారు. వృద్ధులకు ఎక్కువ బ్యాంకు శాఖల్లో కూర్చునేందుకు నీడ కూడా లేకపోవటంతో ఎండ వేడిమికి తల్లడిల్లిపోయారు. కొన్నిచోట్ల సొమ్మసిల్లి పడిపోయారు. 'ప్రభుత్వం మా ఉసురు పోసుకుంటోందని బ్యాంకు అధికారుల ముందే తిట్టిపోశారు. గుక్కెడ మంచి నీళ్లు కూడా దొరకక వృద్ధులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు.

వాతావరణ శాఖ హెచ్చరించినా లెక్కచేయని ప్రభుత్వం

ఈ వారం రోజులు సూర్యుడు నిప్పులు కురిపిస్తాడని వాతావరణ శాఖ ముందునుంచే హెచ్చరించినా ప్రభుత్వం లెక్కచేయలేదు. వారిని బ్యాంక్ వద్దకు పరుగులు పెట్టించేందుకే ఇలా చేసిందని పింఛన్‌దారులు ఆగ్రహంవ్యక్తం చేశారు. ఒకేసారి పింఛన్ కోసం వందల సంఖ్యలో బ్యాంక్‌ల వద్దకు వస్తారని తెలిసి కూడా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించి ఉంది. వైద్య ఆరోగ్యశాఖ గురువారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి బ్యాంకుల వద్ద వైద్య సహాయం అందించాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా వైద్య సహాయం అందనేలేదు. బ్యాంకు ఆవరణలోనే వృద్ధులు సొమ్మసిల్లి పడిపోగా వారిని పట్టించుకున్న దిక్కేలేక పోయింది.

సచివాలయం ద్వారా ఇవ్వాల్సింది..



చీమలదిన్నె కొండమ్మ, దూబగుంట

గత నెల మాదిరిగానే ఈ నెల కూడా గ్రామ సచివాలయం ద్వారా పంపిణీ చేస్తే మా లాంటి వారికి ఎండలో ఈ కష్టాలు ఉండేవి కావు. పింఛన్ కోసం ఏడు కిలోమీటర్ల దూరం నుంచి ఆటోలో పామూరులోని స్టేట్ బ్యాంకు వద్దకు వచ్చి మెట్లు ఎక్కలేక ఇబ్బందులకు గురయ్యా.

బాగాలేకున్నా రావాల్సివచ్చింది



షేక్ కాజాబి, పామూరు

రెండు రోజుల నుంచి తనకు అనారోగ్యంగా ఉండి వైద్యశాలలో సెలైన్ కట్టించుకుంటున్నా. తనకు వచ్చే పింఛన్ బ్యాంకులో వేశారని చెప్పటంతో వైద్యశాల నుంచే నేరుగా బ్యాంకు వద్దకు ఎర్రని ఎండలో రావాల్సి వచ్చింది.

తోడు వచ్చి గాయపడింది...



గాలంకి కొండయ్య, ఇనిమెర్ల

ఇనిమెర్ల ఎస్సీ పాలెం నుంచి పామూరుకు పింఛన్ కోసం నా భార్యను తోడుగా తెచ్చుకొన్నా. బ్యాంకులో పింఛన్ తీసుకొని మెట్లపై నుంచి కిందికి వస్తుండగా ఒక చెప్పు కనపడ లేదు. ఒక చెప్పుతోనే కిందికు వచ్చి భార్య రాములమ్మ, నేను మంచినీళ్లు తాగేందుకు షాపు వద్దకు వస్తుండగా, కాలు జారి తన భార్య కిందపడటంతో నడుము విరిగిందని విలపించాడు.

ఎండకు అల్లాడిపోయాం



డి.కోటమ్మ, కట్టశింగనపాలెం పింఛన్‌దారురాలు

పింఛన్ కోసం 15కిలోమీటర్లు ఆటోలో రావాల్సి రావటంతో ఎండకు అల్లాడిపోయాం. మాకు బస్సు వసతి లేకపోవటంతో కట్ట శింగన్‌పాలెం నుంచి ఆటోలో దర్శికి రావాల్సి వచ్చింది. మండుటెండలో ఇంటికి పోయాం. ఇళ్ల వద్ద పింఛన్ పంపిణీ చేసి ఉంటే ఇక్కట్లు తప్పేవి.

ప్రభుత్వం కావాలనే చేసింది...

పింఛన్‌దారుల బ్యాంకు ఖాతాలు పనిచేయటం లేదని ప్రభుత్వానికి తెలుసు. ఆ ఖాతాల్లో డబ్బులు వేయలేమని ప్రభుత్వానికి తెలిసి కూడా ఇలాంటి నిర్ణయం తీసుకోవటం వెనుక దురుద్దేశ్యమే ఉందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. తమను ఇబ్బందులకు గురిచేసి ఆ నెపాన్ని ప్రతిపక్ష పార్టీ టీడీపీపైన వేసి తాము లబ్ధిపొందాలని వైసీపీ చూస్తోందని లబ్ధిదారులు అంటున్నారు.

రేపటి నుంచి హోమ్ ఓటింగ్



- జిల్లాలో నియోజకవర్గాల వారీగా బృందాల ఏర్పాటు
- నాలుగు రోజుల పాటు జరగనున్న కార్యక్రమం
- అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్న ఆర్వోలు
- 1747మంది వృద్ధులు, దివ్యాంగులకు ఓటింగ్

ఒంగోలు(కలెక్టరేట్), మే 2 : జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు హోమ్ ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సార్వత్రిక ఎన్నికల్లో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతానికి పైగా ఉన్న దివ్యాంగులు వారి ఓట్లను ఇంటి వద్దనే వేసుకొనే విధంగా అవకాశం కల్పించింది. తదనుగుణంగా ఆర్వో కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకుంటే వాటిని పరిశీలించి హోమ్ ఓటింగ్ కల్పిస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. వృద్ధులు సుమారు 7వేలకు పైగా ఉన్నట్లు గుర్తించగా 40శాతం వికలాంగత్వం మరో 8వేలకు పైగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలా జిల్లా వ్యాప్తంగా సుమారు 15వేల మంది వరకు ఉంటారని అంచనా వేశారు. తదనుగుణంగా నియోజకవర్గ కేంద్రాల్లో ఆర్వో కార్యాలయాల్లో హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తులను స్వీకరించారు. అలా 85 ఏళ్లకు పైబడిన వృద్ధులు 879 మంది, దివ్యాంగులు 868 మంది ఇంటి వద్దనే ఓటు వేసుకునేందుకు ఆప్షన్ ఇచ్చారు. ఆ విధంగా 1,747 మంది ఇంటి వద్దనే ఆప్షన్ ఇవ్వడంతో వారి ద్వారా హోమ్ ఓటింగ్ వేయించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు ఇంటి వద్దనే ఓటు వేసుకునేందుకు ఆప్షన్ ఇచ్చిన వారి ఇంటి వద్దకే వెళ్లి ఓటింగ్ వేయించేందుకు పీవోతో పాటు ఏపీవో, మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు. హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తులో పూరించిన అడ్రసు ప్రకారం వారి ఇంటి వద్దకే వెళ్లి ఈ హోమ్ ఓటింగ్ వేయించనున్నారు. ఒంగోలులోనే హోమ్ ఓటింగ్ కోసం వృద్ధులు, దివ్యాంగులు 543 మంది ఆప్షన్ ఇచ్చారు. దీంతో వారి వద్ద ఓటు వేయించేందుకు 22 బృందాలను ఏర్పాటు చేశారు.



ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి 4 నుంచి ఓటింగ్

ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి కూడా ఈనెల 4వ తేదీ నుంచే ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లా వ్యాప్తంగా 20వేల మందికి పైగా అధికారులు, ఉద్యోగులు ఎన్నికల్లో విధుల్లో ఉండటంతో అందుకోసం నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేకంగా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా ఉద్యోగుల సంఖ్య ఆధారంగా ఏ రోజు ఎక్కడ ఓటింగ్ వేయాలన్నది సమాచారం ఇస్తున్నారు.

రైతు సేవలో మాగుంట కుటుంబం





చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్, నిర్మించిన రోడ్డుపై అభిమానులు

- జిల్లాలో రూ.1.70 కోట్లతో పొలాలకు రహదారులు
- ఎక్స్‌కవేటర్లతో చిల్లచెట్లు తొలగింపు

ఒంగోలు(కలెక్టరేట్), మే 2 : గత 30 ఏళ్ల క్రితం నుంచే సేవా కార్యక్రమాలతో ప్రజల్లో మంచి పేరు ప్రతిష్ఠలు ఇనుమడింపజేసుకున్న మాగుంట కుటుంబం నేటికీ ఆ స్ఫూర్తి, ఆ ఒరవడిని కొనసాగిస్తూనే ఉంది. పల్లెపల్లెకూ తమ కుటుంబం మార్కును చూపిస్తూనే ఉంది. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రాతినిధ్యం వహించే తన పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉండే గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఏమి అవసరమో గుర్తించి సేవా కార్యక్రమాలు చేసేందుకు ముందంజలో ఉన్నారు. ఎంపీ మాగుంట తనయుడు రాఘవరెడ్డి తన కుటుంబ శ్రేయోభిలాషులతో కలిసి ఏ గ్రామంలో ఏమి అవసరం ఉందో తెలుసుకొని తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో గత ఎనిమిది నెలల నుంచి 25 ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి 500 గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అందుకోసం సుమారు రూ.1.70 కోట్లు వెచ్చించి పలు రకాల పనులు చేశారు. ప్రధానంగా రైతులు తమ వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు సరైన రోడ్లు లేకపోవడం, చిల్లచెట్లతో ఉన్న రోడ్లు పూడిపోవడం వంటి కారణాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆయా అంశాలను తన దృష్టికి వచ్చిన వెంటనే ఎంపీ మాగుంట ప్రజల భాగస్వామ్యంతో ఆయా పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. అలా జిల్లాలోని 500 గ్రామాల్లో పొలాల డొంక దారులకు రోడ్లు ఏర్పాటు, చిల్లచెట్ల తొలగింపుతోపాటు ఆయా రోడ్లను అభివృద్ధి చేశారు. అలా జిల్లా వ్యాప్తంగా పలు రకాల పనులు పూర్తిచేసి ప్రజల్లో మాగుంట కుటుంబం సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోయే విధంగా ఏర్పాటు చేశారు.

రైతు సంక్షేమంలో ముందున్న మాగుంట

జిల్లాలో పొగాకు, పత్తి, మిర్చి, సుబాబుల్ తదితర వాణిజ్య పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధరల విషయంలోనూ ఎంపీ మాగుంట ముందుస్థానంలో ఉన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు లేక సంక్షోభం ఏర్పడిన సమయంలో తాను ఉన్నానంటూ మాగుంట ముందుకొచ్చి అనేక సమస్యలను పరిష్కరించిన ఘటనలు అనేకం ఉన్నాయి. మద్దతు ధరల కోసం అఖిలపక్ష రైతు ప్రతినిధులను ఢిల్లీకి తీసుకెళ్లి సంబంధిత కేంద్ర మంత్రులు, అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధరలు కల్పించే విషయంలో మాగుంట తీసుకున్న చొరవ రైతుల్లో ఎప్పటికీ నిలిచిపోతున్నాయి.



క్యూలో మందుబాబులు

పీసీపల్లి, మే 2 : ఎన్నికల వేళ మద్యంషాపులకు అమ్మకం కోటాను నిర్దేశించడంతో షాపు తెరిచిన గంట, రెండు గంటల్లోనే ఆ రోజు కోటా అమ్మకం అయిపోతుంది. ఆ వెంటనే షాపులు మూసివేస్తున్నారు. దీంతో మద్యం కోసం మందుబాబులు షాపుల ముందు బారులుదీరుతున్నారు. మండలంలోని పెదయిర్లపాడు, పీసీపల్లిలో రెండు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. గురువారం షాపులు తీయకముందే మందుబాబులు వాటి ముందు క్యూ కట్టారు. మధ్యాహ్నానికే అమ్మకం కోటా అయిపోవడంతో దుకాణం మూసివేశారు. ఎక్కువశాతం క్యూలో ఉన్న కొంతమంది మందుబాబులు మద్యం బాటిళ్లు తీసుకెళ్లి సాయంత్రం వేళ అధికరేటుకు విక్రయిస్తున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు.

జిల్లాలో సర్వీసు ఓటర్లు 6,850 మంది

ఒంగోలు(కలెక్టరేట్), మే 2 : జిల్లాలో సర్వీసు ఓటర్లు 6,850 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 6,677 మంది, స్త్రీలు 173 మంది ఉన్నారు. వైపాలెం నియోజకవర్గంలో సర్వీసు ఓటర్లు 221 మంది, దర్శి 220, సంతనూతలపాడు 157, ఒంగోలు 143, కొండపి 93, మార్కాపురం 416, గిద్దలూరు 5,404, కనిగిరి 196 సర్వీసు ఓట్లు ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా సర్వీసు ఓట్లు గిద్దలూరు నియోజకవర్గంలో ఉండగా, అత్యల్పంగా కొండపిలో సర్వీసు ఓటర్లు ఉన్నారు. జిల్లాలో గత నెల 25న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో 18,22,470 మంది ఓటర్లు ఉండగా సర్వీసు ఓటర్లతో కలిపి ప్రస్తుతం 18,29,320 మంది ఉన్నారు.

రాజకీయ చిత్ర విచిత్రాలు

శాలువాలకు భలే డిమాండ్

ప్రచారానికి వస్తున్న వారిని సన్మానించేందుకు ఉత్సాహం

గిద్దలూరు, మే 2 : ఎన్నికల వేళ వస్త్రదుకాణాల్లో శాలువాలకు గిరాకీ పెరిగింది. గెలిచిన తర్వాత ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులకు శాలువాలు కప్పి సన్మానిస్తారు. ఈ ఎన్నికల్లో మాత్రం ప్రచారానికి వచ్చిన నేతలను శాలువాలు కప్పి సన్మానించి కార్యకర్తలు, క్షేత్రస్థాయి నాయకులు తమ విధేయతను ప్రకటించుకుంటున్నారు. ఒకరిని చూసి ఒకరు శాలువాలు కప్పుతుండడంతో వాటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. మొత్తం మీద ప్రచార పర్వంలోనే ఒకరిని చూసి ఒకరు అభ్యర్థులను శాలువాలతో ప్రసన్నం చేసుకుంటుండడం గమనార్హం.

జిల్లాలు దాటిన ఎన్నికల విధులు

ఒంగోలులో పనిచేసే వారికి గుంటూరులో డ్యూటీ

ఒంగోలు(విద్య), మే 2 : ఎన్నికల కమిషన్ నిబంధనలు ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందిగా మారాయి. ఒంగోలులోనే స్థిరనివాసం ఉంటూ యూనివర్సిటీలో పనిచేస్తున్న వీరు గుంటూరు జిల్లాలో ఎన్నికల విధులకు నియమించారు. నిబంధనల ప్రకారం పనిచేస్తున్న నియోజకవర్గం, నివాసం, ఓటు హక్కు ఉన్న నియోజకవర్గాలను తప్పించి ఇతరచోట్ల ఎన్నికల విధులకు కేటాయించాలి. అందుకు విరుద్ధంగా యూనివర్సిటీ అధ్యాపకులను, సిబ్బందిని గుంటూరు జిల్లాలోని గుంటూరు తూర్పు, పశ్చిమ, తాడికొండ తదితర నియోజకవర్గాలలో ఎన్నికల విధులకు వీరిని నియమించారు. గతంలో డీడీవోలు పంపించే సిబ్బంది వివరాల ఆధారంగా ఎన్నికల విధులకు సిబ్బందిని నియమించేవారు. ఈసారి అందుకు విరుద్ధంగా వ్యవహరించారు. జీతాలు చెల్లించే సీఎఫ్ఎంఎస్ ద్వారా సిబ్బంది జాబితాలు తీసుకొని వాటి ఆధారంగా ఎన్నికల విధులకు నియమించారు. ఆంధ్రకేసరి యూనివర్సిటీ అధ్యాపకులకు, సిబ్బందికి ఇప్పటికీ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా జీతాలు చెల్లిస్తున్నారు. దీంతో వీరి పేర్లు గుంటూరు జిల్లా జాబితాలో చేరిపోయాయి. విషయం తెలుసుకున్న అధ్యాపకులు గుంటూరు జిల్లా కలెక్టర్‌ను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. వీరు శిక్షణ తరగతులకు గుంటూరు వెళ్లాల్సి వచ్చింది. పోలింగ్ విధులకు కూడా గుంటూరు వెళ్లి రావాల్సి రావడంతో వీరు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేందుకు కూడా వీరు గుంటూరు వెళ్లాల్సిందే.

బాబు పర్యటన కోసం హెలిప్యాడ్ సిద్ధం



హెలిప్యాడ్ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, టీడీపీ నాయకులు

పొదిలి, మే 2 : పొదిలిలో శుక్రవారం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం సభ ఏర్పాట్లను టీడీపీ నాయకులు ముమ్మరం చేశారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కందుల నారాయణరెడ్డితోపాటు పోలీసులు హెలిప్యాడ్ స్థలాన్ని గురువారం పరిశీలించారు. మాదిరెడ్డిపాలెం సమీపంలో హెలిప్యాడ్ నిర్మాణ పనులను గురువారం కందులతోపాటు రైతు నేత ఆవులూరి యలమంద పరిశీలించారు. ట్రాక్టర్లతో మట్టితోలి భూమిని చదును చేసి సిద్ధం చేశారు. ప్రచార సభను కందుల నారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డిలు పాల్గొననున్నారు. హెలిప్యాడ్‌ను క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీధర్, దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, పొదిలి సీఐ మల్లికార్జునరావ్, ఎస్ఐ కోటయ్యలు పరిశీలించారు. చంద్రబాబు ప్రజాగళం సభను విజయవంతం చేయాలని అభ్యర్థి కందుల కోరారు.

నేడు గిద్దలూరుకు పవన్‌కల్యాణ్

పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 2 : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో గిద్దలూరు చేరుకొని కూటమి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోరుతూ ప్రచారం చేయనున్నారు. పట్టణ శివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంకు పక్కన హెలిపాడ్ నిర్మించారు. అక్కడి నుంచి భారీ ర్యాలీగా జయరామ్ లాడ్జి వద్ద నంద్యాల-ఒంగోలు జాతీయ రహదారిపై బహిరంగ సభ జరుగనున్నది. గురువారం టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, జనసేన ఇన్‌చార్జి బెల్లంకొండ సాయిబాబా హెలిప్యాడ్ ప్రాంతాన్ని, ర్యాలీ, బహిరంగ సభ జరిగే ప్రాంతాలను పరిశీలించారు. జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ జేవీనారాయణ, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగనాయకులు, టీడీపీ నాయకులు శేషగిరి, బిల్లా రమేష్ పాల్గొన్నారు.



హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అశోక్‌రెడ్డి

ఎన్‌డీఏ కూటమితోనే వర్గీకరణ

● ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ● ఎరిక్షన్‌బాబుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ

ఎర్రగొండపాలెం, మే 2 : కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు అధికారంలోకి వస్తేనే ఏబీసీ ఎస్సీ వర్గీకరణ సాధ్యమని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎర్రగొండపాలెంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు విజయం కోసం గురువారం ఎర్రగొండపాలెంలో టీడీపీ ప్రచార ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా టీడీపీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ బొమ్మ కూడలి, త్రిపురాంతకం రోడ్లపై ప్రచారం చేశారు. ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు ఎన్‌డీఏ కూటమి అసెంబ్లీ, ఎంపీ అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. 1999 నుంచి 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్న సమయంలో అసెంబ్లీలో వర్గీకరణ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏబీసీ వర్గీకరణ అమలు చేయడం వలన ఐదేళ్లలో 22వేల మాదిగ యువతి, యువకులకు ఉద్యోగాలు దక్కాయని గుర్తు చేశారు. 2004 తర్వాత కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న రాజశేఖరరెడ్డి తనకు పదవి ఇచ్చి ఉద్యమాన్ని నీరుగార్చాలని చూశారన్నారు. వైసీపీ స్థాపించిన సమయంలో జగన్మోహన్‌రెడ్డి కలసి వర్గీకరణ బిల్లుకు సహాయం చేయమని అడిగామన్నారు. అయితే వైసీపీకి మద్దతు ఇస్తే రాజ్యసభ ఇస్తానని చెప్పి, తనను మభ్యపెట్టి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేశారని అన్నారు. ఎవరు ఎన్ని ప్రలోభాలు పెట్టిన మాదిగ జాతి బిడ్డల భవిష్యత్‌కోసం 1994లో స్థాపించిన ఎంఆర్‌పీఎస్ ఉద్యమాన్ని మొక్కవోని దీక్షతో కొనసాగిస్తున్నామన్నారు. దేశప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎంఆర్‌పీఎస్ కార్యకర్తగా పనిచేయాలని ఉందని హైదరాబాద్ సభలో అన్నారని, ఎంఆర్‌పీఎస్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు వ్యాపించిందని అన్నారు. రాష్ట్రంలో జగన్‌ను ఇంటికి పంపించి, చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేస్తేనే మాదిగ బిడ్డలతో పాటు అన్ని వర్గాల పేదప్రజలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యేగా గూడూరి ఎరిక్షన్‌బాబును గెలిపిస్తే, చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. రాష్ట్రంలో 29 ఎస్సీ రిజర్వుడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉంటే కూటమిలో బీజేపీ, జనసేనకు పోను మిగిలిన 25 అసెంబ్లీ స్థానాలలో 19 మంది మాదిగలకు చంద్రబాబు ఎమ్మెల్యే అభ్యర్థులుగా సీట్లు ఇచ్చారని, వారంతా పోటీలో ఉన్నారని అన్నారు. వైసీపీ పార్టీ కేవలం 10 మందికి మాత్రం ఎమ్మెల్యే సీట్లు ఇచ్చిందన్నారు. టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ.., మే 13 జరిగే పోలింగ్ రోజున ఎంఆర్‌పీఎస్, మాదిగ దండోర కార్యకర్తలు సైకిల్‌గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థిం చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు, వెలిగొండ ప్రాజెక్టు నీటి విడుదల బాధ్యతను టీడీపీ తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షులు డాక్టరు మన్నె రవీంద్ర, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టరు ము న్నంగి నాగరాజు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదిమూలం ప్రకాష్, జిల్లా అధికార ప్రతినిధి వినయ్, సీనియర్ నాయకులు చేదూరి గంగయ్య, కొదమల జిన్నా, నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు లింగాల అ బ్రహాం మాజీ జడ్పీటీసీ జడ్డారవి, వెంగయ్య పాల్గొన్నారు.

సేవకుడిని ఆదరించండి

పెద్దదోర్నాల : ఎర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి సేవకుడిగా పనిచేయడానికి సిద్ధంగా ఉన్న తన తండ్రి గూడూరి ఎరిక్షన్‌బాబును ఈ ఎన్నికల్లో ఆదరించాలని ఆయన తనయ చల్సియా, తనయుడు అజిత్‌లు ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక సుందరయ్య కాలనీలో గురువారం ప్రచారం చేశారు. మూడేళ్లగా ఈ ప్రాంతంలో తమ తండ్రి ఎరిక్షన్‌బాబు పర్యటిస్తున్నారని అందరిలో కలిసిపోయారన్నారు. ప్రజా సమస్యల అవగాహన ఉన్న తమ తండ్రిని గెలిపిస్తే వారికి మేలు జరుగుతుందన్నారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబుకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఏర్వ మల్లికార్జునరెడ్డి, నాయకులు షేక్ మాబు, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, దేసు నాగేంద్రబాబు, చంటి, కే.శ్రీనివాసులు, షేక్ ఇస్మాయిల్, భాష, ఎలకపాటి చెంచయ్య, కే సుబ్బారెడ్డి, బట్టు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



దోర్నాలలోని సుందరయ్య కాలనీలో ప్రచారం చేస్తున్న చల్సియా, అజిత్‌లు

టీడీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం

త్రిపురాంతకం : వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి మాగుంటను గెలిపించాలని, టీడీపీ ప్రభుత్వం రాగానే నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచుతామని వై.పాలెం నియోజకవర్గ ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. మండలంలోని నడిగడ్డ, దూపాడు గ్రామాల్లో మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ రాక్షస పాలనను సాగించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకుని రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించుకుందామని పిలుపునిచ్చారు. టీడీపీ గెలిచిన వెంటనే మార్కాపురం జిల్లా వస్తుందని, రాష్ట్రానికి కంపెనీలు వస్తాయన్నారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని వివరించారు. ఈ సందర్భంగా నడిగడ్డ గ్రామంలో వైసీపీని వీడిన 50 కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. పార్టీలో చేరినవారికి ఎరిక్షన్‌బాబు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.వలరాజు, ఎం.శ్రీనివాసరెడ్డి, చలమయ్య, ఏ.నాసరరెడ్డి, వి.ఆంజనేయులు, వి.వెంకటేశ్వర్లు, కొల్లి వెంకటనారాయణరెడ్డి, గాయం వెంకటేశ్వరరెడ్డి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



నడిగడ్డలో టీడీపీలోకి కార్యకర్తలను ఆహ్వానిస్తున్న ఎరిక్షన్‌బాబు

టీడీపీలో 50 కుటుంబాల చేరిక

ఎర్రగొండపాలెం : ఎన్నికల వేళ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 50 కుటుంబాల వారు చేరారు. వీరంతా గురువారం ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయానికి రాగా పార్టీ కండువాలు వేసి టీడీపీ కూటమి అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు, డాక్టరు మన్నె రవీంద్రలు పార్టీలోకి ఆహ్వానించారు. ఎర్రగొండపాలెం మండలం గంజివారిపల్లె పంచాయతిలోని దద్దనాల గిరిజన గూడెంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 25 కుటుంబాలు, పెద్దారవీడు మండలం మాచరాజుకుంటలో వైసీపీ నుంచి వార్డు సభ్యుడు జడ్డా దేవయ్య ఆధ్వర్యంలో 15 కుటుంబాలు, తంగిరాలపల్లె గ్రామంలో వైసీపీ నుంచి టీడీపీలోకి 10 కుటుంబాలు చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కామేపల్లి వెంకటేశ్వర్లు, లింగాల అబ్రహాం, గంజి రమణారెడ్డి పాల్గొన్నారు.

అవీ..ఇవీ..


ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి



అవగాహన కార్యక్రమంలో మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, మే 2: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎల్‌డీవో సాయికుమార్ అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఎన్నికలకు సంబంధించిన చిత్రాలను బొమ్మలుగా గీయించి విద్యార్థులతో నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఓటుహక్కు వినియోగంపై మహిళలు ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం అన్నారు. ఎంపీడీవో చందన మాట్లాడుతూ ఓటును కూడా ఆయుధంగా ఉపయోగించుకుని ప్రజలు దేశాన్ని నడిపించాలన్నారు. డబ్బు, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ కిరణ్, స్వీప్ మోడల్ అధికారి సుభానీ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న సబ్‌కలెక్టర్

మార్కాపురం వన్‌టౌన్, మే 2: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ రాహుల్ మీనా మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేదన్నారు. నియోజవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాలకు 27 మంది అభ్యర్థులకు సరిపడా ఈవీఎంలను సిద్ధం చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు.

పోలింగ్ సిబ్బందికి శిక్షణ



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఆర్‌వో నాగజ్యోతి

గిద్దలూరు, మే 2 : పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు తీసుకోవలసిన జాగ్రత్తలపై పోలింగ్ సిబ్బందికి రిటర్నింగ్ అధికారి నాగజ్యోతి శిక్షణ ఇచ్చారు. స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లకు వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈవీఎంల వినియోగం, ఈవీఎంలలో సమస్య వస్తే చేయాల్సిన పనుల గురించి ఎవరికి తెలుపాలి, వెంటనే ఏమి చేయాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని సూచిం చారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సిద్దార్థ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు వివిధ అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు.

4 నుంచి హోం ఓటింగ్

గిద్దలూరు, మే 2 : గిద్దలూరు నియోజకవర్గంలో ఈ నెల 4 నుంచి 8వ తేదీ వరకు హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి డి.నాగజ్యోతి తెలిపారు. గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి 295 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. వీరి ఇళ్ల వద్దకు వెళ్లి ఈ నెల 4 నుంచి 8 వరకు హోం ఓటింగ్ తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే 3083 మంది పోలింగ్ సిబ్బందికి గిద్దలూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 4 నుంచి 7వ తేదీ వరకు అత్యవసర సేవలకు సంబంధించిన 394 మందికి రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు పోస్టల్ ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు షెడ్యూల్ ప్రకారం ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5404 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా వారందరికీ పోస్టల్ బ్యాలెట్లు బట్వాడా చేసినట్లు రిటర్నింగ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

కోర్టు ఆవరణలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి మేరీసారదానమ్మ

గిద్దలూరు టౌన్, మే 2 : మున్సిపల్ కార్యాలయం సహకారంతో పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బి.మేరీసారదానమ్మ గురువారం ప్రారంభించారు. న్యాయాధికారి మాట్లాడుతూ కక్షిదారుల దాహార్తిని తీర్చడం కోసం బార్ అసోసియేషన్ అధ్యక్షులు పాలుగుళ్ల నాగేశ్వరెనారెడ్డి చొరవ చూపి మున్సిపాలిటీ సహకారంతో చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ రఘునాథ్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయగిరి మల్లికార్జునరావు, ఉపాధ్యక్షుడు ఉస్మాన్‌షరీఫ్, న్యాయవాదులు సంధ్యారాణి, సిద్ధయ్య, సుధీర్, ముత్తుముల రంగారెడ్డి, పిచ్చయ్య, పిడతల రాజశేఖర్‌రెడ్డి, హిమశేఖర్‌రెడ్డి, శివపురం భాస్కర్‌రావు, కే.రవిప్రకాశ్‌బాబు, పరదేశి నిరంజన్, ఎస్.వీ.చలపతిరావు, భూపతి ఐజాక్, రంగమోహన్, కటారు పోలిరెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

వడదెబ్బకు మహిళ మృతి

మార్కాపురం రూరల్, మే 2: మండలంలోని రాయవరం గ్రామంలో వడదెబ్బకు గురై దొంత వెంకటరాజేశ్వరి(47) వివాహిత గురువారం మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేదని తెలిపారు. వడదెబ్బకు గురికావడంతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.

చిన్నారులతో వైసీపీ ప్రచారం



వైసీపీ ప్రచారంలో ఉన్న చిన్నారులు

పొదిలి, మే 2 : పట్టణంలోని 7వ వార్డులో గురువారం వైసీపీ బూత్‌కమిటి సభ్యులతో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో చిన్నారులతో ప్లకార్డులు పట్టించి ప్రచారం చేయించడం విశేషం. రాజకీయం అంటే ఏమిటో తెలియని చిన్నారలకు రాజకీయరంగు పులమడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రచారంలో చిన్నారలతో ఫ్యాన్‌గుర్తు ఉన్న స్టిక్కర్లు పట్టించి పెద్దలతో నిలబెట్టి ప్రచారంలో నిలబెట్టారు. ఏది ఏమైనా ఎన్నికలంటే ఏమిటో తెలియని చిన్నారులను వైసీపీ ప్రచారంలోకి లాగడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు.

టీడీపీతోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు

● ఆ పార్టీ నాయకులు యేరువ లక్ష్మి



ప్రచారం చేస్తున్న నారాయణరెడ్డి సోదరి లక్ష్మి

మార్కాపురం, మే 2: మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పాటు టీడీపీతోనే సాధ్యమౌతుందని మాజీఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోదరి లక్ష్మి అన్నారు. పట్టణంలోని 17వ వార్డులో టీడీపీ పోల్ మేనేజ్మెంట్ ఇన్‌చార్జ్ కందుల రామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రజాగళంలో భాగంగా ఇంటింటికీ మీ కందుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే మహిళల సాధికారత సాధ్యమైందన్నారు. నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని సీఎం జగన్ మాయమాటలు చెప్పి అమలు చేయకుండా మోసం చేశారన్నారు. 'జే' బ్రాండ్ లిక్కర్‌తో పేదల ఆరోగ్యాలతో ఆటలాడుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, కందుల నారాయణరెడ్డిలను రానున్న ఎన్నికలలో గెలిపించి మార్కాపురం ప్రాంత అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వక్కలగడ్డ మల్లికార్జున్, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, మాజీకౌన్సిలర్ మర్రి ఝాన్సీరాణి, నాయకులు పాల్గొన్నారు.

అశోక్‌రెడ్డికి ఆర్యవైశ్యుల మద్దతు



అశోక్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

గిద్దలూరు టౌన్, మే 2 : టీడీపీ హయాంలోనే ఆర్యవైశ్యులకు ప్రధాన్యత లభించిందని ఆర్యవైశ్య నాయకులు అరవీటి సత్యనారాయణ, నటుకుల శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణ ఆర్యవైశ్యులు టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ ఇటీవల విడుదల చేసిన మానిఫెస్టోలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పిస్తూ చిరువ్యాపారులకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు పేర్కొంటూ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారిక కార్యక్రమంగా చేపడతామని చంద్రబాబునాయుడు ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ, జనసేన, బీజేపీ అధినేతలకు ధన్యవాదాలు తెలిపారు. కృతజ్ఞతగా ముత్తుముల అశోక్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు వాడకట్టు శివప్రసాద్, సీవీఎన్ ప్రసాద్, దమ్మాల జనార్ధన్, గర్రె శ్రీనాథ్, తదితరులు ఉన్నారు.

టీడీపీలో చేరిన శేఖర్‌రెడ్డి

కొమరోలు మండలం అయ్యవారిపల్లెకు చెందిన వైసీపీ కీలకనేత సొంటం శేఖర్‌రెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ముత్తుముల అశోక్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానిం చారు. మే 13న జరిగే ఎన్నికల్లో ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపు కోసం తాను కృషి చేస్తానని శేఖర్‌రెడ్డి తెలిపారు.

అశ్వవాహనంపై చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, మే 2: బ్రహ్మోత్సవా లలో భాగంగా మార్కాపురంలోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి శ్రీ రంగనాయక అలంకారంలో అశ్వవాహనంపై గురువారం రాత్రి నాలుగు మాడ వీధులలో విహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నయ్య ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వ వాహనంపై ఆశీనులను చేశారు. జంతువులలో మిక్కిలి వేగవంతమైనది అశ్వమని శ్రీమన్నారా యనుని దశవతారాలు ప్రసిద్ధమైనదని తెలి పారు. అశ్వ వాహన ఉభయ దాతగా జటప్రోలు దక్షిణామూర్తి వ్యవహరించారు. ఈవో గొలమారి శ్రీనివాసురెడ్డి ఆధ్వర్యంలో వాహన విహారాన్ని సిబ్బంది పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి హంసవాహనంపై ప్రజాపతి అలంకారంలో నాలుగు తిరుమాడవీధులలో విహరించనున్నారు.

నేడు దోర్నాలలో ఉచిత వైద్యశిబిరం

పెద్ద దోర్నాల, మే 2: స్థానిక ఎంఈవో కార్యాలయం ఆవరణలో హైదరాబాద్‌కు చెందిన ముత్రాట్ ఎం.జార్జిఫౌండేషన్ సహకారంతో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు ప్రాంతీయ సమన్వయకర్త రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టీబి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరంలో బీపీ, షుగర్, లివర్, హార్ట్, కిడ్నీలకు సంబంధించిన వ్యాధులను పరీక్షించి మందులను అందజేయనున్నట్లు తెలిపారు. శిబిరానికి వచ్చే రోగులు ఏమి తినకుండా పరగడుపున ఉదయం గం.6ల నుండి గం .9ల లోపు హాజరు కావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 9010809871, 6391452014నెంబర్లను సంప్రదించాలన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి జోరుగా చేరికలు

కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 2 : గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీలో చేరికల జోరు కొనసాగుతోంది. పలువురు వలంటీర్లు వారి ఉద్యోగానికి రాజీనామా చేసి ఆ పార్టీలో చేరారు. గిద్దలూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు మూకుమ్మడిగా గురువారం తమ పదవులకు రాజీనామా చేశారు. గ్రామసర్పంచ్ పసుపుల మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయంలో వారు ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. రానున్న ఎన్నికలలో అశోక్‌రెడ్డి గెలుపునకు తాము కృషి చేస్తామన్నారు. వైఎస్ఆర్‌సీపీ నిరంకుశ పాలనకు తాము నిరసనగా రాజీనామా చేసి టీడీపీలో చేరినట్లు వలంటీర్లు మర్రి మల్లికార్జున, మీనిగె మనోహర్, గద్దల రంగస్వామి, సప్పరపు వెంకటరమణ, బాసికం వెంకటసుబ్బయ్య అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ జేవీ.నారాయణ, గ్రామసర్పంచ్ మల్లేశ్వరరావు ఉన్నారు.



టీడీపీలో చేరిన తిమ్మాపురం గ్రామస్థులు

గ్రామ సర్పంచ్ చేరిక

తిమ్మాపురం గ్రామ సర్పంచ్ పసుపుల మల్లేశ్వరయ్య ఆధ్వర్యంలో మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ బలుసా శ్రీనివాసులు, బలుసా రమణ, శ్రీనివాసులు, చిలుక రామయ్య చిలుక శ్రీనివాసులు టీడీపీలో చేరారు. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డిని, పార్లమెంటు అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు.

కంభం : గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని కంభం పట్టణానికి చెందిన 18 యానాది కుటుంబాలు కంభం మండల టీడీపీ అధ్యక్షులు తోట వెంకట శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరాయి. పట్టణంలోని అంకాలమ్మ తిప్పకు చెందిన తుపాకుల అంజి, కావేటి లక్ష్మణ్ తదితరులు టీడీపీలో చేరారు. తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా వెనుకబడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అర్ధవీడు మండలం మాగుటూరు నుంచి టీడీపీలో చేరిన కార్యకర్తలు

అర్ధవీడు మండలం మాగుటూరులో

అర్ధవీడు మండలం మాగుటూరుకు చెందిన 30 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి టీడీపీ అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఇటీవల కాలంలో అర్ధవీడు మండలంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు జోరందుకున్నాయి. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో నల్లబోతుల చెన్నకేశవులు, నల్లబోతుల లింగయ్య, నల్లబోతుల వెంకటయ్య, నల్లబోతుల బాలచెన్నయ్య, నల్లబోతుల రాముడు, పోతనపల్లి పెద్దరామలింగయ్య, పోతనపల్లి చిన్నరామలింగయ్య, ఈర్ల వెంకటేశ్వర్లు, బోగెం తిరుపాల్, నల్లబోతుల శ్రీను, తమ్మినేని ఈశ్వర్‌రెడ్డి, తమ్మినేని మణికంఠరెడ్డి, రావిపాటి వెంకటేశ్వర్లు, రావిపాటి తిరుపతిరెడ్డి, రాయపాటి మనోజ్‌కుమార్, రాయపాటి సుబ్బారెడ్డి, తమ్మినేని సూర్యనారాయణరెడ్డి, రావిపాటి లక్ష్మీరెడ్డి ఉన్నారు.

నాడు కళకళ - నేడు వెలవెల

ఐదేళ్లగా అతిథిగృహం మూత



నిరుపయోగంగా ఉన్న అతిథిగృహం

త్రిపురాంతకం, మే 2 : అధికారుల పర్యటనల సమయంలో వారికి విడిది కేంద్రంగా ఉండే అతిథిగృహం నేడు అలనా పాలనా చూసేవారు లేక నిరుపయోగంగా మారింది. మండల కేంద్రం త్రిపురాంతకంలో ఎన్నెస్పీ అతిథి గృహం ఉంది. పెద్దదోర్నాలకు 45 కిలోమీటర్లు, వినుకొండకు 35 కిలోమీటర్లు దూరంలో జాతీయ రహదారికి ఆనుకొని ఇది ఉంది. దీంతో వీఐపీలు సైతం విశ్రాంతి కోసం ఇక్కడకు వచ్చేందుకు ఆసక్తి కనపర్చేవారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా అతిథులతో భవనం కళకళలాడింది. కానీ ఐదేళ్లగా ఈ అతిథి గృహం మూతపడడంతో ప్రాంగణమంతా వ్యర్థాలతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. ఇక్కడ కనీసం నిర్వహణ చూసేవారు కూడా లేరు. దీంతో బాలాత్రిపుర సుందరీదేవి అమ్మవారి ఆలయం వద్ద ఉన్న ప్రయివేటు సత్రాలను వీరు ఆశ్రయించాల్సి వస్తోంది.

నాగార్జునసాగర్ ప్రాజెక్టు, కాలువల నిర్మాణం సమయంలో ప్రముఖుల కోసం విశ్రాంతి భవనాన్ని నిర్మించారు. కాలానుగుణంగా అది నెర్రెలుబారి శిధిలావస్థకు చేరింది. నాటి ప్రభుత్వాలైన కాంగ్రెస్, టీడీపీ హయాంలో మరమ్మత్తులు చేయించి ఆధునీకరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులతో కళకళలాడింది. తదనంతరం చోటుచేసుకున్న పరిణామాలతో గెస్ట్‌హౌస్‌కు తాళాలు తీయకపోవడంతో కళావిహీనంగా తయారైంది. ఎన్నెస్పీ శాఖకు నిధుల కొరత కారణంగా నిర్వహణ పూర్తిగా మరుగున పడింది. దీంతో ఆప్రాంగణమంతా చిల్లచెట్లు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. దీనిపై పర్యవేక్షణ లేకపోవడంతో గృహం చుట్టూ కొందరు దర్జాగా దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆక్రమణలతో గెస్ట్ హౌస్ కనుమరుగయిందా..? అనే అనుమానాలు ప్రజల నుండి వ్యక్తం అవుతున్నాయి. ఏడాది క్రితం పలు కార్యక్రమాలపై త్రిపురాంతకానికి వచ్చిన కలెక్టరు దృష్టికి సమస్యను తీసుకెళ్ళగా త్వరలో నూతన భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అదీ ఆచరణకు నోచుకోలేదు. ఇక్కడ ఎమ్మెల్యేగా గెలిచి ఐదేళ్ల మంత్రిగా ఉన్న సురేష్ కూడా దీన్ని పట్టించుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథిగృహాన్ని ఆధునీకరించడమో, నూతన భవనాన్ని నిర్మించడమో చేస్తే ఇక్కడకు వచ్చే అతిథులకు ఉపయోగపడుతుంది.

పింఛన్‌దారుల ఇక్కట్లు





పింఛన్ పడిందో లేదో చూసుకొనేందుకు బ్యాంకు వద్ద వృద్ధుల అగచాట్లు, బ్యాంకు వద్ద వేచి చూస్తున్న వృద్ధురాలు

మార్కాపురం వన్‌టౌన్, మే 2: ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలు పింఛన్‌దారులకు శాపంగా మారాయి. మార్కాపురం పట్టణంలోని బ్యాంకుల వద్ద గురువారం పింఛన్‌దారులు బారులు తీరారు. మండుటెండలో వివిధ బ్యాంకుల వద్ద పండుటాకుల అగచాట్లు చూసేవారికి కళ్లనీళ్లు తెప్పించాయి. బ్యాంకు ఖాతాలో నగదు జమైందో లేదో తెలియక చాలా మంది ఇబ్బందులు పడ్డారు. మార్కాపురం పట్టణంలో 6221 పింఛన్లు ఉండగా 4646మందికి బ్యాంకుల్లో పింఛన్ జమ అయిందని, దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు 1575మందికి పింఛన్ ఇళ్ల వద్ద పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. కానీ మంచాలలో కదలేని వారికి కూడా బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో వారి పరిస్థితి వర్ణనాతీతం. బ్యాంకులకు 2వ తారీఖు అధిక రద్దీ ఉండటంతో క్యూలైన్లలో నిలిచి డబ్బులు తీసుకోలేక పోయారు. ఆటోలకు, డబ్బులు పెట్టి వెళ్లారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

జగన్‌ను నమ్మితే నట్టేట మునిగినట్టే!

- చంద్రబాబుకు మాదిగ బిడ్డలంతా అండగా నిలబడాలి..!
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ

కనిగిరి, మే 2: వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపునకు మాదిగ జాతి బిడ్డలంతా ఐక్యంగా ఓటేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. గురువారం రాత్రి కనిగిరిలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అన్నివర్గాల భవిష్యత్తు కోరే కనిగిరి అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని గెలిపించాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలన్నారు. గత 30ఏళ్ళుగా మాదిగజాతి అభివృద్ధి, సంక్షేమం కోసమే రాజకీయ పార్టీలకు మద్దతుగా నిలబడాల్సి వచ్చిందని చెప్పారు. అందులోభాగంగా 2014లో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి చంద్రబాబు చేసిన ఏబీసీడీ వర్గీకరణలో భాగంగా 23వేల మంది మాదిగజాతి బిడ్డలకు ఉద్యోగావకాశాలు వచ్చాయని గుర్తు చేశారు. ఆ తర్వాత వైసీపీ పెట్టిన జగన్ వద్దకు వెళ్ళి ఎస్సీ వర్గీకరణ పార్టీ మేనిఫెస్టోలో తీర్మానం చేయాలని కోరితే సానుకూలంగా స్పందించారని చెప్పారు. అధికారంలోకి వచ్చాక వర్గీకరణ లెటర్‌పై సంతకం పెట్టారు, ప్రధానికి ఎస్సీ వర్గీకరణకు ఒప్పుకుంటూ ప్రధానికి లెటర్ రాశారన్నారు. ఇడుపలపాయలో జరిగిన వైసీపీ ప్లీనరీ సమావేశంలో తీర్మానం చేశారన్నారు. దీంతో ఆయనను నమ్మి మద్దతుగా నిలబడితే అధికారాన్ని చేపట్టాక మాదిగజాతిని అడుగడుగునా రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణగద్రొక్కే కుట్ర చేశారని మండిపడ్డారు. అప్పుడే అనుకున్నాను.. జగన్ రాజశేఖర రెడ్డి వారసుడే కానీ రాజకీయ వారసుడు కాదని, దుర్మార్గపు ఆలోచనలు ఉన్నావారన్నారు.

దేశంలోని అన్నిరాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణకు ఆమోదిస్తూ అనుకూలంగా చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఆధ్వర్యంలో ఏడుగురితో కూడిన ధర్మాసనంలో కేసు విచారణ చేపట్టారని మంద కృష్ణమాదిగ గుర్తు చేశారు. ప్రధాని మోదీ కూడా అనుకూలంగా తీర్మానం చేసి బిల్లును సుప్రింకు పంపితే ఆంధ్రప్రదేశ్ నుంచి న్యాయవాదిని పెట్టకుండా మాదిగల వర్గీకరణ కాకుండా జగన్ కుట్ర చేశారన్నారు. అలాంటి వ్యక్తికి మాదిగలు ఎందుకు ఓటేయాలని సభా ముఖంగా మాదిగల నుద్దేశించి ప్రశ్నించారు. శాసనసభలో కాపులపై చర్చ జరుగుతున్న తరుణంలో చంద్రబాబుతో ఎస్సీ వర్గీకరణ విషయాన్ని తెరమీదికి తెచ్చి తప్పుదోవ పట్టించారన్నారు. ఆసమయంలో ఎస్సీ వర్గీకరణకు ఒప్పుకోనని నిండు శాసనసభలో వ్యతిరేకించిన మాదిగ వ్యతిరేకి జగన్ అని పేర్కొన్నారు. మన బిడ్డల భవిష్యత్తు ముఖ్యమా..? జగన్ భవిష్యత్తు ముఖ్యమా అని ప్రశ్నించారు. మన బిడ్డల భవిష్యత్తు బాగోలేదు కానీ జగన్ భవిష్యత్తు కోసమే మనల్ని మభ్య పెడుతున్నారన్నారు. తల్లి, చెల్లెళ్ని తన పదవుల కోసం ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చాక గెంటేసింది నిజం కాదా అన్నారు. చెల్లెలు నేరుగా ఓ పార్టీ నుంచి ప్రచారం చేస్తూ జగన్‌కు ఓటేయద్దంటుంది.. తల్లి అమెరికా వెళ్ళిపోయింది.. మరి మన మాదిగలు ఎందుకు నమ్మాలన్నారు. ఒకసారి నమ్మి మోసం పోయాం.. మళ్ళీ నమ్మితే మాదిగజాతి అంతరించి పోతుందని మాదిగలు గుర్తించాలన్నారు. కాంగ్రెస్, వైసీపీ, టీడీపీ అన్ని రాజకీయ పార్టీల నుంచి పదవులు ఆఫర్ ఇచ్చారని ఎప్పుడూ ఆ పదవులకు ఆశపడలేదన్నారు. అందుకే ఇప్పటికీ మాదిగ జాతి ఉద్యమకారుడిగానే ఉన్నానన్నారు. అందుకే మాదిగజాతి బిడ్డలంతా ఒకే త్రాటిపైకి రావాలని మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. వైసీపీ పక్కన తిరిగినా మాదిగ బిడ్డ అయితే ఓటు మాత్రం సైకిల్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. మాదిగజాతిపై ఎంతో ప్రేమాభిమానాలు ఉన్న సమర్ధుడైన డాక్టర్ ఉగ్రను గెలిపించుకోవాల్సిన అవసరం మాదిగలకే కాదు, అన్నివర్గాల ప్రజలకు అవసరమని కోరారు.

మాదిగలకు అండగా ఉంటా

కనిగిరి నియోజకవర్గంలో మాదిగలకు అండగా ఉంటానని డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. తాను పదవిలో ఉన్నా, లేకున్నా మాదిగలకు తన వంతు సహాయ, సహకారాలు అదించానన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎంతో మందికి భూమలు, ఇళ్ళస్థలాలు పంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో మాదిగలు ఆదరించి ఓటేయాలని కోరారు. అధికారంలోకి వచ్చిన తర్వాత భూమి లేని వారికి భూములు, ఇళ్ళ స్థలాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, టీడీపీ ఎస్సీసెల్ నాయకులు బుల్లా బాలబాబు, సలోమన్‌రాజు, తాతపూడి స్టాలిన్(బుజ్జి), ప్రతాప్, జక్రయ్య, తదితరులు పాల్గొన్నారు. తొలుత మంద కృష్ణ మాదిగను ఉగ్ర సన్మానించారు.

పండుటాకులను ఏడిపింఛన్

- బ్యాంకులవద్ద బారులు
- ఎండ వేడిమి తట్టుకోలేక వృద్ధులు తీవ్ర ఇబ్బందులు


బ్యాంకులో నగదు కోసం నిల్చొని ఉన్న పింఛన్‌దారులు

పామూరు, ఏప్రిల్ 2: ప్రతినెలా ఇంటి వద్ద ఇచ్చే వివిధ సామాజిక పింఛన్లను ఈదఫా రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో పండుటాకులకు ఇబ్బందులు తప్పలేదు. ఆ నగదును డ్రా చేసుకొనేందుకు వృద్ధులు గురువారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న పామూరు లో బ్యాంకుల వద్ద పడరానిపాట్లు పడ్డారు. గతనెల మాదిరిగా గ్రామ సచివాలయల వద్ద చేసినట్లు పంపిణీ చేయకుండా, కావాలని బ్యాంకు ఖాతాలకు జమ చేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. కొంత మందికి పింఛన్ నగదు బ్యాంకు ఖాతాలో నగదు పడినప్పటికీ విత్‌డ్రా చేసుకొనేందుకు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. గత ఆరు నెలలుగా బ్యాంక్ ఖాతాలు మానిటరింగ్ చేయకపోవడం, ఆధార్‌కు బ్యాంకు, ఫోన్ లింక్ లేకపోవడంతో పింఛన్‌దారులు తీవ్రఅసౌకర్యానికి గురయ్యారు.

పామూరులోనే బ్యాంకులన్నీ ఉండటంతో మండలంలోని పడమటకట్టకిందపల్లి, చిలంకూరు, దాదిరెడ్డిపల్లి, వగ్గంపల్లి, రావిగుంటపల్లి, అటు మోపాడు, ఇనిమెర్ల దూబగుంట, తదితర గ్రామాల నుంచి సుమారు 15 నుంచి 10 కిలోమీటర్ల దూరాభారం నుంచి పింఛన్‌దారులు 45 డిగ్రీల ఎండవేడమిని తట్టుకుంటూ బ్యాంకుల వద్ద పడిగాపులుకాశారు. పింఛన్‌దారుల రద్దీని తట్టుకోలేక బ్యాంకు సిబ్బంది కసురుకొంటూ సరైన సమాధానం చెప్పలేక పోవడంతో పడరానిపాట్లు పడ్డారు. కందుకూరు రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ బ్యాంకు, నెల్లూరు రోడ్డులో ఉన్న కెనరా బ్యాంక్ మెట్లు ఎక్కలేక పలువురు వృద్ధులు అష్టకష్టాలు పడ్డారు. ఇనిమెర్లకు చెందిన గాలంకి కొండయ్య అనే వృద్ధుడు పింఛన్ కోసం తన భార్య రాములమ్మను తోడుగా తెచ్చుకొని బ్యాంకు మెట్లు ఎక్కి నగదును డ్రా చేసుకొని వస్తుండగా చెప్పు ఒకటి కనపడకుండా పోయింది. బ్యాంకు కింద నిలబడి ఉన్న రాములమ్మ ఆత్రుతగా కూల్‌డ్రింక్ షాపు వద్దకువస్తూ కిందపడిపోయింది దీంతో ఆమెకు నడుంవద్ద ఎముకకు దెబ్బతింది. నాకు తోడుగా వచ్చిన భార్యకు ఇప్పుడు నేను తోడుగా ఉండాల్సి వచ్చింది అంటూ విలపించాడు.

పామూరు పట్టణానికి చెందిన ఖాజాబి గత రెండు రోజుల నుంచి ఆరోగ్యం బాగలేక చేతికి సెలయిన్ కట్టించుకొన్నది. బ్యాంకులో పింఛన్ నగదు పడినట్లు మెసేజ్ రావడంతో సెలయిన్ కోసం చేతికి కట్టుకొన్న ఐవీ సెట్‌తోనే బ్యాంకు వద్దకు వచ్చి నగదు డ్రా చేసి తిరిగి వెళ్లలేక బెంచిపైనే కూర్చుండిపోయారు. దూదగుంట పంచాయతీకి చెందిన కొండమ్మ బ్యాంకు మెట్లు ఎక్కలేక అపసోపాలు పడ్డారు. తమ రాజకీయ స్వార్ధం కోసం పింఛన్‌దారులను ఇబ్బందులు పాలుచేయడం ఎందుకంటూ వృద్ధులు ప్రశ్నిస్తున్నారు.

బ్యాంక్‌ల వద్ద పింఛన్‌దారుల అవస్థలు

దర్శి, మే 2: పింఛన్‌దారులు బ్యాంకులవద్ద డబ్బులు తీసుకునేందుకు ఎండలకు నానా అవస్థలు పడ్డారు. రవాణా సౌకర్యం సరిగా లేకపోవటంతో మండు టెండల్లో ఆటోల్లో వచ్చి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఉద్యోగుల ద్వారానయినా ఇళ్ల వద్ద పంపిణీ చేసి ఉంటే అవస్థలు తప్పేవని వాపోతున్నారు. బ్యాంకు ఖాతాలు ఉన్నవారికి అకౌంట్‌లో నగదు జమ చేయటంతో గ్రామాల నుంచి దర్శి వచ్చి పింఛన్ తీసుకు నేందుకు అవస్థలు పడ్డారు. దర్శి పట్టణలో 3300 మంది పింఛన్‌దారులు వుండగా, రూరల్‌లో 6298 మంది ఉన్నారు. అధికశాతం మంది గ్రామాలకు చెందినవారు కావటంతో ఎండకు అల్లాడి పోయారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం ఖాయం

- మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు


ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దేవినేని ఉమామహేశ్వరరావు, తదితరులు

దర్శి, మే 2: వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయ దుందుభి మోగిస్తుందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. దర్శి అసెంబ్లీ అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి, ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసుల రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన గురువారం దర్శి పట్టణంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.స్థానిక టీడీపీ కార్యాలయంలోఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో పదిరోజుల్లో వైసీపీ అరాచక పాలనకు చరమగీతపాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈనెల 4న దర్శిలో చంద్రబాబు పాల్గొంటున్న సభకు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయలన్నారు. టీ డీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని ప్రశంశించారు. కార్యక్రమంలో డాక్టర్ లలిత్‌సాగర్, నగరపంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తలారి కోటయ్య, శోభారాణి, బేళ్ల శ్రీనివాసరావు, కనకం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసిచూపిస్తా!

- టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి


ఇండ్లచెరువులో గజమాలతో గొట్టిపాటి లక్ష్మిని సన్మానిస్తున్న గ్రామస్థులు

దొనకొండ, మే 2: ప్రజల మనస్సుల్లో చోటు సంపాదించుకున్న గొట్టిపాటి రాజకీయ కుటుంబం వారసురాలిగా మీముందుకు వచ్చా.. ఎన్నికల్లో ఓటుహక్కు ద్వారా ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపిస్తానని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఇండ్లచెరువు, రాగమక్కపల్లి, భూమనపల్లి, రుద్రసముద్రం, రామాపురం, లక్ష్మీపురం, పోలేపల్లి గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు తమపట్ల చూపుతున్న ఆదరణ మరువలేనిదని అన్నారు. మహిళా శక్తి అండగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దర్శి నియోజకవర్గంను పట్టిపీడిస్తున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. వైద్యపరంగా ప్రజలు ఇబ్బం దులు పడకుండా అన్నిసౌకర్యాలతో వైద్య సేవలందిస్తా మని హామీ ఇచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను, ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, వీరపనేని వెంకన్నచౌదరి, కందుల నారపురెడ్డి, వల్లపునేని వెంకటస్వామి, కామేపల్లి నారాయణమ్మ, వడ్లమూడి చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

హెలీప్యాడ్ ఏర్పాటుకు స్థల పరిశీలన


హెలీప్యాడ్‌ను పరిశీలిస్తున్న లలిత్ సాగర్, తదితరులు

దర్శి, మే 2: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాగళం ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈనెల 4న దర్శికి వస్తుండటంతో టీడీపీ నాయకులు ఏర్పాట్లుచేస్తున్నారు. దర్శి అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి భర్త డాక్టర్ లలిత్‌సాగర్, నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు దర్శి - పొదిలి రోడ్డులో ఓవెంచర్‌లో స్థలాన్ని పరిశీలించారు. ఆస్థలం అనువుగా ఉండటంతో ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. చంద్రబాబు శనివారం ఉదయం 10 గంటలకు దర్శిలో ఎన్నికల సభలో ప్రసంగిస్తారు. ఈనేపథ్యంలో దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో వేదిక ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, దారం సుబ్బారావు, మారెళ్ల వెంకటేశ్వర్లు, పుల్లలచెరువు చిన్న, కలవకొలను చంద్రశేఖర్, కన్నా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రచార ర్యాలీలో పాల్గొన్న వీవోఏ తొలగింపు

తాళ్లూరు, మే 2 : వైసీపీ ప్రచార ర్యాలీలో పాల్గొన్న వైకేపీ వీవోఏను విధుల నుంచి తొలగించారు. రెండురోజులుగా వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని తూర్పుగంగవరంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న వీవోఏ దుద్దుకూరి పద్మను విధుల నుంచి తొలగించారు. ఈమేరకు ఆశాఖకు చెందిన అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా విధుల నిర్వహణకు సంబంధించి బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. దీనిపై విచారణ చేయించి నిజమని తేలడంతో వీవోఏను తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

రైల్వేస్టేషన్‌ను తనిఖీచేసిన డివిజనల్ రైల్వే మేనేజర్


దొనకొండ రైల్వేస్టేషన్‌లో తనిఖీ చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

దొనకొండ, మే 2: దొనకొండ రైల్వేస్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం .రామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లోని అన్నీ కార్యాలయాలు, పరిసరాలను ఆయన పరిశీలించారు. పుట్ ఓవర్ బ్రిడ్జి లేక రైల్వేస్టేషన్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి పొడిగింపు నిర్మాణం చేపట్టాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలపగా, పరిశీలిస్తామని డీఆర్ఎం తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైల్వే డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

'కనిగిరి' అభివృద్ధే లక్ష్యం: ఉగ్ర

- 83 కుటుంబాలు పార్టీలో చేరిక


డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన కనిగిరి మండలం వాగుపల్లి గ్రామస్థులు


ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన సీఎస్‌పురం మండలకేంద్రం వాసులు

కనిగిరి, మే 2: కనిగిరి నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో గురువారం కనిగిరి మండలం వాగుపల్లికి చెందిన 35 కుటుంబాలు, సీఎస్‌పురం మండల కేంద్రానికి చెందిన 15 కుటుంబాలు, వెంకటయ్యచెరువు గ్రామానికి చెందిన 21 కుటుంబాలు, వెలిగండ్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన 12 కుటుంబాలు వైసీపీని టీడీపీలో చేరారు. ఈసందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ కనిగిరి ప్రాంతాభివృద్ధికి కులమతాలకు అతీతంగా తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు ఓటమి తప్పదన్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని ప్రధాన అంశాలను, ప్రజాసంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు. కనిగిరి అ భివృద్ధి జరగాలంటే విద్య, ఉపాధి, ఉద్యోగ, వ్య వసాయ, వైద్య రంగాలు కనిగిరి ప్రాంతానికి చేరువ కావాలన్నారు. అందుకోసం తాను కృతనిశ్చయంతో ఉన్నానన్నారు. కనిగిరి అభివృద్ధి కోసం సూపర్ ఫైవ్ ప్రణాళికలతో ముందుకువెళుతున్నట్లు చెప్పారు.

కనిగిరి మండలం వాగుపల్లి గ్రామానికి చెందిన మూప్పూరి సాలమ్మ, నూకతోటి పెద్ద చెన్నయ్య, సంపూర్ణ, అంకయ్య, పూజల రమణయ్య, కృష్ణారావు, ఆంజనేయులతో పాటు 35 కుటుంబాలు ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరారు. సీఎస్‌పురం మండలం కేంద్రానికి చెందిన 15 కుటుంబాలు, బోయమడుగుల పంచాయతీ వెంకటయ్యచెరువు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుక్కల రమణయ్య, రావుల రావయ్య, రావుల గురవయ్య, చినగురవయ్యతో పాటు 15కుటుంబాలు చేరారు.

అలాగే, వెలిగండ్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన 12 కుటుంబాలు పార్టీలో చేరారు. వారికి డాక్టర్ ఉగ్ర టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

అలుపెరగని పోరాట యోధుడు కృష్ణమాదిగ

దొనకొండ, మే 2: నమ్మిన సిద్ధాంతం కోసం, తనను నమ్ముకున్న జాతికోసం మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్న పోరాట యోధుడు మందా కృష్ణమాదిగ అని టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దొనకొండలో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సభలో ఆమె మాట్లాడారు. టీడీపీ కూటమి అభ్యర్థి అయిన తన గెలుపుకోసం మందా కృష్ణ మాదిగ ఇక్కడకు రావటమే శుభపరిణామమన్నారు. మాదిగ హక్కుల ఉద్యమమే మానవ హక్కుల ఉద్యమని నిలదీసిన నాయకుడు అని కొనియాడారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

లోకేష్‌ను కలిసిన కోటపాటి

పామూరు, మే 2: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీకి అనుకూలమైన గాలి వీస్తుందని, కనిగిరి నియోజకవర్గంలో మంచి మెజార్టీతో గెలవడం ఖాయమని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటపాటి జనార్దనరావు తెలిపారు. ఆయన పూతలపట్టు నియోజకవర్గ ఎన్నికల పరిశీలికులుగా ఉన్నారు. చంద్రగిరిలో ఏర్పాటుచేసిన యువగళం సభకు విచ్చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కోటపాటి కలుసుకొన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ విజయావకాశాలపై చర్చించినట్లు కోటపాటి తెలిపారు. లోకేష్‌ను కలిసిన వారిలో గురుజాల సందీప్ నాయుడు ఉన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

తాళ్లూరు, మే 2: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి సోదరుడు భరత్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి లక్కవరం గ్రామంలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ గొట్టిపాటి కుటుంబం పార్టీలకు అతీతంగా అందరికీ న్యాయం చేస్తుందన్నారు. ప్రస్తుత పాలనలో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నందున కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుక రావాలన్నారు. ఎమ్మెల్యేగా సోదరి గొట్టిపాటి లక్ష్మిని, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు బొద్దు హనుమారెడ్డి, మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఆవుల ఆదినారాయణ, పేరిరెడ్డి, తూము లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ సైకిళ్లపై ప్రచారం


కనిగిరిలో సైకిళ్లపై ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

పామూరు, ఏప్రిల్ 2: టీడీపీ కూటమి అభ్యర్థులు మాగుంట, ఉగ్ర విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని తూర్పువీధి, అంకాలమ్మవీధి, సీతారామునితోట ఏరియాల్లో గురువారం టీడీపీ, జనసేన కార్యకర్తలు సైకిళ్లపై ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీటీసీ బొల్లా నరసింహారావు సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీచేశారు. కార్యక్ర మంలో సుభాషిణి, గుత్తి రాజ, ఇర్రి కోటిరెడ్డి, తోట రవికుమార్, జి.మహేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలకు సం బంధించిన పత్రా లను ఇంటింటికి పంచుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొల్లా మహాలక్ష్మమ్మ, దేవరపు రమణమ్మ, పువ్వాడి నాగమణి, గుంటుపల్లి సుజాత, ఇర్రి రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు. తూర్పుకట్టకిందపల్లి గ్రామంలో యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం బాబును మళ్ళీ రప్పిద్దాం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తెలు గుయువత మండల అధ్యక్షుడు ఉప్పలపాటి హరిబాబు, పాలపర్తి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.




టీడీపీ హయాంలో నిర్మించిన దశతోనే ఆగిపోయిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ తరగతి గదుల సముదాయం


రామాపురం రోడ్డులో పంట కాల్వను పూడ్చి చదును చేసిన దృశ్యం

పంట కాల్వ పూడ్చేశారు

- వెంచర్ కోసం కాల్వ ఆక్రమణ
- అధికారుల మౌనంపై రైతుల ఆగ్రహం
- చీరాలలో బరితెగిస్తున్నా రియల్ వ్యాపారులు

చీరాల, మే 2: నీటి వనరులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఛిద్రం చేయకూడదు. అందుకు సంబంధించి హైకోర్టు, సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్) నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు, ఆదేశాలు ఉన్నాయి. పొలాల్లో అధికారుల అనుమతి లేకుండా ప్లాట్లు వేయరాదు. కానీ వీటిని రియల్ వ్యాపారులు ఖాతరు చేయడంలేదు. సాగునీరు పారాల్సిన కాల్వలు, పంటలు పండాల్సిన భూములను రియల్ వ్యాపారులు కాసులకు కేంద్రాలుగా మార్చేస్తున్నారు. జాతీయ రహదారి 216 వెంట కొత్తపేట నుంచి రామాపురం వెళ్లేదారిలో అబ్దుల్ కలామ్ కాలనీ సమీపంలోని పంట కాల్వను పూడ్చేవారు. దానివెంట పొలాల్లో ఎలాంటి అనుమతులే లేకుండా ప్లాట్లు వేసేందుకు పనులు ప్రారంభించారు. అధికారులు ఎన్నికల హడావుడిలో ఉండగా ఇదే అవకాశంగా అతడు కాల్వను పూడ్చేశారు. కాల్వ కింద రైతులు వరి, వేరుశనగ, మినుము తదితర పంటలను సాగు చేస్తుంటారు. ఆ ప్రాంత రైతులకు ఈ పంట కాలువే సాగునీటి వనరు. ఈ కాల్వను ఎలా పూడుస్తారని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాల్వలో పైపు వేసి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామని ఆ వ్యక్తి చెప్తున్నారు. ఒకరిని చూచి మరొకరు అన్నట్లుగా రోడ్డు మార్జిన్ స్థలాన్ని కలుపుకునేందుకు తాము వేసే వెంచర్ ప్లాట్లు ముందు అందంగా కనిపించేందుకు కాల్వను పైపులు వేసి చదును చేస్తుంటే అధికారుల్లో కదలిక లేదు. నీటి వనరులకు సంబంధించి ఏదైనా ప్రత్యామ్నాయ చర్య చేపట్టాలన్నా నీటి పారుదల, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి పక్కాగా అనుమతి పొందాలి. అయితే ఇదేమీ లేకుండా కాల్వను పూడ్చినా పట్టించుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పంట కాల్వలో సాగునీరు సక్రమంగా పారుదల జరగపోతే కొన్ని వేల ఎకరాల భూములకు సాగునీరు అందక బీడుబారే ప్రమాదం పొంచి ఉందని రైతులు వాపోతున్నారు. ఎన్నికల హడావుడి అని చెప్పకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు చేపట్టాలని రైతులు, ప్రజలుకోరుతున్నారు.

పంటకాల్వను పూడ్చరాదు

- ప్రసాద్, డీఈఈ చీరాల

నీటి వనరుల రూపుమార్పే అధికారం ఎవరికీ లేదు. ఒకవేళ ఎవరన్నా అలాంటి చర్యలకు పాల్పడితే అది నేరం. కొత్తపేట, రామాపురం మధ్యనున్న పంట కాలువ నీటి పారుదల శాఖ పరిధిలోకి వస్తుందా లేకుంటే ఐడీసీ కిందికు వస్తుందా పరిశీలించి చర్యలు చేపడతాం.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

- హజరత్తయ్య, ఐడీసీ, ఈఈ, ఒంగోలు

కొత్తపేట, రామాపురం మధ్య ఉన్న పంట కాలువ ప్రస్తుతం తమ డిపార్ట్‌మెంట్ పర్యవేక్షణలో ఉందా, లేదంటే నీటిపారుదలశాఖ పరిధిలో ఉందా, లేదంటే రైతు కమిటీల పరిధిలో ఉందో చూడాలి. అందుకు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం. ఆ తర్వాత అనుగుణంగా చర్యలు ఉంటాయి.

నాడు.. నేడు.. ఎక్కడికక్కడే

- నిధులు ఇవ్వక సాగని పనులు
- ప్రకటనల్లో గొప్ప.. ఆచరణలో అధోగతి
- చిత్తశుద్ధి లోపంతో పనుల పురోగతి అంతంతే
- విద్యా సంవత్సరం ముగిసినా పూర్తి కాని పనులు

నాడు - నేడు అద్భుతం అన్నారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పన్నారు. కార్పొరేట్ పాఠశాలల్లోని సౌకర్యాలను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించామన్నారు. రెండు విడతల్లో చేపట్టిన నాడు-నేడు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో 3161 పాఠ శాలల్లో వేల పనులు చేపట్టారు. ఆర్భాటపు ప్రకటనలతో సరి పుచ్చిన ప్రభుత్వం నిధులు విడుదలపై నిర్లక్ష్యం చూపింది. దీంతో పలు పాఠశాలల్లో అరకొరగా.. కొన్ని దగ్గర్ల సగంలో ఆగి పోయి.. మరికొన్ని పాఠశాలల్లో అయితే మొదలే కాని పనులతో నాడు-నేడు అధ్వానంగా మారింది. రెండు విడతల్లోనూ పనులు సక్రమంగా జరగక విద్యార్థులు తీవ్రం గా ఇబ్బంది పడాల్సి వచ్చింది. మూడు జిల్లాల్లో రూ.699.25 కోట్లు పనులు చేపట్టగా రూ.352.82 కోట్లు మాత్రమే విడుదల అయ్యాయి. అంటే సగం పనులు కూడా సక్రమంగా జరగలేదని అర్థమవుతోంది. నిధులు కొరతతో వందల పాఠశాలల్లో పనులు అర్థాం తరంగా నిలిచి పోయాయి. కొన్ని పాఠశాలల్లో పనులను సాగదీ స్తున్నారు. అయితే అధికార పార్టీ నేతలు గత కొన్ని రోజులుగా ఎన్నికల ప్రచారంలో నాడు-నేడు మా గొప్ప అంటూ ఆర్భాటపు ప్రకటనలు చేసుకుంటున్నారు.

బాపట్ల జిల్లా..

బాపట్ల జిల్లాలో 944 పాఠశాలల్లో 183.31 కోట్ల అంచనాతో పనులు చేపట్టగా ఇప్పటికి రూ.92.72 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యా యి. 6,274 పనులకు 4,104 పనులు పురోగతిలో ఉన్నాయి. 2,083 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 96 ప్యాకేజీల్లో 112 పాఠశాలల్లో 279 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా 16 ప్యాకేజీల్లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తి చేశారు. 326 మరుగుదొడ్ల బ్లాక్‌లకు 163 చోట్ల పనులు పూర్తి అయ్యాయి. 78 పాఠశాలలకు ప్రహరీ పనులు మంజూరు కాగా తొమ్మిది పనులు పూర్తయ్యాయి. 327 విద్యుత్ పనులకు 215, 586 మరమ్మతు పనులకు 157 పూర్తయ్యాయి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాడు నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశాం.. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం.. అంటూ ముఖ్యమంత్రి జగన్ చెప్తోన్న గొప్పలు క్షేత్రస్థాయిలో ఎక్కడా కానరావడంలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే చెప్తున్నారు. చెప్పేది ఒకటి చేసేది ఒకటిగా జగన్‌మామ తీరుందని విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందే కాని అరకొరగా విడుదలతో సరిపెట్టింది. దీంతో పూర్తి చేసిన పనులకే బిల్లులు మంజూరు కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. రెండేళ్లుగా.. రెండు విడతల్లో చేపట్టిన పనులు మూడో ఏడు విద్యా సంవత్సరం ఆరంభం అవుతున్నా ఒక కొలిక్కిరాలేదు. అంటే రెండు వేసవి సెలవులు ముగిసినా పనులు పూర్తి చేయడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించారన్న విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన నాడు నేడు పథకం నిధుల లేమితో అబాసుపాలవుతున్నది. నాడు నేడులో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. నిధులు కొరతతో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు పాఠాలను ఆరు బయట చెట్ల కింద నిర్వహించాల్సిన దుస్థితిని ఎదుర్కొన్నారు. విద్యా సంవత్సరం ముగిసేవరకు పాఠశాలల్లో నాడు నేడు పనులు ఒక కొలిక్కి రాలేదు. మొత్తం మీద నాడు నేడు పనులపై పాలకుల చిత్తశుద్ధి లోపంతో పురోగతి అంతంతమాత్రంగానే ఉన్నా పాలకులు గొప్పగా ప్రకటించుకుంటున్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నాడు నేడు పథకం రెండో విడతలో చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి.

పనులకు నిధులు విడుదల కావడంలేదని పాఠశాలల పేరెంట్స్ కమిటీలు చెబుతున్నాయి. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండో విడతలో 3,138 పాఠశాలల్లో రూ.699.28 కోట్లతో పనులు చేపట్టారు. ఈ నిధులు మంజూరు చేసినట్లు ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించి విడుదలలో చతికిలపడింది. రూ.348.06 కోట్లు మాత్రమే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు పనులను నిలిపివేశాయి. స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించక పోవడంతో విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. నిధుల లేమితో పాఠశాలల్లో పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. నాడు నేడు పేరుతో పలు పాఠశాలల్లో ఉన్న తరగతి గదులను కూల్చివేశారు. నిధుల విడుదలలో జాప్యంతో నూతన గదులు నిర్మాణం అర్థాంతరంగా నిలిచిపోయింది. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు తరగతి గదుల సమస్య నెలకొంది. సొంత డబ్బుతో పనులు చేసేందుకు కమిటీలు ముందుకు రావడంలేదు. పనులు చేసి బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కమిటీ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

నాడు-నేడు-నిర్లక్ష్యం

నాడునేడులో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన మాటేమో కాని విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. నిధులు రాక కొన్ని.. నిర్లక్ష్యంతో కొన్ని దగ్గర్ల పనులు సక్రమంగా సాగడంలేదు. కొన్ని దగ్గర్ల తరగతి గదులు నిర్మాణ సామగ్రితో నిండిపోగా విద్యార్థులకు పాఠాలను రెండు విద్యా సంవత్సరాల్లో ఆరుబయట చెట్ల కింద నిర్వహించాల్సి వచ్చిం దని ఉపాధ్యాయులు వాపోయారు. రెండు విడతల్లో చేపట్టిన పనులు ముందుకు సాగలేదు. పనుల పూర్తిపై అధికారులు నిర్లక్ష్యం వహించారని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల విలీనంతో తరగతి గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా గదుల నిర్మాణ పనులను సాగదీస్తున్నారు. పనుల వేగవంతంగా అధికారులు సమీక్షలతో సరిపుచ్చారన్న విమర్శ లున్నాయి.


నరసరావుపేట : ములకలూరులో ఏడాదిగా పునాదులు దశ దాటని తరగతి గది నిర్మాణం

గుంటూరు జిల్లా..

గుంటూరు జిల్లాలో 919 పాఠశాలల్లో రూ.203.94 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇప్పటికి రూ.111.62 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. 6,523 పనులు చేపట్టగా 2,748 పనులు మాత్రం పురోగతిలో ఉన్నాయి. 2,379 పనులు ఇంకా ప్రారంభమే కాలేదు. 75 పాఠశాలల్లో 58 ప్యాకేజీల్లో 253 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టగా పది ప్యాకేజీల్లో మాత్రమే గదుల నిర్మాణం పూర్తి చేశారు. 394 పాఠశాలల్లో మరుగుదొడ్ల బ్లాక్ నిర్మాణం, ఉన్నవాటికి మరమ్మతులు చేపట్టాల్సి ఉండగా 237 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. 100 పాఠశాలలకు ప్రహరీ పనులకు 25 పాఠశాలల్లో మాత్రమే పూర్తి చేశారు. 397 విద్యుత్ పనులకు 264 పూర్తయ్యాయి. 745 మరమ్మతుల పనులకు 191 పూర్తి చేశారు.

ఆ నిర్మాణాలపై.. శీతకన్ను

- అసంపూర్తి నిర్మాణాలు.. అబద్దాల ప్రకటనలు..!
- టీడీపీ ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలకు నేటికీ కలగని మోక్షం
- ఐదేళ్లలో పైసా నిధులు విడుదల చేయని వైనం
- ప్రజాప్రయోజనాలు పట్టని వైసీపీ ప్రభుత్వం
- పిల్లర్ల దశలోనే నిలిచిపోయిన కాపు కల్యాణ మండపం
- ఐదేళ్లు దాటినా పూర్తికాని అద్దంకి వాటర్ ట్యాంక్
- రేపల్లెలోని మహిళల వసతి భవనానిది అదే దుర్గతి
- కొత్తవి లేకపోగా పలు నిర్మాణాలనూ ఆపేసిన వైసీపీ ప్రభుత్వం



నిర్మాణం నిలిచిపోయిన రేపల్లెలోని మహిళా విద్యార్థుల వసతి భవనం

అది కాపు కల్యాణ మండపం కావచ్చు, ప్రజల దాహార్తి తీర్చే వాటర్ ట్యాంక్ కావచ్చు, మహిళా వసతి భవనం కావచ్చు, విద్యార్థులకు ఉపయోగపడే క్రీడాప్రాంగణం కావచ్చు.. అన్నింటిదీ ఒక్కటే దారి ఆపేయడం, నిర్మాణాలను శిథిలావస్థకు చేర్చి వికృతానందం పొందడం తప్ప ప్రజాధనం దుర్వినియోగం అవుతుందనే బాధ వైసీపీ పాలకులలో లేదు. నాటి ప్రభుత్వం లో మొదలుపెట్టిన నిర్మాణాలను పట్టించుకోకపోవడం ఒక ఎత్తయితే, టీడీపీ సానుభూతిపరులనే నెపంతో వాటి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లను వేధించడం వైసీపీ అధికార దుర్వినియోగానికి పరాకాష్టగా నిలిచింది.

బాపట్ల, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా ప్రజాప్రయోజనాల విషయంలో పాలకులు పారదర్శకంగా ఉండాలి. కానీ వైసీపీ ఆ నైతిక సూత్రాలకు తిలోదకాలిచ్చింది. టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అనేక నిర్మాణాలను పట్టించుకోకపోవడమే కాకుండా అప్పటికే పూర్తయిన వాటి ఆలనాపాలనా కూడా నిర్లక్ష్యం చేసి ప్రజలకు తీరని నష్టం చేకూర్చింది. ఐదేళ్లలో ఒక్క రూపాయి అదనంగా టీడీపీ ప్రభుత్వంలో మొదలెట్టిన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయకపోగా వందల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఒక కొలిక్కి తెచ్చిన నిర్మాణాలపై కూడా శీతకన్ను వేసింది.

రేపల్లెలోని మహిళా విద్యార్థుల వసతి భవనం...

రేపల్లెలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా విద్యార్థుల వసతి కోసం 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భవనానికి శంకుస్థాపన చేసి శ్లాబ్ వరకు నిర్మాణం చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చిన ఐదేళ్లలో భవన నిర్మాణపనులు పూర్తి చేసిన దాఖలాలు లేవు. మహిళా వసతి భవనం కలగానే మిగిలిపోయింది. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని బల్లికురవ మండలం ముక్తేశ్వరం గ్రామంలో కాపు కల్యాణ మండపం నిర్మాణం కోసం 2018లో టీడీపీ ప్రభుత్వం రూ.15లక్షల నిధులు మంజూరు చేసింది. నిర్మాణం కూడా ప్రారంభించింది. ప్రభుత్వం మారగానే అది కూడా అటకెక్కింది. కాపు కార్పొరేషన్ ద్వారా కల్యాణ మండపానికి రావాల్సిన నిధులకు కూడా మోక్షం లభించలేదు. అద్దంకి ప్రజల దాహార్తి తీర్చడం కోసం టీడీపీ ప్రభుత్వంలో మొదలెట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని నేటికి పూర్తి చేయలేదు.

ప్రజా ప్రయోజనాలు గాలికి...

టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన అనేక భవనాల నిర్మాణాల అంచనా విలువ దాదాపు రూ.60 కోట్లకుపైనే ఉంటుంది. వీటిలో సుమారు రూ.40 కోట్ల మేర ఖర్చు చేసి ఒక కొలిక్కి తెచ్చారు. మరో రూ.20 కోట్లు వైసీపీ ప్రభుత్వంలో ఖర్చు చేసి ఉంటే అనేక ప్రయోజనాలు ప్రజలకు దక్కి ఉండేవి. కానీ టీడీపీ నిర్మాణం చేపట్టింది అనే ఒకే ఒక్క దుగ్ధతో వాటిని గాలికొదిలేసిన ఘనత వైసీపీది. మరో వైపు కనీస స్థాయిలో కూడా నిధులు విడుదల చేయలేని అసమర్థత కూడా తోడవడంతో నిర్మాణాలన్నీ అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి

తరగతి గదులూ అసంపూర్తిగానే..

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో టీడీపీ హయాంలో ప్రారంభించిన తరగతి గదుల భవన సముదాయాల నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులతో రెండతస్థుల వరకు భవన నిర్మాణం పూర్తయింది. దానికి హంగులద్ది అందుబాటులోకి తేవడంలో అడుగడుగునా వైసీపీ ప్రభు త్వం నిర్లక్ష్యం కనబడింది. బాపట్ల పట్టణంలోని ఉప్పరపాలెంలో టీడీపీ హయాంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రజలకు అందుబాటులోకి తేవడంలో ఈ ప్రభుత్వం ఎక్కడలేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శించడంతో బాపట్ల ప్రజలు తాగునీటి కటకటను ఎదుర్కొంటూనే ఉన్నారు.

క్రీడా ప్రాంగణానికి అదే దుర్గతి

కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి టీడీపీ ప్రభుత్వ హయాంలో పర్చూరులో క్రీడా వికాస కేంద్రాన్ని నిర్మించారు. ప్రభుత్వం మారాక దానిని ముళ్లపొదల నిలయంగా మార్చారు. కొద్దిపాటి పనులు పూర్తి చేసి ఉంటే సకల హంగులతో క్రీడా వికాస కేంద్రం విద్యార్థులకు అందుబాటులోకి వచ్చి ఉండేది. కానీ దానిపైనా కూడా వైసీపీ ప్రభుత్వం కక్ష గట్టినట్లు వ్యవహరించడంతో ఎవరికి పనికిరాకుండా ఆ ప్రాంగణం ఉండిపోయింది. తాజాగా ఎన్నికల ప్రక్రియ శరవేగంగా జరుగుతున్న దశలో ఆ ప్రాంగణం అక్క రకొచ్చింది. దానిని బాగు చేయించి ఎన్నికల సిబ్బంది తమ కార్య కలాపాల నిర్వ హణకు వాడు కోవడం గమనార్హం.


టీడీపీ ప్రభుత్వంలో పర్చూరులో నిర్మించిన క్రీడా వికాస కేంద్రం.. ప్రస్తుతం ఎన్నికల విధులకు వాడుతున్నారు...

ధ్యానబుద్ధ ప్రాజెక్టుపైనా అదే నిర్లక్ష్యం...

భట్టిప్రోలులో టీడీపీ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన ధ్యానబుద్ధ ప్రాజెక్టు పైనా వైసీపీ ప్రభుత్వం దుర్మార్గంగానే వ్యవ హరించింది. 2016లో దాదాపు రూ.60 లక్షల ను దాని నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం విడుదల చేసింది. ప్రాజెక్టు ఒక కొలిక్కి వస్తుం దనుకున్న దశలో పాలకులు మారడంతో దానికి గ్రహణం పట్టింది. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లవలసిన ప్రాజెక్టు కాస్తా నేడు మందు బాబులకు అడ్డాగా మారి చూపరులకు ఆవే దన కలిగిస్తోంది. కొల్లూరులో టీడీపీ ఏలు బడిలో ప్రారం భించిన అంగ న్వాడీ భవన నిర్మాణాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.


నిర్మాణం నిలిచిపోయిన ధ్యాన బుద్ధ ప్రాజెక్టు

Format C-1

(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases

(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of2011 (Public Interest Foundation & Ors Vs. Union of India &Anr.)

Name and address of candidate : **GOTTIPATI RAVI KUMAR, D.No :- 14-62-1, pothurajugandi, Addanki townm, Bapatla(Dt), AP-523201**

Name of political party : **TELUGU DESAM PARTY**

(Independent candidates should write "Independent " here)

Name of Election : **2014 - General Election.**

*Name of Constituency : **105 - Addanki Assembly Constituency.**

I GOTTIPATI RAVI KUMAR (name of candidate). a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents :

(A) Pending criminal cases:

Sl. No.	Name of Court	Case No. and Dated	Status of case(s)	Section(s) of Acts concerned and brief description of offence(s)
1.	**Adl Junior Civil Judge Court, Addanki**	Crime No: 279/2023 U/s. 188, 143, 341, 290 r/w 149 IPC Dated on 16-09-2023	Under investigation	U/s 188,143,341,290 r/w 149 IPC. This is a case of unlawful assembly obstructing the public place and commits a public nuisance that was occurred on 16-09-2023 at 18.45 hrs at RTC bus stand Addanki town and Mandal and it is reported in the police station on the same day at 19.30 hrs by the complainant K.Vivek Kumar HC 10. 73 of Addanki PS and reported that in view of TDP party sympathizers give slogans gainst the government and conducting rally about the TDP party state president Sri. Nara Chandra Babu Naidu arrested at Nadhyala in skill development case and sent him to Judicial remand in Rajahmundry central jail on 16-09-2023. Due to that TDP party sympathizers were gathering came across that place. They have obstructed the road and disruption of public transport at that place Gottipati Ravi Kumar, MLA, Addanki (A 1) and 24 others were gathering across the place. Without any permission they are trying to conduct a rally then the complainant lodged a report for taking necessary action.
2.	**III[rd] ADDL Junior Civil Judge Court, Ongole**	Cr.No: 651/2023 Ongole Taluka, PS dated : 12-09-2023	Under Investigation	u/s 341 ,353 r/w 149 IPC occurred on 12-09-2023 at20.00 hrs at Brindavan Function Hall, Ongole and reported in the PS on 12-09-2023 at 23.30 hrs by complainant K. Ankamma SI of Ongole Taluka PS and his staff doing duty at that time Gottipati Ravi Kumar, MLA, Addanki (A 1)and 44 others belongs to TDP organized a meeting of activists and held an unauthorized rally, obstructing the traffic and use criminal force to the complainant from discharge of his duty with common object.
3.	**Adl junior Civil Judge Court, Addanki**	Cr.No : 274/2023, CC.no: 814/2003 28-12-2023	Summons stage	U/s 341 ,143, 290, r/W 149 IPC. Occurred on 11-09-2023 at 10.00 hrs at bungalow road, Addanki town. The TDP leader Ex-CM Sri Nara Chandrababu Naidu garu arrested by CID Police in Skill Development Case. The TDP announced state wide Dharna program. The accused (A1) Gottipati Ravi kum.ar and eight other members to prevent and toward incidents while they were conducting dharna at bungalow road. The Addanki police registered a case in crime no: 27 4/2023 dated: 11-09- 2023.
4.	**Addl Junior Civil Judge Gannavaram**	Crime No : 469/2023 dated: 09-09-2023	Under Investigation Ion Pending	u/s 151 cr.P.C occurred on 09.09.2023 at 16.00 hrs at Savarigudem Junction Kesarapalli Village Gannavaram Mandal and reported on 09.09.2023 at 16.30 hrs by the Complainant Sri E. Sathyanarayana SI of Police Gannavaram PS he was conducted patrolling along with his staff at Savarigudem Junction as per the instructions of the superior officers in view to prevent the commission to Cognizable offences the MLAs of TDP followed by the arrest of their leader and former chief Minister of AP Sri. N. Chandra Babu Naidu at Nadhyala District. There is a possibility of blocking the roads and create any cognizable offence while they agitate against the arrest of their leaders Gottipati Ravi Kumar, MLA, Addanki shown as A3 and others who were the MLAs of TDP Party who were paling to protest the arrest of their leader. Then as preventive measure he has taken them in to custody and arrested them u/s 151 CR.P.C and the Case is under investigation.
5.	**III[rd] Adl Junior Civil Court, Ongole**	Crime No : 863/2021 dated : 11-11-2021	Under Investigation	u/s 143,341,269,270,188 r/w 149 IPC section 3 of APEDCRA 2020, sectionion 32of AP Police Act. Occurred on 11.11 .2021 at 20.15 hrs at Maddiralapadu village NG Padu Mandal and reported in the PS on 11 .11 .2021 at 21.00 hrs by the complainants Sri. S V Ravindra Reddy SI of police Ongole Taluka PS wherein he attending bundobust on the event of Nyayastanam to Devastanam Mahapadayatra, Amaravathi JAC and noted the accused Gottipati Ravi Kumar, MLA, Addanki shown as A6 and others violated the conditions imposed by the Hon'ble High Court of AP, DGP of AP and organized rally and gathered around two thousand people as against permeation strength of 157 members caused abstraction to public and vehicular traffic and also participated in rally without wearing mask and caused spread of COVID - 19 disease and further violated AP Police act rules and on that the complainant drafted police proceedings to the occurrence. Case is under investigation.
6.	**III[rd] Addl Junior Civil Judge Court, Ongole**	Crime No: 864/2021 Talika PS, Ongole Dated :11-11-2021	Under investigation	U/S 143,341 ,269,270,188 r/w 149 IPC section 3 of APEDCRA 2020, section 32of AP Police Act occurred on 11 .11 .2021 at 21.15 hrs at NTR Statue Center, Throvagunta Village, Ongole Mandal and reported in the PS on 11 .11.2021 at 22.00 hrs by the complainant Sri S V Ravindra Reddy SI of Police Ongole Ta luka PS wherein he attending bundobust on the event of Nyayastanam to Devastanam Maha Padayatra Amaravathi JAC and noted the accused Gottipati Ravi Kumar, MLA, Addanki shown as accused (A6) and others violated the conditions imposed by the Hon'ble High Court of AP, DGP of AP and organized rally and gathered around two thousand people as against permeation strength of 157 members caused abstraction to public and vehicular traffic and also participated in rally without wearing mask and caused spread of COVID - 19 disease and further violated AP Police act rules and on that the complainant drafted police proceedings to the occurrence. Case is under Investigation.
7.	**Spl Excaise magistrat Court, Ongole**	224/2021 NG Padu PS Dated 10-11-2021	This case was Charged on 13-01-2024 and awaited CC no.	u/s 341,269,270,290 R/W149 IPC 32 PA-1861 This is a case of violation of model code of conduct MPTC local body elections that occurred on 10-11-2021 2021 at 15.30 hrs near Ommevaram cross road and reported on the same cross road and reported on the same day at 23.30 hrs by the complainant M.Anajali, retuming officer, MPDO of NG Padu Mandal. Gottipati Ravi Kumar, MLA, Addanki shown as accused A 1 and 5 others who are participating in Padayatra Nyayasthanam to Devastanam and wrongfully restrained, model code of conduct area in Ommevaram cross road, whoever negligently to spread infection of disease dangerous to human life and stopped the traffic and create public nuisance with an unlawful assembly and conducting a meeting along with their party flags and slogans, did not take any COVID precautions at Rani Gangaiah cold storage and disobeying orders and violating the conditions of any license granted by the concerned authorities. Later the complainant came to PS and gave report necessary action. After proper investigation on 21-12- 2023, 41 (A), CRPC notice served to the accused and case was charged on 13-01-2024 and awaited CC no.
8.	**Addl Junior Civil Judge Court Mangalagiri**	Crime No. 924/2021 dated. 17-09-2021	Under Investigation	U/s 143,341,188,269,270 r/w 149 IPC of Tadepalli PS. occurred on 17.09.2021 at 18.00 hrs at DGPOffice Tadepalli and reported on the same day at 19.30 hrs by the complainant Sri. Bussa Madhusudhana Rao ASI Tadepalli in which he is working in Police head quarters, when he is on duty TDPparty people Devineni Uma and others Gottipati Ravi Kumar shown as accused A8 and others came to the main gate and tried to enter in to DGP Office without any permission sat in front of the gate and givenslogans against DGP sir and against government and violated the promulgated orders of government and violated COVID rules.
9.	**Special Court Judge Per Trail Of Cases relating to MPs and MLAs at Vijayawada**	Cr.No: 88/2015 CC No.8/2016 AMM Court Addanki Dated 02-01-2016 same was later transferred Special Court Judge Per Trail Of Cases relating to MPs and MLAs at Vijayawada and renumbered as CC no: 69/2018	The CC is Posted Arguments call on 28-03-2024	U/s 143,341, 188 r/w 149 IPC, Dated: 12-10-2015 at 11:30 am hrs YSRCP, Addanki MLA Gottipati Ravi kumar MLA, Kakani Govardhan and MLA P.Anil Kumar Yadav were done rasta Rocco at NH16 at Tammavaram Junction and caused inconvenience to public and public transport vehicles.

(B) Details about cases of conviction for criminal offences

Sl.No	Name of court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	Maximum Punishment Imposed
1	NOT APPLICABLE	NOT APPLICABLE	NOT APPLICABLE
2	NOT APPLICABLE	NOT APPLICABLE	NOT APPLICABLE
3	NOT APPLICABLE	NOT APPLICABLE	NOT APPLICABLE

*In the case of election of Council of States or election to Legislative Council by MLAS, mention the election concerned in place of name of constituency

Sd/- **GOTTIPATI RAVI KUMAR,**

MLA Contesting candidate, 105- Addanki Assembly Constituency (AP)

ముమ్మరంగా కూటమి శ్రేణుల ప్రచారం

కొండయ్య ఇంటింటి ప్రచారం



ప్రచారంలో చంటి బిడ్డతో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొండయ్య

చీరాల, మే 2 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం కొండయ్య ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. గురువారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలసి పర్యటించారు. వేటపాలెం, దేశాయిపేట, ఐటీఐ కాలనీ, రామానగర్, చల్లారెడ్డిపాలెం కొత్తపాలెం, హరిప్రసాద్ నగర్ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఒక వైపు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తూ మరో వైపు ఆయా ప్రాంతాల్లోని ముఖ్యులతో అంతరింగిక సమావేశాలు నిర్వహించారు. ఆయా సందర్భాల్లో ఎంపీ అభ్యర్థిగా తెన్నేటి కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కొం డయ్య కోరారు. అనంతరం చీరాల మండలం జాండ్రపేటలో పలువురు ప్రముఖులను కలిశారు. అనంతరం పట్టణంలో 23, 25, 26 వార్డులలో ఇంటింటి ప్రాచరం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్‌తో సువర్ణాధ్యాయం



నేతను పరిశీలిస్తున్న నిఖిల్

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో సువర్ణాధ్యాయానికి శ్రీకారం పలికారని టీడీపీ కూటమి అభ్యర్థి కొండయ్య కుమార్తె గోరిపర్తి శివనారాయణదేవి అన్నారు. తన తండ్రి కొండయ్యకు మద్దతుగా బుధవారం వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ నీలకంఠాపురంలో నాయకులు, కార్యకర్తలతో క లసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రధానంగా బీసీ డిక్లరేషన్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు. కూటమి ఉమ్మ డి మేనిఫెస్టోలో ఇచ్చి న హామీలతో ప్రతి ఒ క్కరూ ఆర్థికంగా, సా మాజికంగా బలోపేతం అవుతారన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రచార కరపత్రాలను పంపిణీ చేశారు. ఎంపీ అభ్యర్థిగా కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్య ను సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కారకర్తలు పా ల్గొన్నారు.

మామయ్యను గెలిపించండి

హీరో నిఖిల్

మా మామయ్య, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్యను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రముఖ సినీహీరో నిఖిల్ సిద్ధార్థ పిలుపునిచ్చారు. కొండయ్యకు మద్దతుగా గురువారం నిఖిల్ కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీగా కృష్ణప్రసాద్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థిగా కొండయ్యను సైకిల్ గుర్తులపై ఓట్లువేసి గెలిపించాలని కోరారు. నిఖిల్‌తో సెల్ఫీలు దిగేందుకు పలు వురు పోటీపడ్డారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : కొండయ్యను గెలిపించాలని సినీహీరో నిఖిల్ పట్టణంలో ప్రచారం చేశారు. పొలిమేర రోడ్డులోని జానకి హోటల్‌లో సాధారణ వ్యక్తిలా టిఫిన్ చేస్తూ ప్రచారం నిర్వహించారు. కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపిస్తే చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయి అభివృద్ధిని పరుగు పెట్టిస్తారని హీరో నిఖిల్ తెలిపారు.

మాట తప్పిన జగన్‌కు ఓట్లడిగే హక్కు లేదు

- సీపీఎస్ రద్దు.. మద్య నిషేధంపై మడమతిప్పారు
- కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి



ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, మే 2 : పాదయాత్రలో హామీలిచ్చి, గద్దెనెక్కాక వాటిని అమలు చేయని జగన్‌రెడ్డి ఇప్పుడు ఓట్ల కోసం పాకులాడుతున్నారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు అన్నారు. జగన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సీపీఎస్ రద్దు, మద్య నిషేధం అమలు చేసి ఓట్లు అడగాలని ఏలూరి డిమాండ్ చేశారు. గురువారం చిన్నగంజాం మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఏలూరి పాల్గొన్నారు. ఏలూరికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. జగన్ ఉగ్యోగులను నమ్మించి నిలువునా మోసం చేశారని, అధికారంలోకి వచ్చిన వారంలోనే సీపీఎస్ రద్దు చేస్తామని మాటిచ్చి మడమ తిప్పారన్నారు. ఖజానాను ఖాళీ చేసిన చేతగాని జగన్ 1వ తేదీన పింఛన్ కూడా ఇవ్వలేక చంద్రబాబుపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు తాగు సాగు నీరు అందించేందుకు దోహద పడే గుంటూరు చానల్ పనులను సైతం నిలిపేశారన్నారు. మాట తప్పే జగన్‌ను గద్దె దించి.. పాలనాదక్షుడు చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. అనంతరం చింతగుంపల, కడవకుదురు, చిన్నగంజాం, కొత్తపాలెం, మూలగాని వారిపాలెంలో ప్రచారం నిర్వహించారు.

కూటమి శ్రేణుల విస్తృత ప్రచారం

పర్చూరు : పర్చూరులో తెలుగుదేశం ప్రజా కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే ఏలూరి గెలుపు కోసం చేస్తున్న ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభిస్తుంది. పార్టీలకు అతీతంగా ఏలూరి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పలుకుతున్నారు. కార్యక్రమంలో భాగంగా గురువారం పర్చూరులో ఒకటో వార్డులో చేపట్టిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. పెద్దఎత్తున మహిళలు, వృద్ధులు, యువకులు తరలివచ్చి ఏలూరికి మద్దతుగా నిలిచి ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు ప్రజా కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌కు ప్రస్తుత ఎన్నికలే కీలకం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లా శివరాంప్రసాద్, కోటగిరి ప్రసాద్, కొల్లా చౌదరి, కృష్ణంశెట్టి జగదీష్, కూరపాటి జగన్, ఊటుకూరి నిర్మల, కొల్లా సుబ్బాయమ్మ, శివాలశెట్టి రమ, నార్ని బ్రదర్స్, బేత భూపతి, జనసైనికులు అచ్చికోలు సతీష్, కొసనా యశ్వంత్ పాల్గొన్నారు.

కారంచేడు : అభివృద్ధి ప్రదాత, టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్ గెలుపుకోసం కారంచేడులో టీడీపీ నాయకులు రామయ్య, ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డిని గద్దెదింపి, కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరా రు. అనంతరం సూపర్‌సిక్స్ పథకాలపై నాయకులు అవగాహన కల్పించారు.

మక్కెనవారిపాలెంలో ఇంటింటి ప్రచారం

సంతమాగులూరు : మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సతీమణి గొట్టిపాటి ఝాన్సీ విజ్ఞప్తి చేశారు, మక్కెనవారిపాలెం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలను పంచిపెడుతూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడ్డారని తెలిపారు. నిత్యావసరాల ధరల పెరుగుదలతో కుటుంబ పోషణ మహిళలకు కష్టమైందన్నారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. జాబ్ క్యాలెండర్ అంటూ జగన్ రెడ్డి మోసం చేశారని విమర్శించారు. పన్నులు పెంచి నిరు పేదల నుంచి ధనవంతుల వరకు అందరినీ ఇబ్బందులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలు తీరాలంటే.. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను ఆమె విజ్ఞప్తి చేశారు.

రేణుకమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు



యద్దనపూడి, (మార్టూరు) మే 2 : యద్దనపూడి మండలంలోని చింత పల్లిపాడు గ్రామంలోని శ్రీ చింతామణి రేణుకమ్మ తల్లి దేవస్థానంలో ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో నారాయణ వెంకట సందీప్ దీక్షిత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్లపూడి వంశస్తుల కులదైవం కావడంతో ఈ ప్రాంతంలోని కర్లపూడి వంశస్తులు ముఖ్యంగా మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ గా జులు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలును స్వీకరించారు. చివరగా భక్తులకు భారీగా అన్నదానం నిర్వహించారు.

పోస్టల్ ఓటు వినియోగంపై అవగాహన



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్

అద్దంకి, మే 2 : పోస్టల్ ఓటు వేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని నోడల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు అన్నారు. పోస్టల్ ఓటు వినియోగించుకునే ఆర్టీసీ ఉద్యోగులకు గురువారం ఆర్టీసీ గ్యారేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ముందస్తుగానే పూర్తి అవగాహన చేసుకొని పోస్టల్ ఓటు వినియోగించుకోవాలన్నారు. డీఎం రామ్మోహనరావు, అసిస్టెంట్ డీఎం మహబూబీ పాల్గొన్నారు.

యద్దనపూడిలో పోలీస్ కవాతు

యద్దనపూడి, (మార్టూరు) మే 2 : యద్దనపూడి మండలంలోని వింజనం పాడు, చిలుకూరి వారిపాలెం, యనమదల, చింతపల్లిపాడు గ్రామాలలో గురువారం పోలీసులు కవాతు నిర్వహించారు. దాదాపుగా 25 మంది బీఎస్ఎఫ్ దళాలతో స్థానిక పోలీసులతో కలిసి ఎస్ఐ జీవీఎస్ చౌదరి గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడవద్దని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేవిధంగా ప్రజలు సహకరించాలని ఎస్ఐ ఆయా గ్రామస్థులను కోరారు. ఎన్నికల సమయంలో నమోదయ్యే కేసులు భవిష్యత్‌లో ఇబ్బందులకు గురి చేస్తాయని గొడవలకు కక్షలకు గ్రూపు తగాదాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు.

నేడు విద్యుత్‌కు తాత్కాలిక అంతరాయం

చీరాలటౌన్, మే 2 : విద్యుత్ వార్షిక మరమ్మతులలో భాగంగా నేడు విద్యుత్‌కు తాత్కాలిక అంతరాయం కలుగుతుందని అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. జాండ్రపేట, గంజిపాలెం, కొత్తపేట ప్రాంతాలలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని మరమ్మతుల అనంతరం యథావిధిగా సేవలు ప్రారంభమౌతాయని చెప్పారు. ప్రజలు అంతరాయంకు సహకరించాలని కోరారు.

Format C-1

(for candidate to publish in Newspapers, TV)

Declaration about criminal cases:

Name and address of Candidate : **ATLA CHINA VENKATA REDDY S/o. ATLA RAMI REDDY, R/o. Door No. 3-32-715, Flat No.203, Lakshmi Abode, Mahalakshmi Nagar, 13th lane, Pedda Cheruvu, Narasaraopet, Palnadu (Dt), 522601, Andhra Pradesh State**

Name of political party : **INDEPENDENT**

(Independent candidates should write "Independent " here)

Name of Election : **2024 GENERAL ELECTION TO ANDHRA PRADESH LEGESLATIVE ASSEMBLY**

Name of Constituency : **105 - ADDANKI ASSEMBLY CONSTITUENCY**

I, ALLA CHINA VENKATA REDDY (name of candidate), a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedens:

Sl. No.	Pending Criminal Cases			Details about cases on convicting for criminal offences	
	Name of Court	**Case No. and Status of case**	**Section(s) of Acts concerned and brief description of offence(s)**	**Name of Court & Date(s) of order(S)**	**Description of offence(s) & punishment imposed**
1.	VII ADDL. District & Sessions Judge Ongole.	SC No. 379/2016 on the file of VII ADDL. Judge District & Sessions Judge Ongole and for Arguments	U/S 147, 148, 448, 302, r/w 149 of IPC The allegations as per the charged sheet on 10-04-2015 about 19:30 hrs. when the deceased sat infront of his house on cot the candidate along with other accused armed with deadly weapons formed into a unlawful assembly with a common intention to kill the deceased entered into his house and hacked the deceased and in that incident he died	Not Applicable	Not Applicable

(B) Details about cases of conviction for criminal offences

Sl.No	Name of court & date(s) of order(s)	Description of offence(s) & punishment imposed	Maximum Punishment Imposed
1	NOT APPLICABLE	NOT APPLICABLE	NOT APPLICABLE
2	NOT APPLICABLE	NOT APPLICABLE	NOT APPLICABLE
3	NOT APPLICABLE	NOT APPLICABLE	NOT APPLICABLE

*In the case of election of Council of States or election to Legislative Council by MLAS, mention the election concerned in place of name of constituency

Sd/- **ATLA CHINA VENKATAREDDY**

MLA Contesting candidate, 105- Addanki Assembly Constituency (AP)

మహిళలకు రక్షణ, సంక్షేమం

● ఉపాధి కూలీలతో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి

మార్టూరు, మే 2 : మహిళలంటే గౌరవం, వారి సంక్షేమం రక్షణ తెలుగుదేశం పార్టీలోనే ఉంటుందని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబ శివ రావు అన్నారు. ఆయన గురువారం మార్టూరులో ఎన్నికల ప్రచారంలో భాగంగా మార్టూరులో గన్నవరం రోడ్‌లో కుప్పాయికుంట వద్ద పని చేస్తున్న ఉపాధి కూలీలతో కొంచెం సేపు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా మహిళలు పుంజుకోవాలనే డ్వాక్రా గ్రూపులను చంద్రబాబు బలోపేతం చేశారన్నారు. పావలా వడ్డీతో మహిళా గ్రూపులకు కోట్లాది రూపాయలను రుణంగా మంజూరు చేయించాడన్నారు. ప్రతి ఇంట డ్వాక్రా మహిళ ఉన్నారంటే అందుకు కారణం చంద్రబాబు కారణమని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి స్త్రీకి నెలకు రూ.1500, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేసేందుకు చంద్రబాబు మేనిఫెస్టో తయారు చేశారన్నారు. మహిళలు అందరూ ఆలోచించాలన్నారు. రాబోయే తరాలవారిని దృష్టిలో పెట్టుకొని అందరూ సైకిలు గుర్తుకు ఓటేయాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి మహిళలు చరిత్ర సృష్టించాలన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

కూటమిని గెలిపిస్తేనే రాష్ట్ర అభివృద్ధి

» ఎన్నికల ప్రచారంలో ఏలూరి

యద్దనపూడి, (మార్టూరు) : ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి పోయిందని, రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎంగా రావాలని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం యద్దనపూడిలో ఏలూరి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావల్సిన అవసరాన్ని వివరించారు. రాజకీయ



జనార్దన్‌కాలనీవాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చరిత్రలోనే ప్రజలను ఏ విధంగా దోచుకోవాలో అనేదానిపై కొత్త కొత్త పథకాలను పెట్టిన జగన్ పాలనను అంతం చేయడానికి ఓటర్లంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఆస్తులను కొనుగోలు చేస్తే వాటి ఒరిజనల్ డాక్యుమెంట్లు ప్రభుత్వం చేతిలో.. జిరాక్స్ కాగితాలు యజమాని దగ్గర ఉండాలన్న కుట్ర పథకాన్ని చూసి మేధావులు సైతం దిగ్భ్రాంతికి గురవుతున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెట్టిన విదేశీ విద్య, అన్న క్యాంటీన్లు, రంజాన్ తోఫా, సంక్రాంతి కానుకలు, ఎస్సీ కార్పొరేషన్ కింద నిరుద్యోగులకు రుణాల వంటి పథకాలన్నీ జగన్ రద్దుచేసి పేదల కడుపుకొట్టారన్నారు. అదిచాలదన్నట్లు మద్యం మాఫీ అంటూనే జే బ్రేండ్ నకిలీ మందును విక్రయిస్తూ పేదల ప్రాణాలతో చెలగాట మాడారన్నారు. ఒక్కచాన్స్‌తో గుల్ల చేసిన జగన్‌రెడ్డిని 13వ తేదీన జరిగే పోలింగ్ రోజు ఓటుతో గద్దె దింపాలని ఏలూరి విజ్ఞప్తి చేశారు. వైసీపీ నాయకుల రౌడీయిజం, పెత్తందారీతనం, దోపిడీ, దౌర్జన్యాలు, అవినీతి అక్రమాలకు చెక్ పెట్టే ఆయుధం మీ చేతుల్లో ఓటు రూపంలో ఉందని, దానిని అస్త్రంగా వాడే రోజు వచ్చిందన్నారు. అందరం ఆనందంగా జీవించడం కోసం కూటమికి పట్టంగట్టాలని కోరారు.

ఏలూరికి ఘన స్వాగతం

యద్దనపూడి గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఏలూరికి స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు దిష్టితీసి హారతులిచ్చి ఆశీర్వదించారు. తొలుత ఆయన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వేణుగోపాలస్వామి, సాయిబాబా మందిరాల్లో పూజలు చేశారు. ప్రధాన సెంటర్ నుంచి జడ్పీ హైస్కూల్ వరకు ర్యాలీగా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ బాబాయి గొట్టిపాటి రాంబాబు పూలమాల వేసి ఏలూరిని స్వాగతించారు. కార్యక్రమంలో కనపర్తి నాగేశ్వరరావు, సూరిశెట్టి సతీష్, వాసు, జంపని వీరయ్య, కొండలరాయుడు, గొట్టిపాటి వెంకట్రావు, పెంట్యాల శ్రీరామమూర్తి, సుబ్బారావు పాల్గొన్నారు.

బాబు చిత్రపటానికి పాలభిషేకం

చంద్రబాబు మేనిఫెస్టో ప్రజాదరణ పొందడంతో టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు చిత్రపటానికి నాయకులు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో నల్లపనేని రంగయ్య చౌదరి, గుదే తారక రామారావు బోయపాటి సాంబయ్య, రావిపాటి సీతయ్య పాల్గొన్నారు.

వైసీపీ వీడిన 100 కుటుంబాలు

ఏలూరి సమక్షంలో, గొట్టిపాటి రాంబాబు ఆధ్వర్యంలో యద్దనపూడి సర్పంచ్ వలేరు రేణుక, భర్త వలేరు బాల కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ రాయిపాటి శ్రీరామమూర్తి, వార్డు మెంబర్లు జాగర్ల మూడి నాగేశ్వరరావు, నల్లమద్ది వెంకట్రావుతో పాటు 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

కొనసాగుతున్న చేరికల పర్వం

ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సాంబశివరావు సమక్షంలో మార్టూరు జనార్దన్ కాలనీకి చెందిన వైసీపీ శ్రేణులు ఏలూరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఏలూరి కండువాలు వేసి ఆహ్వానించారు. చేరిన వారిలో బొజ్జ హనుమంతురావు, ఉమ్మడిసింగి ఆనందరావు, చదువుల నగరాజు, కత్తుల రబ్బ, ఉమ్మడిసింగి మహంకాళి, బొజ్జ రామచంద్ర, చప్పర్ల గోవిందం, చప్పర్ల వెంకటేశ్వర్లు, బొజ్జ బ్రహ్మయ్య, పొగర్త తిరుపతి చదువుల వెంకటేష్, అంగులూరి శ్రీను, పొగర్త వెంకటేశ్వరావు, బొజ్జ దుర్గాప్రసాద్, బొజ్జ వెంకయ్య నాయుడు, శెట్టి రాము, ప్రసన్న, చేపల వెంకటేష్, నాగులలక్ష్మి, రమణ, చదువుల రాజేష్, చిన్న బ్రహ్మయ్య, మల్లేశ్వరి, శక్తి వెంకటేశ్వర్లు, ఐశ్వర్య ఉన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో దివాలా తీసిన రైతులు

» కూటమి మేనిఫెస్టోలో వ్యవసాయానికి పెద్దపీట
» ఓటుతో వైసీపీని సాగనంపండి
» టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 2: జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో రైతులు దివాలా తీశారని టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని శంకవరప్పాడు (రెడ్డిపాలెం)లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకే కూటమి మేనిఫెస్టోలో వ్యవసాయానికి పెద్దపీట వేశామన్నారు. ఎన్నడూ లేనివిధంగా పెట్టుబడి సాయాన్ని రూ.20వేలు అందజేస్తామన్నారు. జగన్ అవగాహన లోపం, బాధ్యతారాహిత్యంతో వ్యవసాయరంగం కుదేలైందన్నారు. పాడి రంగానికి ప్రాధాన్యతను ఇచ్చి గ్రామ సీమలలో వెలుగులు నింపాలన్నదే చంద్రబాబు ధ్యేయమన్నారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి వారిపై దమనకాండ సాగించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక దళితుల సంక్షేమం కోసం అమలవుతున్న అనేక పథకాలను వైసీపీ రద్దు చేసిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు దళితుల సంక్షేమం కోసం అమలు చేసిన 27 పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్య ద్వారా ఎందరో ఎస్సీ విద్యార్థులు ఉన్నత చదువులు చదుకోగలిగారన్నారు. అంబేడ్కర్ పదాన్ని తొలగించి జగన్ పేరుగా మార్చి అంబేడ్కర్‌ని అవమానపరిచారన్నారు. ఇప్పటికైనా నష్టపోయిన విషయాన్ని గమనించి అందరూ ఒకేమాటగా కూటమి ప్రభుత్వానికి పట్టంగట్టాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. అంతకముందు ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి గొట్టిపాటి పూలమాలవేసి నివాళుల ర్పించారు. టీడీపీ నాయకులు పోలిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కఠారి నాగేశ్వరరావు, అంజయ్య, కోంద్రు వీరాంజనేయులు, మానం మురళీమోహన్‌దాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు

● కొండమంజులూరు, ముప్పవరం మాజీ సర్పంచ్‌లు, ఇతర నేతలను పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే గొట్టిపాటి

పంగులూరు, మే 2 : పంగులూరు మండలంలో టీడీపీలో చేరికల పర్వం కొనసాగుతోంది. మండలంలోని కొండమంజులూరు, ముప్పవరం గ్రామ మాజీ సర్పంచ్‌లు, ఇతర ప్రధాన నేతలు, కార్యకర్తలు గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కొండమంజులూరు గ్రామ మాజీ సర్పంచ్ సందిపాగు సత్యవర్ధనరావుతో పాటు అదే గ్రామానికి చెందిన సందిపోగు జాన్, సందిపోగు పెద యాకోబు, కమలాకర్, పవన్, ఇర్మియా, కొమ్మూరి జాన్ టీడీపీలో చేరారు. మండలంలోని ముప్పవరంలోగల టీడీపీ ప్రధాన కార్యాలయంలో గొట్టిపాటి రవికుమార్ వీరందరికీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతల సహదేవుడు, బొప్పూడి నాగేశ్వరరావు, బత్తుల వెంకటరావు, వెంకన్న పాల్గొన్నారు.



గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన కొండమంజులూరు ఎస్సీ కాలనీవాసులు

సైకిలెక్కిన ముప్పవరం గ్రామ నేతలు

మండలంలోని ముప్పవరం గ్రామ మాజీ సర్పంచ్ రావిపూడి వాసులు, గ్రామానికి చెందిన కామేపల్లి వీరరాఘవయ్య, స్వామి, సుమన్, రావిపూడి స్వామితో పాటు మరో 20 కుటుంబాల వారు గురువారం టీడీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. గొట్టిపాటి గెలుపునకు కృషి చేస్తామని కొత్తగా చేరినవారు ప్రకటించారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

బల్లికురవ. మే 2 : రానున్న ఎన్నికలలో టీడీపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) కోరారు. గురువారం రాత్రి మండలంలోని వైదన గ్రామంలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటికి మద్దతుగా కమల్‌కిషోర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా యన ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరాలంటే చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసు కునేలా అందరు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నేతలు పోగుల చంద్రశేఖర్, మేదా ప్రసాద్, మూరగొండి కోటేశ్వరరావు, గాలం నిమ్మయ్య, షేక్ గోపి, పావులూరి రామాంజి, ముత్యాల వీరాంజి, బొమ్మిశెట్టి వెంకయ్య, ఏలూరి శ్రీనివాసరావు, ఆలకుంట శేషారావు పాల్గొన్నారు.



సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి గడ్డ... గొట్టిపాటి అడ్డా..

● సీడీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, మే 2 : అద్దంకి గడ్డ... గొట్టిపాటి అడ్డా ఏవీ వీడియో సీడీని ఎమ్మెల్యే, టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ గురువారం ముప్పవరంలోని క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అద్దంకి పట్టణానికి చెందిన ఆర్‌కే ట్రావెల్స్ నిర్వాహకుడు ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో సీడీ రూపొందించగా ఎమ్మెల్యే రవికుమార్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షుడు గోవాడ శ్రీకాంత్, అధికార ప్రతినిధి చేబ్రోలు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



నడిరోడ్డులో బోల్తా పడిన ఆటో

ఆటో బోల్తా.. వ్యక్తికి గాయాలు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మే 2 : ఆటో బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన గురువారం మండల పరిధిలోని ఈపూరుపాలెం వద్ద జాతీయ రహదారిలో జరిగింది. వివరాల్లోకి వెళితే పొన్నూరుకు చెందిన బాబు ఆటోలో వివిధ ఇంటి సామగ్రి విక్రయిస్తూ జీవిస్తుంటారు. ఈక్రమంలోనే చీరాలలో అన్ని రకాల వస్తువులు కొనుగోలు చేసుకుని పొన్నూరుకు వెళుతున్నారు. ఈక్రమంలో ఈపూరుపాలెం ఆటోనగర్ వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని కారు రాంగ్ సిగ్నల్స్‌తో బాబును కన్ఫ్యూజ్ చేసింది. దీంతో ఆటో అదుపుతప్పి హైవేలో ఘోరంగా బోల్తా పడింది. దీంతో అందులో ఉన్న వస్తువులు హైవేలో చెల్లాచెదురుగా పడగా బాబు గాయపడ్డారు. ఈపూరుపాలెం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని 108లో ఏరియా వైద్యశాలకు తరలించారు.

చిట్టీల వ్యాపారి పరారీ

● రూ.3.5 కోట్లతో ఉడాయింపు
● పోలీసులకు బాధితుల ఫిర్యాదు

మేదరమెట్ల , మే 2 : మేదరమెట్లలో చిట్టీల వ్యాపారం నిర్వహించే వ్యక్తి 3.5 కోట్ల రూపాయలు చెల్లించకుండా కుటుంబంతో సహా పరారయ్యారని బాధితులు మేదరమెట్ల పోలీసులను ఆశ్రయించారు. గత కొన్ని సంవత్సరాలుగా మేదరమెట్లలో అడుసుమల్లి వెంకట నరసయ్య చిట్టీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో చీటీ పాటదారులకు చీటీ పూర్తన డబ్బులు ఇవ్వకపోవడం, అందరకి చివరి పాట ఇస్తాను అని చెప్పి మభ్యపెట్టినట్లు వాపోతున్నారు. దీనికి తోడు చాలా మంది వద్ద వడ్డీకి డబ్బులు తీసుకున్నాడు. తన చిన్న కుమారుడుని అ మెరికాలో ఉన్నత విద్యకు పంపించే టప్పుడు, నూతన గృహ నిర్మాణం సమయంలో ఒ కరుకు తెలియకుండా ఒ కరి వద్ద పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నాడు అని బాధితులు ఆ వేదన చెందుతున్నారు. నెల రోజుల క్రితం షుగర్ బిళ్లలు ఎ క్కువగా మింగి ఆత్మహత్య యత్నం చేసినట్లు తెలిసింది. గత నాలుగు నెలలుగా అతను డబ్బులు ఎ గ్గొట్టి వెళ్ళిపోవాలనే అ లోచనతోనే ఆ కరిపాట తీసుకొండి అంటూ ఎ వ్వరికి డబ్బులు ఇ వ్వలేదన్నారు. తిమ్మనపాలెంలో ఉన్న కేబుల్ నెట్ వర్క్‌ను, మేదరమెట్లలో ఉన్న కొద్దిపాటి స్థలాన్ని సమీప బంధువులకే ఇచ్చి తమను మోసం చేశాడని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 80 మందికి పైగా అప్పులు ఇచ్చిన వారు, చీటి పాట దారులు ఉన్నట్లు బాధితులు తెలిపారు. గురువారం సాయంత్రం వీరంతా మేదరమెట్ల పోలీసులను ఆశ్రయించారు. వెళ్ళిపోవడానికి ముందు బ్యాంకులలో తన పేరుతో వివిధ బ్యాంకులలో ఉన్న బంగారు ఆభరణాలు తీసుకున్నాడని తెలిసిందని బాధితులు అంటున్నారు. పరారైన వెంకట నరసయ్య నుంచి తమకు న్యాయంచేసి డబ్బులు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

ప్రచారంలో సైకిల్ స్పీడు

నేడు పొదిలికి చంద్రబాబు, గిద్దలూరుకు పవన్ కల్యాణ్
రేపు దర్శిలో టీడీపీ అధినేత రోడ్‌షో
9న ఇద్దరూ ఒంగోలు రాక
మూడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా మందకృష్ణ ప్రచారం
ఇప్పటికే పర్యటించిన లోకేష్, బాలకృష్ణ
శ్రేణుల్లో మరింత ఉత్సాహం

ఒంగోలు, మే 2 (ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో టీడీపీ దూకుడు పెంచింది. ఇప్పటికే కూటమి తరఫున పోటీచేస్తున్న అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. అలాగే వారి విజయాన్ని కాంక్షిస్తూ రెండు రోజుల క్రితం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, సినీహీరో నందమూరి బాలకృష్ణలు జిల్లా తూర్పు ప్రాంతంలోని ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో పర్యటించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. పోలింగ్‌కు పదిరోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో టీడీపీ, జనసేన అధినేతలు నారా చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ జిల్లాపై దృష్టి సారించారు. ప్రత్యేకించి పశ్చిమప్రాంతంలో వారు ఎన్నికల ప్రచారానికి వస్తున్నారు. చంద్రబాబు శుక్ర, శనివారాల్లో రెండు నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. పవన్ కల్యాణ్ శుక్రవారం గిద్దలూరుకు వస్తున్నారు. పార్టీ వర్గాల సమాచారం మేరకు.. టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు మార్కాపురం నియోజకవర్గ పరిధిలోని పొదిలి పట్టణంలో జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. అలాగే దర్శిలో శనివారం ఉదయం పది గంటలకు రోడ్డుషో నిర్వహించి సభలో ప్రసంగిస్తారు ఆమేరకు స్పష్టత రావడంతో పొదిలి సభపై మార్కాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డి ముఖ్యనేతలతో గురువారం సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై దృష్టి సారించారు. పొదిలి చిన్నబస్టాండ్‌లో సభా ఏర్పాట్లను టీడీపీ నేతలు, పోలీస్ అధికారులు పరిశీలించారు. దర్శిలో కార్యక్రమంపై అక్కడి నేతలు దృష్టి సారించారు. ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.



కనిగిరిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కృష్ణమాదిగ, పక్కన టీడీపీ అభర్థి ఉగ్ర

ముమ్మరంగా టీడీపీ అభ్యర్థుల ప్రచారం

టీడీపీ నుంచి ఎన్నికల బరిలో ఉన్న అసెంబ్లీ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు గురువారం కూడా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కొండపి అభ్యర్థి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి టంగుటూరు మండలంలో, సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ నాగులుప్పలపాడు, మద్దిపాడు మండలాల్లో ప్రచారం చేశారు. ఒంగోలులో జనార్దన్‌కు మద్దతుగా వారి కుటుంబ సభ్యులు ప్రచారం చేపట్టారు. ఎర్రగొండపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబు త్రిపురాంతకం మండలంలో, దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి దొనకొండ మండలంలో, కనిగిరి అభ్యర్థి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి కనిగిరిలో, మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి మార్కాపురం పట్టణంలో, గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి గిద్దలూరులో నిర్వహించారు. కూటమికి మద్దతు ప్రకటించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ గురువారం ఎర్రగొండపాలెం, దర్శి, కనిగిరి నియోజకవర్గాల్లో అక్కడి టీడీపీ అభ్యర్థులతో కలిసి వారికి మద్దతుగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

నేడు గిద్దలూరులో పవన్ రోడ్‌షో, సభ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ శుక్రవారం గిద్దలూరు వస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు టీడీపీ అసెంబ్లీ, లోక్‌సభ అభ్యర్థులకు మద్దతుగా రోడ్‌షో నిర్వహించి సభలో పాల్గొంటారు. అందుకోసం టీడీపీ అభ్యర్థి ఎం.అశోక్‌రెడ్డి, స్థానిక జనసేన నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు కీలకమైన ఒంగోలు నగరానికి ఇరుపార్టీల అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఈనెల 9న వస్తున్నట్లు సమాచారం. ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్దన్‌ల గెలుపు కోరుతూ ఆరోజున నగరంలో వారిద్దరూ కలిసి రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం సభల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమంపై ఒకట్రెండు రోజుల్లో పూర్తి స్పష్టత రానుంది.

వీవోఏ తొలగింపు

తాళ్లూరు, మే 2 : వైసీపీ ప్రచార ర్యాలీలో పాల్గొన్న వైకేపీ వీవోఏను విధుల నుంచి తొలగించారు. రెండురోజులుగా వైసీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సతీమణి నందిని తూ ర్పుగంగవరంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమం లో పాల్గొన్న వీవోఏ దుద్దుకూరి పద్మను విధుల నుంచి తొలగించారు. ఈమేరకు ఆశాఖకు చెందిన అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

టీడీపీ కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

● కూటమి ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్

బల్లికురవ, మే 2 : సంక్షేమం, అభివృద్ధి టీడీపీ కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని బాపట్ల పార్లమెంట్ టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ అన్నారు. మండలంలోని కొమ్మినేనివారి పాలెం, వైదనలో జరిగిన ఇంటింటి ప్రచారంలో కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి మరిచి విధ్వంసమే లక్ష్యంగా పాలన సాగించిందన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు నిర్లక్ష్యానికి గురయ్యారన్నారు. మరలా రాష్ట్రాభివృద్ధి గాడిలో పడాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. టీ డీపీ, జనసేన ప్రకటించిన మేనిఫెస్టో ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. అభివృద్ధి వినాశకారి జగన్‌రెడ్డిని ఓటుతో కుర్చీ ఖాళీ చేయించాలని కోరారు. ప్రచారంలో యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబి), పోగుల చంద్రశేఖర్, నాయకులు పాల్గొన్నారు.



వైదనలో ప్రచారం నిర్వహిస్తున్న కృష్ణప్రసాద్, బాబీ

రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్‌ఎం

దొనకొండ, మే 2: దొనకొండ రైల్వేస్టేషన్‌ను గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం .రామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. అమృత్‌భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లోని అన్నీ కార్యాలయాలు, పరిసరాలను ఆయన పరిశీ లించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక రైల్వే స్టేషన్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారని విలేకరులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. బ్రిడ్జి పొడిగింపు నిర్మాణం చేపట్టాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలపగా, పరిశీలిస్తామని డీఆర్‌ఎం తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైల్వే డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.



కారంచేడులో పోలు రాధా బలప్రదర్శనలో తలపడుతున్న ఎడ్లు

హోరాహోరీగా పోలు రాధా ఎడ్ల బలప్రదర్శన


కారంచేడు(పర్చూరు), మే 2 : కారంచేడు గ్రామంలోని శ్రీ గంగా భవానీ అమ్మ వారి వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఏర్పాటు చేసిన పోలురాధా ఎడ్ల బలప్రదర్శన పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం ప్రారంభమైన ఎడ్ల బల ప్రదర్శన పోటీలను తిలకించేందుకు పెద్ద ఎత్తున పశుపోషకులు, గ్రామస్థులు తరలి రావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా రెండు రోజులు పోటీలను ఏర్పాటు చేయటం జరిగిందని కమిటీ నిర్వాహకులు నల్లగొర్ల శ్రీరాములు, సాంబమూర్తి, కాలేషా, సుబ్బారావులు తెలిపారు.

పొగాకు అత్యధిక ధర కేజీ రూ. 296

కొండపి, మే2: కొండపి పొగాకు వేలం కేంద్రంలో నాణ్యమైన ఎఫ్-1 రకం పొగాకు కేజీకి అత్యధిక ధర 296 రూపాయలు పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. చౌటపాలెం, దాదానాయుడుపాలెం, పోలిరెడ్డిపాలెం, దాసరెడ్డిపాలెం, కొండపి, రామాయపాలెం గ్రామాలకు చెందిన రైతులు 1053 బేళ్లు వేలానికి తీసుకురాగా 937 బేళ్లు వ్యాపారులు కొనుగోలు చేశారని వివరించారు.

టంగుటూరు వేలం కేంద్రంలో..

టంగుటూరు : టంగుటూరు పొగాకు వేలం కేంద్రంలో గురువారం జరిగిన పొగాకు కొనుగోళ్లలో కిలోకు గరిష్ఠ ధర రూ. 295 రైతులకు దక్కింది. వేలం కేంద్రానికి జమ్ములపాలెం, తూమాడు గ్రామాల నుంచి 977 పొగాకు బేళ్లకు అనుమతించారు. ఇందులో 835 బేళ్లు కొనుగోలు జరుగగా మిగిలిన బేళ్లు వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. గరిష్ఠ ధర రూ. 295 కాగా కనిష్ఠ ధర రూ. 210, సరాసరి ధర రూ. 252.51 రైతులకు లభించింది.





ఉదయగిరి : పింఛన్‌దారులతో కిటకిటలాడుతున్న కెనరా బ్యాంకు

పింఛన్ నగదు పడిందో..లేదో..!

సంగం : తమ బ్యాంకు ఖాతాలో పింఛన్ పడిందో లేదో ఆతృతతో పింఛన్‌దారులు ఉదయాన్నే స్థానిక కెనరా బ్యాంకు వద్ద పడిగాపులు కాశారు. సిబ్బంది వచ్చి తలుపులు తీయడంతో ఒక్కసారిగా పింఛన్‌దారులు లోపలకు వెళ్లేందుకు తోపులాడారు. లోపలకు వెళ్లి తమ ఖాతాల్లో నగదు పడిందో లేదో కనుగొన్నారు. కొందరికి పడకపోవడంతో ఉసురుమంటూ వెనుతిరిగారు. నగదు ఖాతాల్లో పడినా విత్‌డ్రా స్లిప్పులు రాసిచ్చే వారు లేక వృద్ధులు, చదువురాని వారు అక్కడ ఉన్నవారిని బతిమలాడుకొని రాయించుకున్నారు. మరోవైపు క్యూలో నిలబడలేక వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన పింఛన్‌దారులు తిరిగి వెళ్లలేక ఆటోలు అద్దెకు తీసుకుని వెళ్లారు.



బుచ్చిరెడ్డిపాళెం : మండుటెండలో పింఛను కోసం వెళ్ళి నీరసించి పడిపోయిన వృద్ధురాలు

కమీషన్ ఇచ్చి...

సీతారామపురం : మండలంలోని బ్యాంకుల వద్ద పెన్షన్ సొమ్ము కోసం వృద్ధుల బారులుతీరారు. ఎక్కువసేపు క్యూలైన్‌లో నిలబడలేక, నగదు ఏ బ్యాంకులో జమ అయ్యిందో ఆధార్ లావాదేవీలతో డబ్బులు ఇచ్చే ప్రైవేట్ షాపుల వద్దకు చేరుకున్నారు. రూ.30 నుంచి 60 కమీషన్ ఇచ్చి పింఛన్ డబ్బును తీసుకున్నారు. కొంత మంది ఖాతాలో మైనస్ బ్యాలెన్స్ ఉండటంతో డబ్బులు కట్టయ్యాయి. మరోవైపు చాలామందికి రూ.3వేల సొమ్ము జమ కాలేదు.



సంగం : కెనరా బ్యాంకు తెరవక ముందే పింఛనుదారుల పడిగాపులు



ఆధార్ సెంటర్ వద్ద కమీషన్ ఇచ్చి పెన్షన్ తీసుకుంటున్న లబ్ధిదారులు

నీరసించి..
సొమ్మసిల్లి!

- పింఛనుదారులతో వైసీపీ సర్కారు ఆటలు
- మండుటెండలో బ్యాంకుల వద్ద క్యూ
- చాలా మంది ఖాతాల్లో జమకాని నగదు
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : పేదలపై ప్రభుత్వం పగ పట్టింది. ప్రతిపక్షాలపై నెపం నెట్టాలన్న కుట్రతో పింఛను నగదును బ్యాంకుల్లో జమ చేసింది. ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేసేందుకు సచివాలయ వ్యవస్థ ఉన్నా దానిని కాదని బ్యాంకుల్లో నగదు జమ చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం పేదలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. గురువారం జిల్లాలోని బ్యాంకుల వద్ద కనిపించిన దృశ్యాలే ఇందుకు నిదర్శనం. వృద్ధులు, దివ్యాంగులు మినహా మిగిలిన వారికి బ్యాంకుల్లో పింఛన్ నగదు జమ చేశామని అధికారులు వెల్లడించారు. 1వ తేదీ మేడే కావడంతో బ్యాంకులు పని చేయలేదు. దీంతో లబ్ధిదారులు గురువారం బ్యాంకులకు క్యూ కట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బ్యాంకులు పింఛన్‌దారులతో కిటకిటలాడాయి. ఓ వైపు 43 డిగ్రీల ఎండ కాస్తుంటే మరోవైపు ఆ వేడిని తట్టుకుంటూ పేదలు క్యూలో నిలబడి అవస్థలు పడుతున్న దృశ్యాలు కదిలించాయి. ఉదయం తొమ్మిది గంటల నుంచే లబ్ధిదారులు బ్యాంకుల వద్దకు రావడం ప్రారంభించారు. అక్కడ సరైన వసతులు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు అల్లాడిపోయారు. గ్రామాల్లోని లబ్ధిదారులు కిలోమీటర్ల దూరం నడిచి, ప్రయాణించి బ్యాంకుల వద్దకు వచ్చే సరికే అలసిపోయారు. గంటల కొద్దీ క్యూలో నిల్చున్నాక తీరా మీ ఖాతా పనిచేయడం లేదని బ్యాంకు సిబ్బంది చెప్పడంతో చాలా మంది ఉసూరుమన్నారు. జిల్లాలో 3,15,423 మంది పింఛన్‌దారులు ఉండగా, రూ.94.38 కోట్లు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఈ నెల 79,734 మందికి ఇళ్ల వద్దనే పింఛన్ ఇచ్చేలా నిర్ణయించారు. మిగిలిన 2,35,689 మందికి వారి ఆధార్‌తో లింక్ అయిన బ్యాంకు ఖాతాలో పింఛన్ నగదు జమ చేశారు. ఇంటింటికి పంపిణీ చేయాల్సిన పింఛన్లలో 91 శాతం పంపిణీ చేశారు. కాగా బ్యాంకుల్లో చాలా మంది లబ్ధిదారుల ఖాతాలు ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయి. కొందరికి చాలా దూరంలోని బ్యాంకులో ఆధార్ లింక్ అయ్యింది. ఇంకొందరి ఖాతాలు మైనస్ బ్యాలెన్స్‌లో ఉన్నాయి. ఇటువంటి వారందరికీ పింఛన్ నగదు అందలేదు. దీంతో బ్యాంకులకు వచ్చిన చాలా మంది పింఛన్ తీసుకోకుండానే వెనుదిరిగారు. ఇలా ఎంత మందికి నగదు జమ కాలేదన్న వివరాలు ఇంకా తెలియలేదు.

• లబ్ధిదారుల్లో ఆగ్రహం

బ్యాంకుల్లో జమకాని నగదు తిరిగి పంచాయతీ కార్యదర్శుల ఖాతాల్లో శుక్రవారం రిటర్న్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఆ నగదును సచివాలయ సిబ్బంది డ్రా చేసి లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. అయితే ఈ పద్ధతిపై లబ్ధిదారుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్ల వ్యవస్థ లేకపోయినా గత నెలలో సచివాలయ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు పంపిణీ పూర్తి చేశారు. మరి ఎందుకు ఈ నెల బ్యాంకుల్లో జమ చేయాల్సి వచ్చిందని పేదలు ప్రశ్నిస్తున్నారు. ఒక సచివాలయ సిబ్బంది బ్యాంకుకు వెళ్లి డబ్బులు డ్రా చేసుకొని వచ్చి పంపిణీ చేసేందుకు, లబ్ధిదారు లంతా బ్యాంకుకు వెళ్లేందుకు ఎంత తేడా ఉందని నిలదీస్తున్నారు. ఊరిలో ఉండే సచివాలయంలో పింఛన్ తీసు కునే అవకాశం ఉన్నా, దానిని కాదని తమను మండల కేంద్రాల్లోని బ్యాంకులకు పంపడంపై లబ్ధిదారులు మండి పడుతున్నారు.



పొదలకూరు : ఎస్‌బీఐ సర్వీసు సెంటర్ వద్ద వృద్ధులు...



అల్లూరు : ఎస్‌బీఐ బ్యాంకు వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

నేడు చంద్రబాబు, పవన్ రాక

• నెల్లూరులో రోడ్ షో

నెల్లూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం నెల్లూరుకు రానున్నారు. సాయంత్రం నగరంలో వీరిద్దరు కలిసి రోడ్ షో ద్వారా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సాయంత్రం ఆరు గంటలకు హెలికాప్టర్‌లో నారాయణ మెడికల్ కాలేజీ ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన కేవీఆర్ పెట్రోల్ బంకు జంక్షన్‌కు చేరుకొని సాయంత్రం 6.15 గంటలకు రోడ్ షో ప్రారంభిస్తారు. ఆర్టీసీ బస్టాండు, మద్రాసు బస్టాండ్, వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ మీదుగా నర్తకీ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ఈ రోడ్ షో సాగుతుంది. అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి చంద్రబాబు, పవన్ ప్రసంగిస్తారు.

• ఏర్పాట్ల పరిశీలన

నర్తకి సెంటర్‌లో శుక్రవారం రాత్రి జరిగే సభాస్థలిని టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వారి వెంట టీడీపీ నగరాధ్యక్షుడు మామిడాల మధు, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.



సభాస్థలి ఏర్పాట్లు పరిశీలిస్తున్న నారాయణ, కోటంరెడ్డి

బండ్లు తిప్పుకుని బాడుగ డబ్బులివ్వరేం!

కందుకూరులో వాహన యజమానుల ఆందోళన

కందుకూరు, మే 2: 'నెలరోజులుగా మాచేత బండ చాకిరీ చేయించుకుంటున్నారు. మండుటెండలో పొద్దస్తమానం వాహనాలను పరుగులు తీయిస్తున్నారే కానీ మా బాగోగులు పట్టించుకోవడం లేదు. పైగా ఇవ్వాల్సిన బాడుగలు కూడా ఇవ్వడం లేదు. మా జేబులో డబ్బులు పెట్టి ఆయిల్ పోయించి తిప్పుతున్నాం. మేమేమన్నా లక్షాధికారులమా!?' అంటూ గురువారం కందుకూరులో కార్లు డ్రైవర్లు, యజమానులు ఆందోళనకు దిగారు. ఎన్నికల సందర్భంగా వివిధ విధుల కోసం సబ్ కలెక్టరు నేతృత్వంలో ప్రైవేటు వాహనాలను అద్దెకు తీసుకున్నారు. కందుకూరు టాక్సీ స్టాండులో ఉండే దాదాపు 30కిపైగా వాహనాలను నెల రోజులుగా సబ్ కలెక్టరు కార్యాలయానికి కేటాయించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్), చెక్‌పోస్టు చెకింగ్ విధుల కోసం సదరు వాహనాలను తిప్పుతున్నారు. ప్రతివారం అద్దె బిల్లులు ఇస్తామని చెప్పి నెలరోజులుగా ఇవ్వకపోవడంతో వాహనదారుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బిల్లులు చెల్లిస్తే తప్ప విధులకు కదిలేది లేదని వాహనాలన్నీ సబ్ కలెక్టరు కార్యాలయంలో పెట్టి నిరసనకు దిగారు. దీంతో సబ్ కలెక్టరు విద్యాధరి వాహనాల యజమానులతో చర్చలు జరిపి కొంతమొత్తం అద్దెలు చెల్లించి మిగిలిన బకాయిలను కూడా త్వరగా క్లియర్ చేస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.



సబ్ కలెక్టరు కార్యాలయంలో వాహనాలు నిలిపివేసి నిరసన తెలుపుతున్న డ్రైవర్లు, యజమానులు

టీడీపీ పాలనలోనే తీరప్రాంత అభివృద్ధి

- ఫిషింగ్ హార్బర్ మంజూరు ఘనత చంద్రబాబుదే..
- బీద రవిచంద్ర వెల్లడి



ప్రచారరథంపై అభివాదం చేస్తున్న వీపీఆర్, బీద, కావ్య

బిట్రగుంట, మే 2: టీడీపీ ప్రభుత్వ పాలనలోనే జిల్లాలోని తీర ప్రాంతం అభివృద్ధి చెందిందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. బోగోలు మండలం సీఆర్ పాలెం, జువ్వలదిన్నె పంచాయతీల్లో గురువారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ప్రజలు భారీగా తరలివచ్చి నేతల రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్ మంజూరు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు.జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీలు ఓడిపోయినా మత్స్యకార ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి రూ.300 కోట్లు మంజూరు చేసింది చంద్రబాబేనని అన్నారు. మత్స్యకారుల వ్యాపార లావాదేవీల కోసం చిప్పలేరు వంతెన ఏర్పాటు కూడా టీడీపీ హయాంలోనే జరిగిందని తెలిపారు. మండల ప్రజల దాహార్తి తీర్చేందుకు సోమశిల జలాల ద్వారా శుద్ధినీటిని అందించేందుకు నిధులు మంజూరు చేయించానని బీద తెలిపారు. అయితే జేపీగూడూరు నుంచి తీరప్రాంతం వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేయించేందుకు వైసీపీ నేతలకు తీరికలేకుండా పోయిందని ఆయన దుయ్యబట్టారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా కావ్య కృష్ణారెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. వీపీఆర్‌ను పార్లమెంట్‌కు పంపితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా తీరప్రాంత అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తారని ఆయన వివరించారు. తనను గెలిపిస్తే కావలి నియోజకవర్గ అభివృద్ధి ఎలా ఉంటుందో మాటలతో చెప్పడం కాకుండా, చేతల్లో చూపుతానని కావ్య కృష్ణారెడ్డి గంగపుత్రులకు హామీ ఇచ్చారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తీరం ఎంత గంభీరంగా ఉంటుందో... అంతకన్నా నిర్మలమైన మనసుతో మత్స్యకారులు ఉంటారని, నేడు వారు చూపిన ప్రేమాభిమానాలు మరువలేనన్నారు. తాను ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానని,వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా తీరప్రాంత అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాలేపాటి నాగేశ్వరావు, బీద గిరిధర్ యాదవ్, పాలిశెట్టి, సుధీర్‌బాబు, వై.వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుధాకర్, మాధవరావు, గ్రామకాపులు, మత్స్యకార పెద్దలు తదితరులు పాల్గొన్నారు. కాగా పాతపాలెం కూడలి నుంచి రోడ్లపై టీడీపీ ఎన్నికల గుర్తు సైకిల్‌తోపాటు రంగవల్లులు తీర్చిదిద్ది నేతలకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలుగ్రామాల్లోని రామాలయాల వద్ద గ్రామ కాపులు, పెద్దలు బీద రవిచంద్ర, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డిలను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

ఇదేం నిబంధన!?

- పోస్టల్ బ్యాలెట్ స్థానంలో ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటు
- 5, 6, 7 తేదీల్లోనే వినియోగించుకోవాలని ఆదేశాలు
- ఉద్యోగం చేసే ప్రాంతం ప్రాతిపదికన ఓటు కల్పన
- ఈ నిబంధనలతో ఉద్యోగ ఉపాధ్యాయుల బేజారు
- కందుకూరు నియోజకవర్గంలో కొత్త సమస్య
- ఓటుకు దూరం చేసే కుట్రేనని ఆందోళన



కందుకూరు, మే 2 : ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ ఉపాధ్యాయులకు కొత్త సమస్య వచ్చింది. గతంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉండేది. ఈదఫా ఆ స్థానంలో ఈ నెల 5, 6, 7 తేదీలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఫెసిలిటేషన్ సెంటర్లకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మూడు తేదీలలో ఆయా ఉద్యోగులకు ఏ రోజు కేటాయిస్తే ఆ రోజు ఆ కేంద్రాలకు వెళ్లి బ్యాలెట్ తీసుకుని అక్కడే ఓటుహక్కు వినియోగించుకుని సీల్డ్ బ్యాలెట్‌ను సిబ్బందికి ఇవ్వాలి.

• ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో అయోమయం

జిల్లాల పునర్విభజనలో నెల్లూరు జిల్లాలో కలిసిన కందుకూరు నియోజకవర్గానికి సంబంధించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు కొత్త సమస్య ఏర్పడింది. కందుకూరులో స్థిరనివాసం ఉంటూ కందుకూరులో ఓటుహక్కు కలిగి ఉన్న వారు వందలాదిమంది పాత కందుకూరు రెవిన్యూ డివిజన్ పరిధిలోని కొండపి, కనిగిరి నియోజకవర్గాలలో విధులు చేస్తున్నారు. అలాగే కందుకూరు నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులు చాలామంది ఒంగోలు, టంగుటూరు, సింగరాయకొండలలో స్థిరనివాసం ఉంటూ అక్కడ ఓటుహక్కు కలిగి ఉన్నారు. అయితే ఎన్నికల అధికారులు ఓటుహక్కును ప్రాతిపదికగా కాకుండా ఉద్యోగం చేస్తున్న ప్రాంతాన్ని ప్రాతిపదిక చేసుకుని ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అంటే కందుకూరు నియోజకవర్గంలో పనిచేస్తూ ఇతర ప్రాంతాల్లో ఓటుహక్కు ఉన్నవారు నెల్లూరులో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లి ఓటువేయాలి. అలాగే కందుకూరులో ఓటుహక్కు ఉండి కనిగిరి, కొండపి నియోజకవర్గాల పరిధిలో పని చేస్తున్న వారు ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలుకు వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవాలి. అయితే కందుకూరులో ఓటుహక్కు ఉండి కందుకూరు నియోజకవర్గంలోనే పనిచేస్తున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు మాత్రం కందుకూరు జడ్పీ హైస్కూల్లోని ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఉద్యోగ ఉపాధ్యా యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నందున వారి ఓట్లు పోలింగ్ శాతాన్ని తగ్గించాలన్న దురుద్దేశంతోనే ఇలాంటి తికమక ఆదేశాలు ఇస్తున్నారన్న ఆందోళన ఉద్యోగుల్లో వ్యక్తమవుతోంది. అంత దూరం వెళ్లి ఓటుహక్కు వినియోగించుకోవటానికి ఇష్టపడక చాలామంది మానుకునే అవకాశం ఉందని, ఆ లక్ష్యం కోసమే ఈ ఆదేశాలని విమర్శిస్తున్నారు. ఎన్నికల కమిషన్, ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి ఉద్యోగ ఉపాధ్యాయు లకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించాలని లేనిపక్షంలో కనీసం వారి ఓటుఉన్న నియోజకవర్గ కేంద్రంలో ఫెసిలిటేషన్ సెంటర్‌లో ఓటుహక్కు వినియోగిం చుకునే వెసులుబాటు ఇవ్వాలని కోరుతున్నారు.

ఓట్లు పోల్ కాకుండా ఉండేందుకే!

ఉద్యోగులు, ఉపాధ్యాయులు సుదూరప్రాంతానికి వెళ్లి నిరీక్షించేలా చేస్తే ఓటుహక్కు వినియోగించుకోకుండా వదిలేస్తారన్న దురాలోచనతోనే ఈ నిబంధనలు పెట్టారనిపిస్తోంది. ఉద్యోగ ఉపాధ్యాయులంతా రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేస్తారని స్పష్టమైనందున కొంతమేరకైనా వారి ఓట్లు పోల్‌కాకుండా నిరోధించాలన్న ఉద్దేశం తప్ప మరొకటి కాదు. తికమక నిబంధనల వల్ల కలిగే ఇబ్బందులను వివరిస్తూ కందుకూరు సబ్ కలెక్టరుకు వినతిపత్రం కూడా అందజేశాం. జిల్లా కలెక్టరు, ఎన్నికల కమిషన్ అధికారులు వాస్తవికంగా ఆలోచన చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందిలేకుండా చర్యలు తీసుకోవాలి.

- టీవీ రామచంద్రరావు, టీచర్

నేడు లింగసముద్రంలో తెలుగుదేశం రోడ్‌షో

లింగసముద్రం: లింగసముద్రంలో శుక్రవారం నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులు రోడ్‌షో నిర్వహించను న్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షుడు అంగుళూరి నరసింహారావులు ఓ ప్రకటనలో తెలిపారు. వాకమళ్లవారిపాలెం నుంచి ర్యాలీగా బయలుదేరి లింగసముద్రం చేరుకుని బహిరంగ సభలో మాట్లాడతారని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అల్లూరు, మే 2 : గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మచిలీపట్నంకు చెందిన పసుపులేటి మల్లికార్జున (34) మండలం గ్రద్దగుంటలోని తన అత్తగారింటికి కొద్దిరోజుల క్రితం తన భార్యతో కలసి వచ్చాడు. ఈనెల 30న ఇంటిలోని గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరులోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి హోమ్ పోలింగ్

● వృద్ధులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలి

● నియోజకవర్గంలో 4,737 మంది అర్హులు ● సబ్ కలెక్టరు విద్యాధరి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ విద్యాధరి

కందుకూరు, మే 2: వృద్ధులు, వికలాంగులు ప్రయాసపడి పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాల్సిన అవసరం లేకుండా హోమ్ పోలింగ్ విధానం అమలు చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టరు జి.విద్యాధరి కోరారు. గురువారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో 85 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులు 4,737 మంది ఉన్నట్లు గుర్తించామని, వారందరికీ పోలింగ్ సిబ్బంది ఈనెల 3,4,5 తేదీలలో వారి ఇళ్లవద్దకే ఈవీఎం మిషన్లు తీసుకెళ్లి వారితో ఓటు వేయిస్తారని తెలిపారు. హోమ్ పోలింగ్‌కు అర్హులైన వారు తమ అభీష్టం మేరకు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ సిబ్బంది వెళ్లిన సమయంలో వారి కుటుంబ సభ్యుల్లో ఒకరిని సహాయకుడిగా అనుమతిస్తామని, రహస్య పద్ధతిలోనే వారితో ఓటు వేయిస్తామని వివరించారు. హోమ్ పోలింగ్‌ను పూర్తి చేసేందుకు ప్రతి మండలానికి ఒక టీమ్‌ను ఏర్పాటు చేశామని, ఈ మూడు రోజుల్లో ఆ టీమ్ మండలంలోని అన్ని గ్రామాల్లో తిరిగి ఓటింగ్ వేయిస్తారని వివరించారు. ఇంకా ఎవరైనా ఓటర్లు మిగిలి ఉంటే తిరిగి ఈనెల 8,9,10 తేదీలలో మరో విడత హోమ్ పోలింగ్ టీమ్ ఆయా గ్రామాలకు వెళ్లి ఓట్లు వేయిస్తారని తెలిపారు. ఈ ప్రక్రియను ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తామని, ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా పోలింగ్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టరు విద్యాధరి హెచ్చరించారు.

వైసీపీ మాయమాటలు నమ్మొద్దు

● టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఇక్బాల్ మహ్మద్



ముస్లింల సమావేశంలో మాట్లాడుతున్న ఇక్బాల్

కావలి, మే 2: టీడీపీ హయాంలో ముస్లింలకు ఒక్క చిన్నపాటి అన్యాయమైనా జర గలేదని, వైసీపీ నేతలు ముస్లింలను ఆకట్టుకునేందుకు చెపుతున్న మాయమాటలు నమ్మవద్దని టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ షేక్ ఇక్బాల్ మహ్మద్ తెలిపారు. పట్టణంలోని ముసునూరులో గురువారం కావలికి చెందిన ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ టీడీపీ, బీజేపీ కలిసి ప్రభుత్వాలు ఏర్పాటు చేసినపుడల్లా ముస్లింలకు మంచే జరిగింది తప్ప ఎవరికీ అన్యాయం జరుగలేదన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో ఇచ్చిన రంజాన్‌తోఫా, దుల్హన్, విదేశీవిద్య, స్వయం ఉపాధికి ఇచ్చే రాయితీ రుణాలు, ఇమామ్, మౌసిన్‌లకు జీతాలు తదితర అన్నిపథకాలకు జగన్ ప్రభుత్వంలో మంగళం పాడారన్నారు. ముస్లింలకు అనేక రకాలుగా నష్టం చేసిన జగన్ మోహన్‌రెడ్డికి ఓటు వేస్తే ఎవరికి వారు ఉరివేసుకున్నట్లేనన్నారు. పార్లమెంట్‌లో జగన్‌కు అమోఘబలం ఉన్నప్పటికీ సీఏఏ, ఎన్ఆర్సీ, ఉమ్మడిపౌరస్మృతి వంటి కీలక ముస్లిం వ్యతిరేక బిల్లులను ఆపకుండా భేషరతుగా జగన్ మద్దతిచ్చింది వాస్తవం కాదాని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన 4 శాతం ముస్లిం రిజర్వేషన్‌లను రద్దు చేయాలని కోర్టుకు వెళ్లింది వైసీపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య కాదా అని ప్రశ్నించాంనను. ముస్లిం కుటుంబాలపై దాడులు జరుగుతుంటే జగన్ ముఖ్యమంత్రి స్థాయిలో ఒక్కసారైనా ఖండించారా అని ప్రశ్నించారు. రూ.30 వేల కోట్ల విలువైన వక్ఫ్ భూములు కబ్జాకు గురైతే జగన్ ఏమిచేశారన్నారు. ముస్లింలకు మేలు చేసే చంద్రబాబు నాయుడికి అందరం అండగా నిలిచి ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవాలన్నారు. ఎంపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపొంచాలని కోరారు. ఈ సమావేశంలో ముసిం నేతలు సయ్యద్ అబ్దుల్ రహీం, షేక్ హజరత్, కరిముల్లా, అబ్దుల్ హఫీజ్, రఫీ అహ్మద్, హుస్సేన్, అబ్దుల్ అన్సర్, ఆసిఫా, ఖమరబాబు, ఇబ్రహీం, నాయబ్ రసూల్, షాన్వాజ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ

కందుకూరు, మే 2: కందుకూరు పట్టణం భవన నిర్మాణ కార్మిక సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో గురువారం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.మాల్యాద్రి, అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ఆదాము, గౌరవాధ్యక్షుడు ఎస్‌ఏ గౌస్, ఎస్కే రంతుల్లా, ఏ.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారిగా సుధాకర్‌రావు బాధ్యతల స్వీకరణ



న్యాయాధికారి సుధాకర్‌రావును సత్కరిస్తున్న పోట్లూరు

కావలిటౌన్, మే 2: కావలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారిగా ఈ సుధాకర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా కావలి గ్రామ దేవత కలుగోళశాంభవి ఆలయం, సాయిబాబా గుడిలో పూజలు నిర్వహించారు. ఆయనను మాజీ ఏజీ పీ పోట్లూరు శ్రీనివాసులు న్యాయవాదులతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతించారు. బాబా గుడి పెద్దలు టంగుటూరి ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోకు పాలభిషేకం



మేనిఫెస్టోకు పాలభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

కలిగిరి, మే 2: ఎన్నికల మేనిఫెస్టోలో రూపొందించిన ప్రతి సంక్షేమ పథకాన్ని టీడీపీ నూరు శాతం అమలు చేస్తుందని, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, టీడీపీ రాష్ట్ర రైతు కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావులు పేర్కొన్నారు. కలిగిరి పట్టణంలోని శివాలయం సమీపంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం చంద్రబాబు నాయుడు ప్రకటించిన మేనిఫెస్టోకు పాలాభిషేకం చేశారు. రాజధాని నిర్మాణంతో పాటు, పరిశ్రమల స్థాపన. ఉపాధి అవకాశాలు కల్పన, సంపద సృష్టించడం చంద్రబాబుకే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాకు మహేష్, గంజాం రాఘ వేంద్ర, చంద్రమౌళి, ప్రభాకర్, జీ.మదన్‌కుమార్, బొగ్గవరపు వేణు, నిశ్శంకర సురేష్, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వరి గడ్డి దగ్ధం



ట్రక్‌లో దగ్ధమవుతున్న గడ్డి

కావలి రూరల్, మే 2: పశువుల మేత కోసం ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరి గడ్డికి విద్యుత్ వైర్లు తగలడంతో గడ్డితో పాటు ట్రాక్టర్ ట్రక్ దగ్ధమైన ఘటన గురువారం కావలి మండలం కొత్తపల్లి వద్ద జరిగింది. బాధితుడి కథనం మేరకు.. కొండాపురం మండలం కొమ్మికి చెందిన చెరుకూరి క్రిష్ణ కొత్తపల్లిలో గడ్డి కొనుగోలు చేసి కొమ్మికి తరలిస్తుండగా మార్గమధ్యంలో విద్యుత్ వైర్లు తగలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వారు గమనించి ట్రాక్టర్ నుంచి ట్రక్‌ను వేరుచేసి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి మంటలు పూర్తిగా వ్యాపించటంతో ట్రక్ పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.1,50,000 ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

మీ కుటుంబ సభ్యుడిగా ఆశీర్వదించండి : ఇంటూరి



గుడ్లూరు : ఎన్నికల ప్రచారంలో ఇంటూరి నాగేశ్వరరావు



వలేటివారిపాలెం : మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, మే 2 : ప్రతి ఒక్కరూ మీ కుటుంబ సభ్యుడిలా ఆదరించి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. వలేటివారిపాలెంలో ఏర్పాటు చేసిన టీడీపీ ఎన్నికల కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాంతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ వలేటివారిపాలెం మండలం ఎప్పుడూ టీడీపీకి కంచుకోట అన్నారు. మండలంలో గతం కంటే ఈసారి బారీ మెజారిటీ వచ్చేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. నాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంలోనూ, ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రబాబు నాయుడు టిక్కెట్ కేటాయించడంలోనూ దివి శివరాం సహాయ సహకారం ఎంతో ఉందని తెలిపారు. పార్టీ కోసం, రాష్ట్రం కోసం అధిష్ఠానం ఎవరికి ఏ బాధ్యతలు అప్పగిస్తే ఆ బాధ్యతలు చేయాలని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా శివరాంను గురువుగానే భావించి ఆయన అడుగుజాడల్లోనే నడుస్తానని తెలిపారు.



లింగసముద్రం : టీడీపీలో చేరిన వారితో ఇంటూరి

భావితరాల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యం : శివరాం

భావితరాల భవిష్యత్ చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం తెలిపారు. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తల్లో చిన్న చిన్న విభేదాలను ఉన్నప్పటికీ అవి పక్కనపెట్టి నెల్లూరు పార్లమెంటు టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబునాయుడను ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలేటి శ్రీధర్‌నాయుడు, వలేటి నరసింహం, గుత్తా కొండయ్య, కొంకా రమేష్, వలేటి మధుసూదన్‌రావు. కుంబాల అంజయ్య, కాకుమాను ఆంజనేయులు, వీరమోసు అంజయ్య, కాకుమాను హర్ష, నవ్వులూరి రాజారమేష్, ఘట్టమనేని చెంచునాయుడు, టీ.రమణయ్య పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

లింగసముద్రం : మండలంలోని చినపవని పంచాయతీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో వైసీపీకి చెందిన పలువురు టీడీపీలో చేరారు. గురువారం మధ్యాహ్నం కందుకూరు ఎన్‌డీఏ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గ్రామంలోని వైసీపీకి చెందిన కేతినేని మాలకొండయ్య, సత్యనారాయణ, మాల్యాద్రి, గిరి, అయ్యప్ప, చొప్పరపు శేషయ్య, శ్రీనివాసులు, వేణు, నలగంగు మాల్యాద్రి, గొర్రెపాటి శంకర్ తదితరులు పార్టీలో చేరారు. నాగేశ్వరరావు వారికి టీడీపీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సోంపల్లి మనోహర్, ముళ్లపాటి చౌదరి, పారా బుచ్చయ్య, బోయపాటి వెంకటేశ్వర్లు, గొర్రెపాటి శ్రీనివాసులు, కొడాలి కోటేశ్వరరావు, చాగంటి మల్లికార్జున, మాదవరపు బ్రహ్మయ్య, ముళ్లపాటి మహేష్, ఉమ్మనేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు 25వ వార్డులో...

కందుకూరు : పట్టణంలోని 25వ వార్డు ఎర్రవడ్డిపాలెంకు చెందిన యనమల పెదపోతురాజు, యనమల వెంకి, కుమార్, మల్లికార్జున, పల్లాపు శ్రీను, బెల్లంకొండ బాలరాజు కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుర్రం మల్లికార్జున, అత్తోట మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

1వ వార్డులో ప్రచారం

పట్టణంలోని 1వ వార్డు పరిధిలో ఉన్న ఎస్టీ కాలనీ, 23వ వార్డు స్కంధపురి సోమేశ్వరాలయం ప్రాంతాలలో టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరి సౌజన్య గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మ్యానిఫెస్టోలో కరపత్రాలు పంపిణీచేశారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, ప్రతిఒక్కరూ టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులను గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు, మన్నేపల్లి వరప్రసాదు, టీడీపీ నాయకులు పిడికిటి వెంకటేశ్వర్లు, బెజవాడ ప్రసాదు, ముచ్చు శ్రీను, బెజవాడ వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు.. అభివృద్ధికి పునాది

గుడ్లూరు : టీడీపీకి ఓటు వేస్తే రాష్ట్ర అభివృద్ధికి పునాది వేసినట్లేనని కందుకూరు నియోజక వర్గ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఇచ్చిన మాట తప్పకుండా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడమే కాకుండా అండగా ఉంటామని కందుకూరు తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని అమ్మవారిపాలెం, గుడ్లూరు ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఆయన ప్రచారం నిర్వహించారు. గుడ్లూరు ఎస్సీకాలనీలోని మాతమ్మ గుడి, రామాలయం, చర్చీలలో పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం అమ్మవారిపాలెంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ అధికారంలోకి రాగానేఅమలుపరిచే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికలకు ముందు మోసపూరిత మాటలతో ప్రజలను మభ్బిపెట్టి అధికారంలోకి వచ్చారని, ఆ తరువాత అక్రమంగా దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఒక్క అవకాశంతో ఐదేళ్ల అధికారంలో ఉండి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు అబద్ధపు వాగ్దానాలు, మోసపూరిత మాటలతో ప్రజలను మభ్బిపెట్టేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడన్నారు. విజనరీ కలిగిన నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కాకపోతే రాష్ట్రంలో రౌడి రాజ్యం మళ్లీ రాజ్యమేలుతుందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చగలిగిన నేత చంద్రబాబు నాయుడికి అందరం అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, పువ్వాడి వేణు, మేకపోతుల రాఘవయ్య, చెన్నారెడ్డి మహేష్, గద్దె సుందరావు, రాహూరి వేణు, స్టీఫెన్ పాల్, చిత్తారి మల్లికార్జున, కావలి ఏసుదాస్ పాల్గొన్నారు.

ఓటేసే ముందు ఒక్క క్షణం ఆలోచించండి

● అభివృద్ధికి బ్రాండ్ చంద్రబాబునాయుడు ● తుమ్మలపెంటలో వేమిరెడ్డి, కావ్య, బీద ప్రచారం



రోడ్‌షోలో వేమిరెడ్డి, కావ్య, బీద రవిచంద్ర



టీడీపీలో చేరిన చెన్నాయపాలెం, పెదపట్టపుపాలెం మత్స్యకారులు

కావలి/కావలిరూరల్, మే 2: ప్రతి వ్యక్తి ఓటు వేసేముందు ఒక్క క్షణం ఆలోశించాలని, ఓటేసే ఐదు సెకన్లలో చేసే తప్పునకు ఐదేళ్లు బాధపడాల్సి వస్తోందని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అభివృద్ధికి ఒక బ్రాండ్ అని, ఆయనను గెలిపించుకుంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. గురువారం కావలిరూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీలోని తుమ్మలపెంట నుంచి కొత్తసత్రం వరకు కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, కావలి మాజీ ఎమ్మెల్యే వంటేరు వేణుగోపాల్‌రెడ్డిలతో కలసి ఆయన రోడ్‌షో నిర్వహిస్తూ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు, జువ్వలదిన్నె హార్బర్‌కు టీడీపీ హ యాంలోనే నిధులు మంజూరయ్యాయని, వాటిని వైసీపీ తెచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కావలి, తుమ్మలపెంట రోడ్డుకు గత టీడీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని, వైసీపీ పాలనలో బిల్లులు రావని కాంట్రాక్టర్ పనులు చేయలేదంటే ఆ పాలనపై ఎంత విరక్తి చెందారో అర్థమవుతోందన్నారు.



తీరంలో రోడ్లపై వేసిన టీడీపీ గుర్తును పరిశీలిస్తున్న నాయకులు

● **తీర ప్రాంత భూములపై ఎమ్మెల్యే కన్ను**

కావలి తీర ప్రాంతంలో ఉన్న 4వేల ఎకరాలపై కావలి ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి కన్ను పడిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. వాటిని ఎమ్మెల్యే కాజేయాలని చూస్తున్నారని, వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని, ఆయన ఆటలు సాగనివ్వమన్నారు. జన్మభూమి కార్య క్రమంలో భాగంగా నారా లోకేష్ తుమ్మలపెంట వచ్చినపుడు ఈ ప్రాం తవాసులు తుమ్మలపెంట రోడ్డు డబు ల్ రోడ్డు చేయాలని అడిగారన్నారు. దీంతో అప్పట్లో రోడ్డుకు నిధులు మం జూరు చేసినా వైసీపీ దాని నిర్మాణం చేపట్ట లేదన్నారు. రోడ్డు కోసం ఆందోళ నలు చేపట్టినా ఈ ప్రభుత్వానికి సీమ కుట్టిన ట్లు కూడా లేదన్నారు. ఎమ్మెల్యే ఈ రోడ్డు వెంబడి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి వాటికి వేల ట్రిప్పులు గ్రావెల్ తోలి రోడ్డును ధ్వంసం చేసినా గుంటలకు తట్టెడు మట్టి వేయలే దన్నారు. తుమ్మలపెంట ప్రాంతంలో పేదలు ఇళ్లు అడిగితే ఎమ్మెల్యే గుడిలో పడుకోమని ఎద్దేవా చేశారన్నారు. ఈ ప్రాంతానికి రారాజులు మత్స్యకారులేనని, అందుకు తగిన బుద్ధి చెపతారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అటవీశాఖ క్లియరెన్స్ చేసి నివేశ న స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టించే బాధ్యత మా నలుగురం తీసు కుంటామని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి మాట్లా డుతూ రాష్ట్రంలో అరాచక, విధ్వంసక పాలన సాగిస్తున్న వైసీపీ ఫ్యాన్ రెక్కలు విరగకొ ట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎమ్మెల్యే అరాచకాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. అరాచక ఎమ్మెల్యేను మరోసారి గెలిపిస్తే కావలి నియోజకవర్గంలో ఇంకేమీ మిగ లదన్నారు. టీడీపీ అభ్యర్థులను గెలిపొంచాలన్నారు. ఈ కార్యక్ర మంలో కావలి రూరల్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆవుల రామకృష్ణ, ఉప్పాల వెంక ట్రావు, జనసేన నేత తిరుపతి స్వామి, బీజేపీ నాయకుడు మామిడి వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు, కాపులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి బారీగా వలసలు

కావలి : కావలి పట్టణం, రూరల్ మండలాల నుంచి పలువురు వైసీపీ నాయకులు గురువారం టీడీపీలో చేరారు. కావలిరూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, ప్రళయకావేరి సురేష్ ల ఆధ్వర్యంలో చెన్నాయపాలెం పెదపట్టపుపాలెంకు చెందిన వెంకయ్య, తాతయ్య, జయరాం, నరసింహం, శ్రీను, ప్రసాద్, ముని, లక్ష్మయ్య తదిత ర 40 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరగా కావ్య క్రిష్ణారెడ్డి కపండువా కప్పి ఆహ్వానించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వంటేరు ఆధ్వర్యంలో ఆయన అనుచరులు పామంజి తిరుపతి, గంగనగారి రాము, వాయిల తిరుప తితో కలిసి 10 కుటుంబాలు చేరగా వారికి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాక ర్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిలు కండువాలు వేసి ఆహ్వానించారు. చెన్నాయపాలెంకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు ఒక వలంటీర్ సహా టీడీపీలో చేరారు. తుమ్మలపెంట పంచాయతీ ఇందిరానగర్‌కు చెందిన 10 వైసీపీ కుటుంబాలు, అన్నగారిపాలెం పంచాయతీ మామిళ్ల దొరువుకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. చలంచర్లకు చెందిన వైసీపీ కీలక నేతలు, రుద్రకోటకు చెందిన వైసీపీ ముఖ్యనేతలు టీడీపీలో చేరారు. పట్టణం లోని 14వ వార్డుకు చెందిన వైసీపీ సానుబూతిపరుడు కసుమూరు భాస్కర్ రెడ్డి, ఇంటూరి రమణయ్య, మందా పెద్దబ్బయ్యలు, 26వ వార్డుకు చెందిన వైసీపీ కీలకనేతలు కన్నె బాలకృష్ణ, జయంత్ టీడీపీలో చేరారు. పాతూరుకు చెందిన ప్రభాస్ ఫ్యాన్స్ గౌరవాధ్యక్షుడు పల్లెబోయిన కార్తీక్ వైసీపీని వీడి టీడీపీలో చేరారు.



వేమిరెడ్డికి తిలకం దిద్దుతున్న మహిళ

మాలేపాటి సోదరుల ప్రచారం

దగదర్తి(బిట్రగుంట), మే 2: దగదర్తి మండలంలోని పలు గ్రామాలలో మాలేపాటి సోదరులు, వారి కుమారుడు వేర్వేరుగా గురువారం ప్రచారం నిర్వహించారు. కౌరుగుంట పంచాయతీ సున్నపుబట్టిగ్రామం, ఎస్టీ కాలనీల్లో ఇరిగేషన్ బోర్డు మాజీ డైరెక్టర్ మాలేపాటి రవీంద్రనాయుడు ప్రచారం చేశారు. వైసీపీ ఏడవ వార్డు మెంబరు సుబ్బమ్మ, ఆమె భర్త శ్రీనివాసులుతో పాటు 30 మంది రవీంద్రనాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. దగదర్తి మెయిన్ విలేజ్ అరుగు సెంటర్, తదితర ప్రాంతాల్లో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు ఇంటింటి ప్రచారం చేపట్టారు. దగదర్తి గిరిజన కాలనీల్లో పార్టీ యువనేత మాలేపాటి భానుచందర్‌నాయుడు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థులు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కావలి ఎమ్మెల్యేగా దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు.

బోగోలులో తెలుగు తమ్ముళ్ల...

బిట్రగుంట : బోగోలు మండలంలో తెలుగు తమ్ముళ్లు విడివిడిగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బోగోలు మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు, సీనియర్‌నాయకులు గనిపినేని నాగరాజుల ఆధ్వర్యంలో బోగోలు మార్కెట్ వీధి, కుమ్మరవీధి, మసీదు వీధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట టీడీపీ మండల మహిళ అధ్యక్షురాలు అరుణమ్మ, పార్వతి, వెంకట్రావు, ఎస్ఎస్ యాదవ్ తదితరులు ఉన్నారు. బోగోలు, అక్కరాజువారి కండ్రిక గ్రామాల్లో బోగిరి ప్రభాకర్ ఆధ్వర్యంలో యువత ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

జోరందుకున్న టీడీపీ ప్రచారం



ఇంటింటి ప్రచారంలో బినీత్‌రెడ్డి, చందన్‌రెడ్డి

అల్లూరు, మే 2 : ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తెలుగు తమ్ముళ్లు ప్రచార జోరు పెంచారు. ఏ వార్డు నాయకులకు ఆ వార్డు కేటాయించిన నాయకులు తమ కార్యకర్తలతో కలసి ప్రచారాలను ముమ్మరం చేశారు. గురువారం అల్లూరు పేటలో కావలి ఎమ్మెల్యే అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి అల్లుడు వాకాటి బినీత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మేనల్లుడు ఎ.చందన్‌రెడ్డిలతో కలసి స్థానిక నాయకులు మేడా రామకృష్ణారెడ్డి, మేడా కృష్ణారెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, యరటపల్లి శేఖర్‌రెడ్డి, బిట్రగుంట చైతన్య రెడ్డి, దయాకర్‌రెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. లీగల్ సెల్ నాయకుడు షేక్ రఫీమాలిక్ ఆధ్వర్యంలో అల్లూరు పట్టణ పరిధిలో పలు ప్రాంతాల్లో ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం వస్తే వచ్చే పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే టీడీపీ పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అల్లూరు ఆర్‌డీఆర్ కాలనీలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సంక్షేమ పథకాలను వివరిస్తూ కావలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కావ్య కృష్ణారెడ్డి, ఎంపీగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో పెనుమల్లి శ్రీనివాసులు రెడ్డి, ఖదీర్, వెంకటశేషయ్య, శీనయ్య, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

48 మంది వలంటీర్ల రాజీనామా

లింగసముద్రం, మే 2 : లింగసముద్రం మండలంలోని 13 సచివాలయాల పరిధిలోని ఉన్న 201 మంది వలంటీర్లలో ఇప్పటి వరకు 48 మంది రాజీనామా చేశారు. మరో ఇద్దరిని అధికారులే తొలగించారు. ప్రస్తుతం 13 151 మంది వలంటీర్లు ఉన్నారు. అయితే వైసీపీకి సేవ చేసేందుకు ఈ 48 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్టు తెలిసింది.

ఎన్‌డీఏ అభ్యర్థులను గెలిపించండి

కొండాపురం, మే 1: ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలో ఉన్న ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ మండలంలోని గుడవళ్లూరు పంచాయతీలో టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబు, పోలినేని రమేష్ ఆధ్వర్యంలో గురువారం కాకర్ల సురేష్ సోదరుడు సునీల్ సతిమణి సురేఖ ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలతోపాటు జనసేన, బీజేపీ ఉమ్మడి మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన అంశాలు అన్ని వర్గాల వారి సంక్షేమానికి తోడ్పడుతుందని వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఎం.ఓంకారం, పరిశీలకుడు కే.సుబ్బారావు, టీడీపీ నాయకులు దాసరి అశోక్, నర్రా శివన్నారాయణ, చిమ్మిలి రాంబాబు, సర్పంచు మాచెర్ల, యారవ క్రిష్ణయ్య, సీహెచ్.వెంకటాద్రి, దామా మహేశ్వరరావు, బీజేపీ అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జున, జనసేన నాయకులు ఆకుల వెంకట్, ఎమ్ఆర్‌పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న కాకర్ల సురేఖ



బ్యాంకు గోడలపై వైసీపీ రంగులు

'కోడ్'లోనూ తొలగించని వైసీపీ రంగులు

కావలి రూరల్, మే 1: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా నిత్యం ఏదో ఒక చోట ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు జరుగుతూనే ఉన్నాయి. కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని జనతాపేటలోబ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకుకు ఎదురుగా గతంలో వైసీపీ పార్టీ జెండా దిమ్మెను ఏర్పాటు చేశారు. అయితే పార్టీకి చెందిన మూడు రంగులను జెండా దిమ్మెతో పాటుగా విద్యుత్ స్తంభానికి, వెనుక వైపున ఉన్న విశ్వోదయ బాలుర పాఠశాల ప్రహరీకి రంగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో పాటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కూడా ఆ రంగులు అలాగే ఉండటం పట్ల అధికారుల తీరుపై పట్టణ వాసులు చర్చించుకుంటున్నారు.

సెంటిమెంట్



నృసింహుడిని దర్శించుకున్నాకే ప్రచారం

ఏ ఎన్నికలైనా, ఏ పార్టీ అభ్యర్థులైనా మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నాకే ప్రచారం మొదలు పెడతారు. కందుకూరు నియోజకవర్గంలో ఈ సెంటిమెంట్‌ను ప్రతి ఒక్క నేత కూడా పాటిస్తారు. స్వర్గీయ మాజీ స్పీకర్ దివి కొండయ్య చౌదరి, మాజీ మంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, స్వర్గీయ జడ్పీ మాజీ చైర్మన్ గుత్తా వెంకటసుబ్బయ్య తదితరులు ఈ సెంటుమెంట్‌ను కొనసాగించారు. తాజాగా పోటీలో ఉన్న టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు, వైసీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్‌లు కూడా ఇదే పద్ధతిని కొనసాగించారు. ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ ఎవరికి వర్క్ అవుట్ అవుతుందో జూన్ 4 వరకు ఎదురుచూడాల్సిందే.

- వలేటివారిపాలెం

హలో.. అక్కడ ఎవరు గెలుస్తారు ?



'హలో.. మన దగ్గర ఎలక్షన్ ట్రెండ్ ఎలా ఉంది.. ఈసారి ఎవరు గెలవబోతున్నారు. మన జిల్లాలో ఆ పార్టీకి ఎన్ని సీట్లు... ఈ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి..? పలానా అభ్యర్థికి మెజార్టీ ఎంత'... ? అంటూ దేశ, విదేశాల్లోనూ, పక్క జిల్లాల్లో ఉన్న బంధువులు, స్నేహితులు ఫోన్ల ద్వారా సమాచారం తెలుసుకుంటున్నారు. ప్రతిరోజు ఏదో ఒక సమయంలో స్థానికంగా ఉన్నవారికి కానీ ఫోన్ చేసి సమాచారం కనుక్కుంటున్నారు. ఎక్కువగా తెలంగాణ, మహారాష్ట్ర, చెన్నై, అమెరికా, దుబాయ్‌ల నుంచి ఉదయగిరి వాసులకు ఫోన్లు వస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉద్యోగాలు/ వ్యాపారాలు చేస్తూ అక్కడ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నవారు జిల్లా రాజకీయాలపై ఆసక్తి చూపుతున్నారు. వీరితోపాటు ఉద్యోగం, చదువుల కోసం అమెరికాకు వెళ్లిన వారు కూడా గెలుపోటములపై ఆరా తీస్తున్నారు.

- ఉదయగిరి

ప్రలోభాల పర్వం షురూ !

- ఓటర్ల ఫోన్ నెంబర్ల సేకరణ
- వేర్వేరు నెంబర్ల నుంచి మనీ ట్రాన్స్‌ఫర్

పంపకాల జోరు



ఇన్నాళ్లూ ఓ ఎత్తు. ఈ 10 రోజులు మరో ఎత్తు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను తమ దారిలోకి తెచ్చుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డుతున్నారు. బూత్‌ల వారీగా కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ఓటర్ల మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. కొంతమంది నాయకులు ఇప్పటికే ఫోన్ కాల్స్ ద్వారా వారిని పలకరిస్తున్నారు. కాగా మొబైల్ నెంబర్ల సేకరణపై భిన్న ప్రచారాలు సాగుతున్నాయి. నగదు బదిలీ కోసం వివరాలు తీసుకుంటున్నారన్న అభిప్రాయం పలువురిలో వ్యక్తమవుతోంది. నేరుగా నగదు పంపిణీకి క్షేత్రస్థాయిల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా పలువురు ఆన్‌లైన్‌లో బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీలపై కూడా నిఘా ఉంటుందన్న ఎన్నికల అధికారుల హెచ్చరికల నేపథ్యంలో కొందరు కార్యకర్తలు జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. ఒక నెంబరు నుంచి ఎక్కువ మందికి డబ్బులు పంపడం కంటే, వేర్వేరు నెంబర్ల నుంచి పంపేందుకు వారు చర్యలు తీసుకుంటున్నారు. ఓటర్లకు సంబంధించి ఒకరిద్దరి నెంబర్లకు డబ్బులు పంపుతున్నారు. వారి ద్వారా ఆయా కుటుంబాల వారికి అందేలా చర్యలు తీసుకుంటున్నారు.

- వలేటివారిపాలెం

పేద కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ బిడ్డల విద్యావసరాల కోసం ఇబ్బంది పడకుండా అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులను జగన్మాయతో నమ్మించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను బురిడీ కొట్టించేలా హామీలిచ్చిన జగన్ వీటి అమలు విషయంలో మాత్రం మాయలు చేశారు. పథకం ఆరంభం నుంచి ప్రతి ఏడాది కొత్త నిబంధనలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించుకుంటూ వచ్చారు. అనేక కొర్రీలతో అనర్హుల జాబితాను పెంచేశారు. అర్హులకు సైతం పూర్తిస్థాయిలో నగదు విడుదల చేయకుండా రెండో ఏడాది వెయ్యి, 3, 4 సంవత్సరాలు రూ.2వేలు తగ్గిస్తూ నిధులు మిగుల్చుకునేందుకు పన్నిన పన్నాగంలో సఫలీకృతమయ్యారు. గడిచిన ఐదేళ్లలో నాలుగు సార్లు మాత్రమే కోతలతో పథకాన్ని అందించి మాయ చేశారు.

- నెల్లూరు (విద్య)


- 'అమ్మఒడి' పథకంలో కోతలే కోతలు
- కొత్త నిబంధనలతో జాబితాలో పేర్ల గల్లంతు
- నిధులు మిగుల్చుకోవడంలో వైసీపీ సర్కారు సఫలీకృతం

జగన్మాయయ్యా.. మోసం గురూ! ఇదేం మాయ!

జిల్లావ్యాప్తంగా 4,531 పాఠశాలల్లో 4 లక్షల మంది విద్యార్థులు, 215 జూనియర్ కళాశాలల్లో 50 వేల మంది ఇంటర్ చదువుతున్నారు. అమ్మఒడి ప్రారంభిం చిన తొలి సంవత్సరం 2019-20లో తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డులనే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన 2,20,607 మంది అర్హులకు రూ.15వేల చొప్పున నగదు జమ చేశారు. ఆ తర్వాత 2021-22లో 3,75,849 మందిని లబ్ధిదారులుగా గుర్తించగా వీరిలో 81,561 మందిని అనర్హులుగా ప్రకటించారు. మరో 6,698 దరఖాస్తులు పరిశీలనలో ఉంచామని చెపుతూ 2,43,497 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. పాఠశాలల పారిశుధ్యం మెరుగు పేరుతో ఒక్కో లబ్ధిదారుడికి వెయ్యి రూపాయలను తగ్గించి రూ.14వేల చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 2022-23లో ఈ జాబితాను మరింత వడబోసి 2,00,366 మందిని ఎంపిక చేసి విద్యా సంవత్సరం మధ్యలో మూడుసార్లుగా ఖాతాల్లో జమచేశారు. 2023-24లో అసలు ఈ పథకం ఇస్తారా లేదా అన్న సందేహాలు వ్యక్తం కాగా చివరకు నిబంధనలను మరింత కఠినతరం చేసి లబ్ధి దారుల సంఖ్యను 1,94,842 మందికి కుదించి నాలుగు విడతలుగా అందచేశారు.

నిబంధనలతో మెలిక

పథకం అమలుకు కొత్త నిబంధనలు తీసుకురావడంతో లబ్ధిదారుల సంఖ్యను కుదించేశారు. పలు కుటుంబాల్లో రూ.12వేల కంటే అధికంగా వేతనం పొందడం, అత్యధిక శాతం మంది 300 యూనిట్ల కంటే ఎక్కువగా విద్యుత్ వాడకం, 75శాతం విద్యార్థులకు హాజరు లేకపోవడం, తల్లుల పేరున్న రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు లేకపోవడం వంటి సాంకేతిక కారణాలతో ఎక్కువమందికి అమ్మఒడి తొలగించారు. రేషన్ కార్డులో కుటుంబ సభ్యులు ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లింపుదారుడు ఉన్నా, ఇంటి విస్తీర్ణం మోతాదుకు మించినా సంక్షేమ పథకాలు ఆపేశారు. అమ్మఒడికీ ఇవే నిబంధనలు వర్తింప చేసి విద్యార్థులపై అనర్హత వేటు వేశారు. వీటికి తోడు అన్ని అర్హతలు ఉన్నా అకౌంట్ల ఇన్‌యాక్టివ్ చూపడంతో మరికొంతమంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అమ్మఒడి లబ్ధిదారుల జాబితాలను సచివాలయాల్లో వెల్లడించగా వీటిలో అత్యధికంగా తిరస్కరణకు గురైన జాబితాలే ఉండటం గమనార్హం. ప్రధానంగా ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోపాటు అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ప్రైవేట్ సంస్థల్లో పీఎఫ్ సౌకర్యం ఉండే వారికి ఈ పథకం అందని పరిస్థితి ఏర్పడింది. ఇక విద్యుత్ వాడకం విషయానికి వస్తే మారిన జీవనశైలి నేపథ్యంలో గృహ అవసరాలకు విద్యుత్ ఆధారిత వస్తువుల వాడకం అధికమైంది. వీరిని అమ్మఒడికి అనర్హులంటూ తీసేశారు. అలాగే ఎన్నడూ లేని 75 శాతం హాజరు తప్పనిసరి చేయడంతో చాలామంది విద్యార్థులు ఈ పథకానికి దూరమయ్యారు. కరోనా నేపథ్యంలో చాలామంది పిల్లలను స్కూళ్లకు పంపకపోవడం, అత్యధికంగా వలసలు ఉండడం వలన హాజరు శాతం తగ్గతా దీనికి కోత విధించారు. అదేవిధంగా పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల స్థలంలో ఇల్లు ఉన్నవారిని సైతం నిబంధనల పేరుతో నిలిపివేస్తూ కోతలే లక్ష్యంగా ప్రభుత్వం వ్యవహరించడంతో విమర్శలకు గురైంది.



బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు

అమ్మఒడి జాబితాల్లో చాలామంది అర్హుల పేర్ల పక్కన ఇన్‌యాక్టివ్ అకౌంట్ అని చూపించింది. దీంతో వలంటీర్లు లబ్ధిదారులకు ఫోన్ చేసి మీ అకౌంట్ ఎన్‌పీసీఐ కాలేదని, వెంటనే బ్యాంకుకు వెళ్లి చేయించుకోవాలని, లేనిపక్షంలో అమ్మఒడి నగదు పడదని చెప్పడంతో తల్లులు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బ్యాంకుల వద్ద సర్వర్ పనిచేయడం లేదని కొందరు, తమ బ్యాంకులో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)కు సంబంధించిన సర్వర్ లేదని, ప్రధాన బ్రాంచ్‌లకు వెళ్లాలని తెలపగా, కొన్నిచోట్ల గంటల తరబడి వేచిచూసిన తరువాత అకౌంట్‌కు ఎన్‌పీసీఐ చేయించుకున్నా అది మూడు రోజుల తర్వాత కానీ యాక్టివ్ కాదని చెప్పడంతో నిరుత్సాహానికి గురయ్యారు.

రెండుసార్లే ఇచ్చారు!

కావలిలోని ముసునూరుకు చెందిన ఆటోడ్రైవర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతులకు వెంకట అనీష్, రిషేంద్ర ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఈ అన్నదమ్ముళ్లలో ఒక్కరికి మాత్రమే అమ్మఒడి అందింది. అదికూడా రెండుసార్లు మాత్రమే. మూడోసారి ఎందుకు రాలేదని అధికారుల చుట్టూ తిరిగినా వారు పట్టించుకున్న దాఖలాలు లేవు.

- బెల్లంకొండ జ్యోతి, ముసునూరు, కావలి

ఇంకా డబ్బులు పడలేదయ్యా!

2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంకా డబ్బులు పడలేదు. పెనుబల్లి హైస్కూల్లో నా కూతురు భవ్యశ్రీ 10వతరగతి చదివి, పాసైంది. ఇంటర్‌లో చేర్పిద్దాం అనుకుంటే ఇంకా అమ్మఒడి డబ్బులు పడలేదు. ఇంతకూ పడతాయే లేదననే అనుమానం ఉంది. ఆ డబ్బు పడితే కాలేజీ ఫీజు అవసరాలు తీరుతాయి.

- కావేటి కల్యాణి, పెనుబల్లి, బుచ్చిరెడ్డిపాళెం

చిత్తశుద్ధి గల నేతకే నా ఓటు

యువగళం



నాకు కొత్తగా ఓటు వచ్చింది. నిజ మైన పేదలందరికీ మేలు చేకూర్చాలన్న చిత్తశుద్ధి గల నేతకే నా ఓటు. నిరుపేదల కోసం పథకాలు ప్రవేశపెట్టే నాయకుడిని ఎన్ను కోవాలి. విద్య, వైద్యం అందరికీ అందుబాటు లోకి తీసుకు రావడంపై దృష్టి పెట్టే నేతను ఎన్నుకోవాలి. పార్టీలకతీతంగా ఆలోచించి చిత్తశుద్ధి కలిగిన నాయకుడిని అసెంబ్లీకి పంపాలి. అదే నా ఆలోచన. అలాంటి వారినే గెలిపించాలి.

- మోడెం దేవర్షి, కోవూరు

ప్యాకేజీల వీరులు.. ఓట్లు లేని ధీరులు !





తమ చేతిలో వందలాది ఓట్లు ఉన్నాయని, తాము ఏ పార్టీకి చెబితే వారంతా ఆ పార్టీకే ఓట్లు వేస్తారని చెప్పి కొంత మంది చోటా మోటా నేతలు అభ్యర్థుల వద్ద నుంచి రూ. లక్షల్లో ప్యాకేజీలు తీసుకోవడం నేడు అలవాటుగా మారింది. వీరి దాటికి గ్రామాల్లో కొద్దోగొప్పో ఓట్లు ఉన్న నేతలు జీరోలుగా మారారు. ఓట్లు లేని ప్యాకేజీ వీరులు మాత్రం.. ఆహో... ఓహో... అంటూ ప్రచారం ఆర్భాటం చేస్తున్నారు. ఇలాంటి వారికి ప్యాకేజీలు ఇవ్వకపోతే అభ్యర్థులపై, పార్టీపై నెగిటివ్‌గా ప్రచారం చేస్తున్నారు. అంతేగాక వీరు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకుండా అజ్ఞాతంలోకి వెళ్తున్నారు. మరికొందరైతే ప్యాకేజీల కోసం పార్టీ మారుతున్నా మంటూ ప్రచారం చేసుకొంటున్నారు. ప్యాకేజీ వీరులు చేస్తున్న ఈ ప్రచారం ఆ నోటా ఈ నోటా పడి మండల స్థాయి నాయ కుల ద్వారా అభ్యర్థుల దృష్టికి వెళ్తోంది. దీంతో తమ గెలుపునకు ఎక్కడ ఇబ్బంది జరుగుతుందోననే భయతో అభ్యర్థులు వారిని పిలిపించి ప్యాకే జీలు ఇస్తున్నారు. కాగా ఓట్లులేని నాయకులకు ప్యాకేజీలు ఇవ్వ డంతో అవతల పార్టీ వారు ఎక్కడ విజయం సాధిస్తారోనని పలువురు గుసగుస లాడుతున్నారు.

- వలేటివారిపాలెం

మళ్లీ పాత రోజులొస్తున్నాయ్..!



ఏందిరా వచ్చేది పాత రోజులు...! ఎట్టావస్తయిరా కొండయ్యా...?

వస్తాయిలే ఎంకన్నా... నిన్న చంద్రబాబు చెప్పిల్లా...!

ఏం చెప్పిండ్రా కొండయ్యా... చంద్రబాబు!

మన రైతులకు గతంలో మాదిరే గొర్రులు, నాగళ్లు, తైవాన్ పంపులు, డ్రిప్ పైపులు, స్ప్రింక్లర్లు గట్రా... అన్నీ కూడా సబ్సిడీపై ఇస్తాడంట ఎంకన్నా ...

ఓ ఔనా... ఐతే పరవా లేదురా కొండయ్యా... జగన్ ఈ ఐదేళ్లలో రైతు భరోసా తప్పనిచ్చి ఏమీ ఈలేదురా మన రైతులకి... గతంలో చంద్రబాబు అన్నీ ఇచ్చిండు. మన జిల్లావోడు సోమిరెడ్డి వ్యవసాయమంత్రిగా ఉన్నప్పుడు జింక్, బోరాన్, ఐరన్ లాంటి సూక్ష్మపోషకాలు ఉచితంగా ఇస్తే కదా..? మనకి అప్పట్లో వడ్ల దిగుబడి బాగా వొచ్చి ఎకరాకి యాభై బస్తాలకి పైనైనే అయినయ్యి కొండయ్యా...

అవును ఎంకన్నా.. అదే నేను చెప్పేది... అంతే కాదన్నా రైతులకు ఏడాది ఇరవైవేల రూపాయలు కూడా ఇస్తాడంట !

ఏందీ... కొండయ్యా.. ఇరవైవేలా ?



అవునన్నా మనకి జగను, మోదీ కలిపి ఇప్పుడు ఇచ్చేది ఏడాదికి పదమూడువేలా ఐదొందలు కదా... చంద్రబాబు ఇరవైవేలిస్తాడంట ఎంకన్నా...!

మరి జగను ఎంతిస్తానన్నాడు కొండయ్యా...?

ఏంది ఎంకన్నా... ఆయనిచ్చేది... పదారుయేలు ఇస్తాడంట !

ఏందిరో పదారేలా.. నిజమా.. అదేంద్రా నాయనా ఐదేళ్లు సీఎం ఉంటే ఒక్క రైతుకు కూడా గొర్రులు, నాగేళ్లు, పంపులు కూడా ఈయలే... మళ్లా వచ్చినా కూడా ఇయ్య డేమో... ఒరే... మన రైతులకు మేలు చేసేది... చంద్రబాబేరా... ఆయున్నప్పుడు ట్రాక్టర్ నాగళ్లకు పదేలు కడితే ఇచ్చేవార్రా... మొన్నీమధ్య డెమానిస్ట్రేటర్‌ని అడిగితే సబ్సిడీలు లేవని చెప్పినారు. చేసేది లేక కావిలికి పోయి ఇరవైయేలు పెట్టి కనుక్కొచ్చారా...

అవును ఎంకన్నా... మన రైతులకి చంద్రబాబు ఐతేనే సబ్సిడీలు ఇచ్చేది... అందుకే ఆయనకే మన ఓట్లు ఏస్తే పోలా !

అంతేరా... రైతులందరం సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఇచ్చే చంద్రబాబుకే ఓట్లేసి గెలిపించుకుందాం రా... కొండయ్యా...!


- జలదంకి

ప్రతి 'సారీ'!

- అందరికీ ఉద్యోగ కల్పన.. కాలుష్యాన్ని నివారిస్తాం
- ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచార అస్త్రాలివే!
- తీరా గెలిచాక ముఖం చాటేస్తున్న వైనం
- ఐదేళ్లయినా నెరవేరని, జగన్, కాకాణి హామీలు

ఎన్నికల అస్త్రం


నేలటూరులోని థర్మల్ కేంద్రం


కాళ్లకు నల్లగా అంటుకున్న బొగ్గు

ముత్తుకూరు : ఎన్నికల్లో బరిలో నిలిచే అభ్యర్థులకు యుద్ధప్రాతిపదికన గుర్తొచ్చేవి నిరుద్యోగం, కాలుష్యం. ప్రతి ఎన్నికల్లోనూ ఇవే అంశాలను ప్రధాన ప్రచార అస్త్రాలుగా మార్చుకుని ఓట్లు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాలను వదిలేసి మళ్లీ ఐదేళ్లు కాగానే నెత్తిన పెట్టుకోవడం పరిపాటిగా మారింది. 2005 ఎన్నికల్లో అప్పట్లో నిరుద్యోగం నిర్మూలన అనే అంశం తెరపైకి వచ్చింది. 2009లో దీనికి కాలుష్య నియంత్రణ తోడైంది. 2014, 2019 ఎన్నికల్లో ఈ రెండు అంశాలనే ప్రస్తావిస్తూ అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్న చేశారు. నియోజకవర్గంలో ఎక్కడా నిరుద్యోగం అనే మాటే కనిపించదని, కాలుష్యాన్ని తరిమికొట్టే చర్యలు తీసుకుంటామని హామీలు గుప్పించారు. మండలంలో థర్మల్ కేంద్రాలు, అదానీ కృష్ణపట్నం పోర్టు, పామాయిల్ పరిశ్రమలు ఉన్నా స్థానికులు ఉద్యోగ అవకాశాలు కల్పించింది స్వల్పమే. అందులో అధిక శాతం రోజువారి కూలీలు కావడం గమనార్హం. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా కొందరికి అవకాశం దక్కినా ఇప్పటివరకు పర్మినెంట్ చేసిన దాఖలాలు లేవు. మళ్లీ సార్వత్రిక ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో మరోసారి నిరుద్యోగ నిర్మూలన, కాలుష్య నియంత్రణ తెరపైకి వచ్చాయి. ప్రధానంగా కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ తరలింపు అంశం ప్రధాన సమస్యగా ప్రస్తావనకు వస్తోంది. ఈ మూడు అంశాలను తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామంటూ హామీలు గుప్పిస్తూ అధికార ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ముమ్మరం చేశారు. గత ఐదేళ్లలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోలేదని, తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామని ప్రజలకు చెప్పడంలో ప్రతిపక్షం కొంతమేర సఫలమైంది.

పేలని జ'గన్'!

వైసీపీ అధికారంలోకి రాగానే స్థానికులకు 70 శాతం ఉద్యోగాలు ఇస్తామని జగన్ తన పాదయాత్రలో హామీ ఇచ్చారు. మూడున్నరేళ్ల కిందట ప్రభుత్వం నుంచి జీవో తీసుకువచ్చి నిరుద్యోగం అనే మాటే కనిపించదని ప్రస్తుత మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి డాంబీకాలు పలికారు. ఆ తర్వాత ఉద్యోగాలు కల్పించే దిశగా ఎలాంటి చర్యలు లేవు. నైపుణ్య శిక్షణ కల్పిస్తామని ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పిన మాటలు గాలిలో కలిసిపోయాయి. మళ్లీ ఎన్నికలు రాగానే నిరుద్యోగ నిర్మూలన అంశాన్ని తెరపైకి తెచ్చారు.

కాలుష్య నియంత్రణ ఏదీ!?

ఏర్పడిన పరిశ్రమల ద్వారా ఏర్పడుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. థర్మల్ కేంద్రాల నుంచి వచ్చే బూడిద కాలుష్యం ఒకవైపు గ్రామాలను ముంచెత్తుతుండగా, కృష్ణపట్నం పోర్టులో దిగుమతి అవుతున్న బొగ్గు కాలుష్యం పరిసర గ్రామాలను తీవ్ర ప్రభావితం చేస్తోంది. అంతకుమించి పంటపాలెం లోని పామాయిల్ పరిశ్రమల వల్ల ఏర్పడుతున్న వాయు కాలుష్యం చుట్టుపక్కల గ్రామాల ప్రజలను అనారోగ్యం పాలుచేస్తోంది. రాత్రుళ్లు వచ్చే దుర్గంధం భరించలేక పోతున్నారు. గ్రామాల్లో ఊపిరితిత్తులు శ్వాసకోశ వ్యాధులతో రోజురోజుకు అధికమవుతుంది. పట్టించుకోవాల్సిన ప్రజాప్రతి నిధులు ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేయగా మామూళ్ల మత్తులో తేలియాడుతున్న అధికారులు తూతూ మంత్ర చర్యలతో చేతులు దులుపుకుంటున్నారు.

నిరుద్యోగులను నట్టేట ముంచేశారు!



పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తూ జీవో తెచ్చామని చెప్పి నిరుద్యోగులను మభ్యపెట్టారు. ఒకరికి కూడా పరిశ్రమల్లో ఉద్యోగం కల్పించిన దాఖలాలు లేవు. మళ్లీ ఇప్పుడు నిరుద్యోగ నిర్మూలిస్తామని మాటలు చెబుతూ ఓట్లు దండుకునేందుకు వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వం, మంత్రి కాకాణి నిరుద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు.

- యల్లసిరి రాజేష్, పైనంపురం

పట్టించుకునేదెవరు!?



పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో ప్రజలు ప్రాణాలు పోతున్నా పట్టించుకునే వారు లేరు. పామాయిల్ పరిశ్రమల వల్ల వచ్చే వాయుకాలుష్యం కృష్ణపట్నం పోర్టులని బొగ్గు కాలుష్యం, థర్మల్ కేంద్రాల ద్వారా వచ్చే బూడిద కాలుష్యం ప్రజలను అనారోగ్యం పాలుచేస్తున్నాయి. పామాయిల్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాల ప్రజలు ఊపిరితిత్తులు శ్వాసకోశ వ్యాధులతో అల్లాడుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ప్రజాప్రతినిధులు, కాలుష్య నియంత్ర మండల అధికారులు పట్టించుకోలేదు.

- రొయ్యల రంగనాథ్, పంటపాలెం